Dwaraka

గురువారం
25•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 228
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



బుధవారం రాంచీలో సీబీఐ కోర్టుకు హాజరయ్యేందుకు బిర్సా ముండా జైలు నుంచి వెళ్తున్న బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్

లాలూకు మరో ఐదేండ్ల జైలు

- దాణా కుంభకోణం మూడో కేసులో దోషిగా నిర్ధారణ
- మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాకూ ఐదేండ్ల శిక్ష
- 50 మందిని దోషులుగా తేల్చిన న్యాయస్థానం

రాంచీ, జనవరి 24: దాణా కుంభకోణానికి సంబంధించి మూడో కేసులో బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్‌యాదవ్‌కు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఐదేండ్ల జైలుశిక్ష విధించింది. మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాను సైతం దోషిగా తేల్చింది. ఇద్దరికీ ఐదేండ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ జస్టిస్ ఎస్ ఎస్ ప్రసాద్ బుధవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో మొత్తం 50 మందిని దోషులుగా నిర్ధారించారు. దాణా కుంభకోణంలో భాగంగా 1992-93లో నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి చాయ్‌బసా ఖజానా కార్యాలయం నుంచి రూ.33.67 కోట్లు విత్‌డ్రా చేశారని ఆరోపణలు వచ్చాయి. విచారణ చేపట్టిన సీబీఐ.. ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో



పద్మావత్ చిత్రాన్ని విడుదల చేయకూడదంటూ బుధవారం భోపాల్‌లో కర్ణిసేన కార్యకర్తలు సృష్టించిన విధ్వంసంలో తగులబడుతున్న కారు మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పద్మావత్ మంటలు

కర్ణిసేన కార్యకర్తల విధ్వంసకాండ

సంజయ్‌లీలా బన్సాలీ చిత్రం 'పద్మావత్' గురువారం విడుదల కానుండటంతో రాజ్‌పుత్ కర్ణిసేన కార్యకర్తలు ఉత్తరాదిన ఐదు రాష్ట్రాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆ చిత్రం విడుదలకు నిరసనగా వారి ఆందోళన పలు ప్రాంతాల్లో హింసాత్మకంగా మారింది. బుధవారం 40 వాహనాలకు నిప్పు పెట్టారు. అహ్మదాబాద్‌లోని పలు థియేటర్లపై కర్ణిసేన కార్యకర్తలు దాడులు జరిపారు. మాస్కులు ధరించి కార్యకర్తలు పెట్రో బాంబులు విసరడంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు గాలిలోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు.

11

తెలంగాణ పిలుస్తోంది

పరిశ్రమల వృద్ధికి విస్తృత అవకాశాల వేదిక

- దావోస్ వేదికగా దిగ్గజ సంస్థలతో మంత్రి కేటీఆర్ వరుస సమావేశాలు
- రాష్ట్రంలో పర్యటించాలని ఆహ్వానాలు
- హైదరాబాద్ కేంద్రాన్ని విస్తరించనున్న నోవార్టిస్
- భారీ ప్రాజెక్టులకోసం చూస్తున్నామన్న మిత్సుబిషి
- టీహబ్‌తో భాగస్వామ్యానికి హెచ్‌పీ కంపెనీకి వినతి
- కలిసి పనిచేసేందుకు అవకాశాలపై హిటాచీతో చర్చలు
- ఆసక్తి చూపిన వివిధ కంపెనీల ముఖ్యులు



బుధవారం దావోస్‌లో హిటాచీ గ్రూప్ చైర్మన్ హిటాచీ నకనిషి శాన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో హిటాచీ సీనియర్ మేనేజ్‌మెంట్ బృందం సభ్యులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణలో పరిశ్రమల వృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారక రామారావు పలువురు దిగ్గజ కంపెనీల అధినేతలకు చెప్పారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొంటున్న మంత్రి.. రెండోరోజైన బుధవారం ఎయిర్ ఏసియా, నోవార్టిస్, మిత్సుబిషి, హ్యూలెట్ ప్యాకర్డ్ (హెచ్‌పీ), హిటాచీ, ఫవద్ అల్గానిమ్ కంపెనీ, ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ దుబాయ్ తదితర ప్రముఖ కంపెనీల ముఖ్యులతో వరుస సమావేశాలతో బిజీగా గడిపారు. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని మంత్రి వారికి వివరించారు. ఉదయం ఎయిర్ ఆసియా గ్రూప్ సీఈవో ఆంటోనీ ఫెర్నాండెజ్, ఉప కార్యనిర్వహణాధికారిణి ఎయిరీన్ ఒమర్‌తో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. దేశంలో రానున్న రోజుల్లో విమానయానరంగం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచస్థాయిలో అనేక అవార్డులు గెలుచుకున్నదని తెలిపారు. జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ దిగ్గజం హిటాచీ గ్రూప్ చైర్మన్ హిరవోకి

మిగతా 2వ పేజీలో



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బరాజ్ వద్ద పర్యటిస్తున్న కేంద్ర పర్యావరణశాఖ కార్యదర్శి సీకే మిశ్రా, అధికారులు

దేశప్రగతికి వరం కాళేశ్వరం

- మహాయజ్ఞంలా కనిపిస్తున్న ప్రాజెక్టు.. దేశంలోనే ఒక అద్భుత సృష్టి
- కేంద్ర పర్యావరణ కార్యదర్శి సీకే మిశ్రా
- ప్రాజెక్టుల సందర్శన.. మిషన్‌భగీరథకు అభినందనలు
- హరితహారం దేశానికే ఆదర్శమని వ్యాఖ్య

ప్రత్యేక ప్రతినిధి, జయశంకర్ జిల్లా ప్రతినిధి, మంథని, గజ్వేల్‌రూరల్, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు దేశ ప్రగతికి దోహదపడనుందని కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండడంపై సంతోషం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మహాయజ్ఞంలా కనబడుతున్నదని చెప్పారు. దేశ ప్రగతికి ఇది గొప్ప నాందిగా నిలుస్తుందన్నారు. దండకారణ్యంలో ఇంతమంది అధికారులను సమన్వయపరుస్తూ, ఇంత వేగంగా పనులను చేపట్టడం ఎక్కడా

మిగతా 12వ పేజీలో

మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం

- ప్రజాహిత తపనకు నిదర్శనం ఈ ప్రాజెక్టు
- డైనమిక్ ముఖ్యమంత్రి కేసీఆర్
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరు అద్భుతం
- ఒడిశా అధికారుల బృందం ప్రశంసలు

3



ఎంఎంటీఎస్ ఎదుట సెల్ఫీచ్చి!

హైదరాబాద్ భరత్‌నగర్‌లో ఘటన
యువకుడికి గాయాలు.. కేసు నమోదు

మే 6న ఎంసెట్ ఉండదు

నీట్ కోసం ఆ రోజున విరామం

2

తెలంగాణకు ఆరు శౌర్యపతకాలు

ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట పోలీస్ పతకాలు
13మందికి ఉత్తమ పోలీస్ సేవాపతకాలు



అలనాటి మేటి నటి కృష్ణకుమారి కన్నుమూత

క్యాన్సర్‌తో బెంగళూరులోని స్వగృహంలో తుదిశ్వాస

వివరాలు చిత్రం పేజీలో

తెలంగాణకు ఆరు శౌర్య పతకాలు



అవార్డులకు ఎంపికైన జితేందర్, ఎం రమేశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖలో విశిష్ట సేవలు అందించిన పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించింది. ఈ మేరకు ఆ జాబితాను కేంద్ర హోంశాఖ బుధవారం విడుదల చేసింది. పోలీస్ శౌర్య పతకం (పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ), రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవాపతకం, ఉత్తమ పోలీస్ సేవా పతకం సహా మొత్తం మూడు క్యాటగిరీల్లో కలిపి 795మందికి అవార్డులు దక్కాయి. వీరిలో 75మందికి రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవాపతకం, 107మందికి పోలీస్‌సేవా శౌర్య పతకం, 613 మందికి ఉత్తమ పోలీస్ సేవా పతకాలు దక్కాయి. తెలంగాణ నుంచి పోలీస్ శౌర్య సేవా పతకానికి (గ్యాలంట్రీ) ఆరుగురు, రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకానికి ఇద్దరు, ఉత్తమ పోలీస్ సేవా పతకానికి 13 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు.

పోలీస్ శౌర్య పతకం పొందినవారు
బీ శ్రీరాములు, వెంకట శ్రీనివాస్‌రెడ్డి (ఏఏసీలు), జీ సురేశ్, ఎం మురళి, పీ లక్ష్మణుడు, హరీశ్ (జూనియర్ కమాండెంట్లు).

రాష్ట్రపతి విశిష్ట పోలీస్ సేవా పతకం పొందిన వారు
తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ జితేందర్, హైదరాబాద్‌కు చెందిన డీఎస్పీ నరేందర్ నారాయణ రావు చుంగి.

ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట పోలీస్ పతకాలు

13మందికి ఉత్తమ పోలీస్‌సేవా పతకాలు

ఉత్తమ పోలీస్ సేవా పతకం పొందిన వారు
ఎం రమేశ్ (గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్), డీ శివ ప్రసాద్‌రెడ్డి (అసిస్టెంట్ కమాండెంట్, టీఎస్ ఎస్పీ, రంగారెడ్డి), పీ వీరస్వామి (అసిస్టెంట్ కమాండెంట్, హైదరాబాద్), ఎస్ రంగారావు (ఏసీపీ, హైదరాబాద్), తుల్జారాం నరేందర్‌సింగ్ (డీఎస్పీ, హైదరాబాద్), చెట్లూరు శ్రీనివాసశాంతి (ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్), గెద్దిపల్లి రణవీర్‌రెడ్డి(ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్), పల్లె శంకర్‌రెడ్డి (ఎస్సై, హైదరాబాద్), ఎండీ ఫయాజ్ అహ్మద్‌షరీఫ్ (ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్సై, హైదరాబాద్), వేమూరి శివానంద రావు (హెచ్‌సీ, హైదరాబాద్), రాథోడ్ రోహిదాస్ నాయక్ (అసిస్టెంట్ అస్సాల్ట్ కమాండర్, హెచ్‌సీ, హైదరాబాద్), సీ శ్రీనివాస్ (జూనియర్ కమాండో పీసీ, హైదరాబాద్), ఎం సిద్దయ్య (హెడ్‌కానిస్టేబుల్, హైదరాబాద్).

సృజన కుటుంబానికి 10 లక్షల ఆర్థికసాయం

- మహాబతుకమ్మ కార్యక్రమంలో మృతిచెందిన సృజన
- కుటుంబసభ్యులకు చెక్కు అందజేసిన సాంస్కృతికశాఖ డైరెక్టర్



హైదరాబాద్‌లోని సాంస్కృతికశాఖ కార్యాలయంలో సృజన కుటుంబసభ్యులకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న ఆ శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత ఏడాది బతుకమ్మ పండుగ రోజున హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన మహాబతుకమ్మ కార్యక్రమంలో మృతిచెందిన గుండ్లపల్లి సృజన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, తెలంగాణ జాగృతి పక్షాన రూ.5 లక్షలు మొత్తం రూ.10 లక్షల చెక్కును సృజన కుటుంబసభ్యులకు హైదరాబాద్‌లో సాంస్కృతికశాఖ కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అందజేశారు. ఈ నగదును సృజన కుమారుడు, కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. సృజన స్వగ్రామం సూర్యాపేట జిల్లా నూతనకల్లు. గతేడాది మహాబతుకమ్మ పండుగలో ప్రమాదవశాత్తు మృతిచెందిన సృజనకు సాయం అందించాలని ఆమె కుటుంబసభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వారి అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వెంటనే మంజూరు చేసింది. ప్రభుత్వ సాయానికి తోడుగా తాము రూ.5 లక్షల సాయం చేస్తామని తెలంగాణ జాగృతి ప్రకటించి అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సృజన తండ్రి సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి ఉపాధ్యక్షుడు మేడె రాజీవ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి, తెలంగాణ జాగృతి సూర్యాపేట కన్వీనర్ రంగినేని ఉపేందర్‌రావు, సృజన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలు!

11 యూనివర్సిటీల్లో 1,061 ప్రొఫెసర్ పోస్టులు.. జూన్ నాటికి నియామకాల పూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 1,061 అధ్యాపకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిలో ప్రొఫెసర్ పోస్టులు 103, అసోసియేట్ ప్రొఫెసర్లు 266, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 692 ఉన్నాయి. ఈ విషయం పేర్కొంటూ పోస్టుల భర్తీకి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లకు మార్గదర్శకాలు పంపారు. దీంతో వీసీలు నోటిఫికేషన్ల జారీపై దృష్టి సారించారు. సబ్జెక్టులు, క్యాటగిరీల వారీగా ప్రకటించిన ఈ పోస్టులను రోస్టర్ పాయింట్ల ఆధారంగా భర్తీ చేస్తారు. అనంతరం పాలక మండలి సభ్యులతో చర్చించి నోటిఫికేషన్ల షెడ్యూల్‌ను విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలన్నీ నిర్వహించి జూన్ నాటికి పోస్టుల భర్తీని పూర్తి చేసే అవకాశం ఉంది.

పోస్టుల వివరాలు

యూనివర్సిటీ	ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	అసిస్టెంట్ ప్రొఫెసర్	మొత్తం
మహాత్మాగాంధీ	10	15	9	34
పాలమూరు	12	10	41	63
శాతవాహన	9	16	15	40
తెలంగాణ	11	25	23	59
ఆర్జీయూకేటీ	25	11	60	96
బీఆర్ అంబేద్కర్	–	3	7	10
తెలుగు వర్సిటీ	–	1	6	7
కాకతీయ	4	7	125	136
జేఎన్‌యూఎఫ్‌ఏ	0	5	10	15
జేఎన్టీయూహెచ్	32	52	102	186
ఉస్మానియా	–	121	294	415
మొత్తం పోస్టులు	**103**	**266**	**692**	**1,061**

మే 6న ఎంసెట్ ఉండదు

నీట్ కోసం ఆ రోజున విరామం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది మే 6న ఎంసెట్ పరీక్షలుండవని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. మే 2, 3, 4, 5,7 తేదీల్లో యథావిధిగా ఆన్‌లైన్ ఎంసెట్ పరీక్షలు జరుగుతాయన్నారు. మెడికల్ సీట్ల భర్తీ కోసం మే 6న జాతీయస్థాయిలో నీట్–2018 పరీక్ష జరుగుతుంది, కాబట్టి ఆ రోజున మాత్రం తాము ఎంసెట్ పరీక్షలు నిర్వహించబోమని, ఈ ఒక్కటి తప్ప గత నెలాఖరులో విడుదల చేసిన ఎంసెట్ షెడ్యూలులో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు.

మార్చి ఆఖరువరకు నీట్ దరఖాస్తుల స్వీకరణ
జాతీయ స్థాయి నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) రాత పరీక్షను మే 6న నిర్వహించనున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం చేపట్టనున్న నీట్‌ను సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) ద్వారా నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ఉన్న 55 వేల సీట్ల భర్తీకి నిర్వహించే నీట్ పరీక్షకు మార్చి నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

30 నుంచి ఆబ్కారీ కానిస్టేబుళ్ల ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆబ్కారీ కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి రెండు వరకు పరిశీలించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఫిజికల్ క్వాలిఫైయింగ్ టెస్ట్, ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారం హాజరుకావాలని బుధవారం కోరింది.

నిర్వాసితుల త్యాగం మరువలేనిది

మీ దీవెనలు ఉంటే అందరికీ మేలు • గోదావరి జలాలు వస్తే కష్టాలు తీరుతాయి

అందరి సంతోషం కోసమే సీఎం కేసీఆర్ తాపత్రయం

లింగారెడ్డిపల్లిలో కొచ్చగుట్టపల్లి పునరావాస కేంద్రానికి భూమిపూజ

హర్షం వ్యక్తంచేసిన నిర్వాసితులు



సిద్దిపేట అర్బన్ మండలం లింగారెడ్డిపల్లిలో కొచ్చగుట్టపల్లి పునరావాస కేంద్రానికి బుధవారం భూమి పూజచేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'ముంపు గ్రామాల ప్రజల త్యాగం మరువలేనిది.. ప్రభుత్వంపై మీరు చూపిన నమ్మకం, విశ్వాసానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. మిమ్మల్ని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం.. మీ దీవెనలు ఉంటేనే అందరికీ మేలు జరుగుతుంది.. కరువు ప్రాంతాలకు గోదావరి జలాలు వస్తే కష్టాలు తీరుతాయి.. అందరూ సంతోషంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ గారి తాపత్రయం.. రిజర్వాయర్ల కింద ఉన్న ఆయకట్టు రైతులు పంటలు పండించుకొని ఎంత సంతోషంగా ఉంటారో.. భూము లు కోల్పోయిన మీరూ.. అంతకన్న ఎక్కువ సంతోషంగా ఉండేలా చూసే బాధ్యత మాపై ఉంది' అని నీటి పారుదలశాఖ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం లింగారెడ్డిపల్లి శివారులోని 772 సర్వే నంబరులో అనంతగిరి రిజర్వాయర్ ముంపు గ్రామమైన కొచ్చగుట్టపల్లి పునరావాస కేంద్రానికి బుధవారం జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, స్థానికులు, ప్రజాప్రతినిధులతో కలిసి డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న మోడల్ విలేజీకి ప్రభుత్వ భూమి 7 ఎకరాల 18 గుంటలు, అదనంగా 4 ఎకరాలు కొనుగోలు చేసి మొత్తం 11 ఎకరాల 18 గుంటల్లో 145 డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ వచ్చే వానకాలంలో అనంతగిరి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపుతామని చెప్పారు. ఈ రిజర్వాయర్‌లో ముంపు గ్రామమైన కొచ్చగుట్టపల్లిని లింగారెడ్డిపల్లి శివారులో కొత్త గ్రామం గా నిర్మాణం చేసుకుంటున్నామన్నారు. గ్రామంలో గుడి, బడి, అంగన్‌వాడీ కేంద్రం, దవాఖాన, కమ్యూనిటీ భవనాలు, రోడ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కొచ్చగుట్టపల్లిలో కేసీఆర్ ఆ రోజుల్లో హన్మాండ్ల గుడి కట్టించారని, ఇప్పుడు కొత్తగా నిర్మించుకుంటున్న ఈ మోడల్ విలేజ్‌లోనూ కట్టిస్తామని, దీనికి సీఎం కేసీఆర్ సహాయాన్ని తీసుకుందామని చెప్పారు. ఒక్కో కుటుంబానికి 250 గజాల విస్తీర్ణంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఇక్కడ ఆర్‌అండ్ ఆర్ కాలనీని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. రాబోయే ఐదారు మాసాల్లోనే డబుల్ బెడ్‌రూం ఇండ్లు పూర్తి చేసుకొని వచ్చే దసరా రోజు గృహ ప్రవేశాలు చేసుకుందామని చెప్పారు. భూనిర్వాసితులు ఏ చట్టం ప్రకారం కోరుకుంటే ఆ చట్టం ప్రకారం తమ ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వమంటే అదే మాదిరిగా ఇస్తామని తెలిపారు. కొచ్చగుట్టపల్లి గ్రామ ప్రజలు జీవో 120 (21/2017) చట్టం ప్రకారం కోరుకున్నారన్నారు. వారికి అదే తరహాలో అందిస్తున్నట్టు తెలిపారు.

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు ముట్రాజ్‌పల్లి వద్ద..
కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ కింద 8 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, వీటిలో ఏడు గ్రామాల భూసేకరణ పూర్తి కాగా మిగిలిన ఒక గ్రామంలో 50 శాతానికి పైగా పూర్తయిందని, మిగతాది కొద్ది రోజుల్లోనే పూర్తవుతుందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఈ ముంపు గ్రామాలకు గజ్వేల్ పక్కన ఉన్న ముట్రాజ్‌పల్లి వద్ద పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొండపోచమ్మ రిజర్వాయర్ కింద రెండు గ్రామాలు మునుగుతున్నాయని వారంతా భూములు ఇచ్చారని, పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అన్నారు. వీరికి తున్కి బొల్లారం వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారం పది రోజుల్లో ముట్రాజ్‌పల్లి, తున్కి బొల్లారం వద్ద పునరావాస కేంద్రాలకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

ఫిషింగ్ సొసైటీని ఏర్పాటుచేస్తాం

రిజర్వాయర్ల కింద ముంపునకు గురైన గ్రామాల వారికి ఫిషింగ్ సొసైటీని ఏర్పాటుచేసి వాటిలో సభ్యత్వం కల్పిస్తామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. దీంతో ఆ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొని ఉపాధి పొందే హక్కులు ఉంటాయన్నారు. ప్రతి ఏటా చేపల పెంపకం, పట్టుకోవడానికి అగ్రాజ్ వేస్తే మత్స్యశాఖ అధికారుల లెక్కల ప్రకారం సొసైటీలో సభ్యత్వం పొందిన ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష ఆదాయం వస్తుందని తెలిపారు. మోడల్‌కాలనీగా నిర్మించుకుంటున్న ఈ గ్రామానికి మీరే పేరు నిర్ణయించుకోవాలని సూచించారు. గ్రామ పునర్నిర్మాణానికి మహిళలు, పురుషుల నుంచి ఇద్దరేసి సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్‌ఈ వేణు, ఈఈ ఆనంద్, సిద్దిపేట ఆర్డీవో ముత్యంరెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, జెడ్పీటీసీ నముండ్ల కమల రామచంద్రం, స్థానిక సర్పంచులు సత్తవ్వ, రామస్వామి, ఎంపీటీసీలు పుష్ప భూంరెడ్డి, బాలయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

చట్టాలను నమ్ముకోలేదు



సార్ చాలా సంతోషంగా ఉంది.. చట్టాలను మేం నమ్ముకోలేదు. సీఎం కేసీఆర్ సార్‌ను, మిమ్మల్ని (మంత్రి హరీశ్) నమ్ముకున్నాం. మాకు రామసక్కదనమసొంటి జాగాను ఇచ్చిండ్రు. మూలకు ఉన్న మా ఊరును తీసుకొచ్చి సిద్దిపేట పక్కనే కడ్తుండ్రు.
– కార్తీక్ (కొచ్చగుట్టపల్లి)

సిద్దిపేట దగ్గరకు తెచ్చిన్రు



సిద్దిపేట దగ్గర ఊరుగట్టిస్తున్నారు. మా పిల్లలకు కొలువులు వొచ్చేటట్టు సూడుండ్రి.. ఇంతకన్నా ఎక్కువ మేమేం అడుగుత లేం సారు.
–నల్లగొండ (కొచ్చగుట్టపల్లి)

సంతోషంగా ఉంది



మా ఊరు మునిగిపోయిందనే బాధ ఉన్నప్పటికీ మా ఊరోళ్లందరికీ ఒక దగ్గరనే ఊరిని కట్టిస్తుండ్రు. సంతోషంగా ఉంది. మా ఊరును చూసి మిగతా ముంపు గ్రామాల వారు మేం భూములు ఇస్తామని ముందుకొచ్చేలా బాగు చేయాలి.
– అంతవ్వ (కొచ్చగుట్టపల్లి)



దావోస్‌లో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయితో చర్చిస్తున్న మంత్రి కేటీఆర్



నోవార్టిస్ పబ్లిక్ పాలసీ హెడ్ పెట్రాలక్స్‌తో కరచాలనం చేస్తున్న మంత్రి కేటీఆర్

తెలంగాణ పిలుస్తోంది

› మొదటిపేజీ తరువాయి...

నకనిషి, ఆయన సీనియర్ మేనేజ్‌మెంట్ బృందంతో సమావేశమైన కేటీఆర్.. కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కల్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కల్యాణి కూడా పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో విస్తరించనున్న నోవార్టిస్
నోవార్టిస్ కంపెనీ పబ్లిక్ పాలసీ హెడ్ పెట్రాలక్స్‌ను కలుసుకున్న మంత్రి కేటీఆర్.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫార్మాసిటీ గురించి వివరించారు. నగరం ఇప్పటికే భారతదేశ లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా ఉన్నదని తెలిపారు. నగరంలో నోవార్టిస్ కార్యకలాపాల విస్తరణపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌డీ, డాటా సపోర్ట్, అనలిటిక్స్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నామని, దీని అభివృద్ధి పట్ల తాము సంతృప్తిగా ఉన్నామని పెట్రాలక్స్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 90 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ల్యాబొరేటరీని రెట్టింపుచేసి, కొత్తగా సుమారు మరో 150 మంది పరిశోధన సిబ్బందిని నియమించుకోనున్నట్టు చెప్పారు. కంపెనీ కార్యకలాపాల విస్తరణ నగరంలోని జీనోమ్ వ్యాలీ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని, పూర్తి వివరాలను నోవార్టిస్ త్వరలోనే అందిస్తుందని మంత్రి కే తారకరామారావు సమావేశం అనంతరం తెలిపారు.

భారీ ప్రాజెక్టుల కోసం చూస్తున్నాం: మిత్సుబిషి
భారీ ప్రాజెక్టుల అవకాశాల కోసం తమ కంపెనీ ఎదురు చూస్తున్నదని మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయి బృందం మంత్రి కేటీఆర్‌కు వెల్లడించింది. ముఖ్యంగా పారిశ్రామికవాడలు, వ్యర్థాల ప్రాజెక్టులు తదితర ప్రాజెక్టులపై ఆసక్తి ఉన్నట్టు తెలియజేసింది. ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి తమ రాష్ట్రంలో అనేక అవకాశాలున్నాయని, కంపెనీ ప్రతినిధి బృందం స్వయంగా తెలంగాణలో పర్యటించాలని మంత్రి ఆహ్వానించారు. జపనీస్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ పార్క్ (ఎస్‌ఎంఈ)ను తెలంగాణలో ఏర్పాటు చేయాలని మిత్సుబిషి బృందాన్ని కోరారు. గతవారం జపాన్ పర్యటనలో ఇలాంటి పార్కు ఏర్పాటుకు జైకా వంటి ఆర్థిక సంస్థలు నిధులు అందించేందుకు సూత్ర ప్రాయంగా ఒప్పుకున్న విషయాన్ని వారికి మంత్రి తెలిపారు. కువైట్‌కు చెందిన ఫవద్ అల్గానిమ్ కంపెనీ సీఈవో మహ్మద్ అల్గానిమ్‌తో సమావేశమైన మంత్రి కేటీఆర్.. తెలంగాణ ఇప్పటికే సౌర విద్యుత్ ఉత్పాదనలో అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ఈ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఆయనకు వివరించారు. రాష్ట్రంలో పవర్, మెడికల్ డివైజెస్ మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేశారు. ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ దుబాయ్ సీఈవో మహ్మద్ అల్ షయిభానీతో సమావేశమైన కేటీఆర్.. తెలంగాణలో టెక్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులకున్న అవకాశాలను ఈ సమావేశంలో చర్చించారు. హ్యూలెట్ ప్యాకర్డ్ (హెచ్‌పీ) సంస్థ ఉపాధ్యక్షుడు అనా పిన్కుజుక్‌తో సమావేశమై.. హెచ్‌పీ, టీహబ్ భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. నగరంలో హెచ్‌పీ కార్యాకలాపాలను విస్తరించాలని విజ్ఞప్తిచేశారు.

కేటీఆర్‌ను కలిసిన బన్యన్ నేషన్ సహ వ్యవస్థాపకుడు
వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పీపుల్స్‌చాయిస్ అవార్డు గెలుచుకున్న టీహబ్ స్టార్టప్ బన్యన్ నేషన్ సహ వ్యవస్థాకుడు మణి వాజపేయి మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బన్యన్ నేషన్ బృందానికి మంత్రి అభినందనలు తెలిపారు. టీ హబ్ సంస్థకు ప్రపంచ గుర్తింపు దక్కడం పట్ల హర్షం వ్యక్తంచేశారు.

కువైట్ క్షమాభిక్షను సద్వినియోగం చేసుకోవాలి

అక్రమ వలసదారులకు మంత్రి కేటీఆర్ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కువైట్‌లోని అక్రమ వలసదారులకు ఆదేశ సర్కారు పెట్టిన క్షమాభిక్షను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నారై వ్యవహారాలశాఖ మంత్రి కేటీఆర్ సూచించారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 22 వరకు అక్రమంగా కువైట్‌లో నివసిస్తున్న విదేశీయులు, గడువు ముగిసిన వారు ఎలాంటి అపరాధ రుసుం చెల్లించకుండా స్వదేశానికి వెళ్లవచ్చని సూచించింది. ఈ నిర్ణయంతో కువైట్‌లో అక్రమంగా నివసిస్తున్న భారతీయులకు లబ్ధి చేకూరనున్నది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయాన్ని కానీ లేదా తెలంగాణ ఎన్నారై విభాగాన్ని కానీ సంప్రదించాలని మంత్రి కేటీఆర్ కోరారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.04 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం అష్టమి మధ్యాహ్నం 3.16 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: అశ్విని ఉదయం 8.22 వరకు తదుపరి భరణి, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.16 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.05 నుంచి 4.34 వరకు, వర్జ్యం: ఉదయం 9.54 నుంచి 11.30 వరకు.

లోకం పోకడ



వ్యవసాయ బడ్జెట్‌కు సహకరించండి

- వ్యవసాయ, అనుబంధశాఖలకు ఆర్థికశాఖ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018–19 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ బడ్జెట్ రూపకల్పనకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీచేసింది. వారంరోజుల్లోగా పూర్తి వివరాలను నివేదించాలని వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులకు సూచించింది. వార్షికబడ్జెట్‌లో భాగంగా వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా ఆర్థికశాఖ, వ్యవసాయశాఖ అధికారుల ప్రత్యేక సమావేశం బుధవారం సచివాలయంలో జరిగింది. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ డాక్టర్ జగన్‌మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సారి బడ్జెట్‌లో రూ.16 వేల కోట్ల నిధులు అవసరమని ఇప్పటికే వ్యవసాయశాఖ ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపింది.

ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పరిధిలోకి ఆయుష్

సీఎంకు ప్రతిపాదనలు పంపిన వైద్యారోగ్యశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సర్కారు దవాఖానలను బలోపేతం చేస్తూనే.. సంప్రదాయ ఆయుష్ వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నది. ఆయుష్ విభాగంలోని ఆయుర్వేదిక్, యునానీ, హోమియోపతి, నాచురోపతి వైద్య చికిత్సలకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. దీనిపై రూపొందించిన ప్రతిపాదనలను వైద్యారోగ్యశాఖ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు నివేదించింది. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆయుష్ చికిత్సలకు చెల్లించే రుసుముల వివరాలను సీఎం కేసీఆర్ పరిశీలించాక అమలుపరుచనున్నట్టు అధికారులు వెల్లడించారు.

ప్రతీ మండలంలో ప్రణాళికా గణాంకాధికారులు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతీ మండలంలో ప్రణాళికా గణాంకాధికారులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారులకు గెజిటెడ్ హోదా కల్పించాలనే ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో 584 మండలాలు ఉండగా, 121 మండలాల్లో మాత్రమే మండల ప్రణాళికా గణాంకాధికారులు పనిచేస్తున్నారు. 463 మండలాల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

శనగ కొనుగోలుకు నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కనీస మద్దతు ధర పథకం కింద శనగ కొనుగోళ్లకు రాష్ట్రం నుంచి నోడల్ ఏజెన్సీగా టీఎస్ మార్క్‌ఫెడ్‌ను నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్క్‌ఫెడ్‌లో శనగ కొనుగోళ్లపై మార్కెట్‌ఫీజును మినహాయించినట్టు పేర్కొన్నారు.

మైనర్ ఇరిగేషన్ నీటి వినియోగంపై కృష్ణాబోర్డు సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల పరిధిలో మైనర్ ఇరిగేషన్ కింద ఏయే రాష్ట్రం ఎంత నీటిని వినియోగించుకుంటుందనే లెక్కల్ని తీసేందుకు కృష్ణా బోర్డు సిద్ధమైంది. ఈ మేరకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ) అధికారులతో బోర్డు అధికారులు సంప్రదింపులు ముమ్మరం చేశారు. 30న ఎన్‌ఆర్‌ఎస్సీ ప్రతినిధులు బోర్డు కార్యాలయానికి వచ్చి సర్వేకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు తెలిసింది.

ఎంఎంటీఎస్‌తో కిల్ఫీ!

హైదరాబాద్ భరత్‌నగర్‌లో ఘటన • యువకుడికి గాయాలు.. కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సెల్ఫీ సరదా ప్రాణాలపైకి తెచ్చింది. రైల్వేట్రాక్ దగ్గర నిలబడి వేగంగా వస్తున్న రైలుతో సెల్ఫీ తీసుకునే ప్రయత్నం చేసిన యువకుడిని రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు ప్రమాదానికి గురైనా, ప్రాణాలతో బయట పడ్డాడు. హైదరాబాద్‌లోని భరత్‌నగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకోగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. వరంగల్ జిల్లా కరీమాబాద్‌కు చెందిన శివ ఎంబీఏ పూర్తిచేసి హైదరాబాద్‌కు వచ్చాడు. నగరంలోని మాదాపూర్ పర్వతాపూర్‌లో ఉంటూ ఆదివారం బోరబండలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలోనే భరత్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద ఎంఎంటీఎస్ రైలుతో సెల్ఫీ తీసుకునే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ వద్దని చెప్పినా వినకుండా ముందుకు వెళ్లడంతో వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. శివ అక్కడి నుంచి ఎగిరి దూరంగా పడ్డాడు. తల, చేతులు, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన రైల్వేపోలీసులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. అతనిపై ఇండియన్ రైల్వే యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి, రూ.500 జరిమానా విధించారు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు.



హైదరాబాద్‌లోని భరత్‌నగర్‌లో ఎంఎంటీఎస్ రైలు ఎదుట శివ తీసుకున్న సెల్ఫీ వీడియో

రైలు పట్టాలపై కశ్మీరీ ప్రమాదకర ఫీట్!



సాహస వీడియో కోసం కశ్మీర్‌లో రైలు పట్టాల మధ్య పడుకున్న ఆదిల్

• మందలించి వదిలేసిన పోలీసులు

శ్రీనగర్: వేగంగా వస్తున్న రైలు పక్కన నిల్చోవాలంటేనే ఒళ్లు జలదరిస్తుంది. అలాంటిది, ఆ రైలు వెళ్తున్నప్పుడు కింద పట్టాలపై పడుకుంటే ఎలా ఉంటుంది? కశ్మీర్‌లో ఓ యువకుడు ఈ గగుర్పొడిచే సాహసం చేశాడు. దీనిని అతని మిత్రుడు వీడియో తీయడమేగాక మంగళవారం సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో అది వైరలయింది. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు ఆ యువకుడు అనంతనాగ్ జిల్లా బిజ్‌బెహెరాకు చెందిన ఆదిల్‌గా గుర్తించారు. ఆయనతోపాటు స్నేహితుడిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ ఇలాంటి సాహసం చేయొద్దని హెచ్చరించి ఇంటికి పంపించారు. ఈ వీడియో చూసిన ఆదిల్ తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారని, అయితే ఆయనకు ఎలాంటి ప్రమాదం జరుగలేదని తెలిసి ఊరట పొందారని పోలీసులు పేర్కొన్నారు. ఈ వీడియోపై ప్రజలు స్పందిస్తూ.. ఆదిల్‌ను క్షమించాలని కోరారు. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని సూచించారు. సాధారణంగా ఇలాంటి ప్రమాదకర సాహసాలు పందెం కాసి చేస్తుంటారని, ఆదిల్ మాత్రం స్నేహితులు ఉసిగొల్పడంతో చేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. 'ఆదిల్‌ను అరెస్ట్ చేయడంతో ప్రయోజనం లేదు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ ఇలాంటి ఘటన చేయొద్దని హెచ్చరించి పంపించాలి. ఇప్పటికే మన జైళ్లు యువ ఖైదీలతో నిండిపోయి ఉన్నాయి. మూర్ఖపు పనులు నేరం కాదు' అని పేర్కొన్నారు.



ఉత్తమ ఎన్నికల అధికారిగా
బల్దియా కమిషనర్

జనార్దన్‌రెడ్డికి రెండోసారి కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉత్తమ ఎన్నికల అధికారిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన ఈ పురస్కారాన్ని గవర్నర్ చేతులమీదుగా అందుకోనున్నారు. నగరంలో పెద్దఎత్తున బోగస్ ఓట్లు ఉన్నట్టు గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల హైదరాబాద్‌లో ముమ్మర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా జనార్దన్‌రెడ్డి ఓటర్ల జాబితా సవరణలో కీలకపాత్ర పోషించారు. నగరంలో లక్షల సంఖ్యలో బోగస్ ఓటర్లను తొలిగించారు. జాబితా సవరణలో అవకతవకలకు తావులేకుండా ఇంటింటి సర్వే నిర్వహించే ఎన్నికల సిబ్బందికి ట్యాబ్‌లను సమకూర్చి వాటిని జియోట్యాగింగ్ చేయించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని వివాదాలకు తావులేకుండా విజయవంతంగా పూర్తిచేశారు. ఈ క్రమంలోనే కేంద్ర ఎన్నికల కమిషన్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని ఉత్తమ ఎన్నికల అధికారిగా గుర్తించి పురస్కారానికి ఎంపికచేసింది. జనార్దన్‌రెడ్డికి ఉత్తమ ఎన్నికల అధికారి పురస్కారం దక్కడం ఇది రెండోసారి. గతంలో 2010-11లో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసినప్పుడు రాష్ట్రంలో నూరుశాతం ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను సిద్ధంచేసినందుకు ఆయనను కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తమ ఎన్నికల అధికారిగా గుర్తించింది.

2,021 మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 2,021 మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను (ఎన్‌ఎంఎంఎస్) కేంద్రం మంజూరు చేసింది. 8వ తరగతి చదువుతూ ఈ పరీక్షలకు హాజరైన వారిని స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేశారు. ఎంపికైనవారి పేర్లను ఖరారు చేయడం కోసం మెరిట్ జాబితాలను జిల్లా విద్యాధికారులకు (డీఈవో) పంపించారు. అందులో 1,131 మంది విద్యార్థులు మోడల్ స్కూళ్లకు చెందినవారున్నారు. ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనవారికి ప్రతి ఏటా రూ. 6 వేల చొప్పున 9 నుంచి 12వ తరగతి వరకు కేంద్రప్రభుత్వం అందించనున్నది.

మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం

- ప్రజాహిత తపనకు నిదర్శనం
- డైనమిక్ ముఖ్యమంత్రి కేసీఆర్
- ఆర్‌డబ్ల్యూఎస్ పనితీరు అద్భుతం
- ఒడిశా అధికారుల బృందం ప్రశంసలు
- మిషన్ భగీరథ పనుల పరిశీలన



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రాంచంద్రాపురంలో బుధవారం ఫిల్టర్ బెడ్‌ను 'మిషన్ భగీరథ' నీటిని పరిశీలిస్తున్న ఒడిశా బృందం సభ్యులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, నర్సాపూర్, పుల్కల్: ప్రజలకు మంచి చేయాలన్న తపన ఉంటే తప్ప మిషన్‌భగీరథలాంటి ప్రాజెక్టును మొదలుపెట్టడం సాధ్యం కాదని ఒడిశా అధికారుల బృందం పేర్కొన్నది. కేచంద్రశేఖర్‌రావులాంటి చిత్తశుద్ధిగల వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నందువల్లే ఇంతతక్కువ వ్యవధిలోనే ప్రాజెక్టు పూర్తికాబోతున్నదని అభిప్రాయపడ్డారు. బుధవారం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని బుస్సారెడ్డిపల్లి, పెద్దారెడ్డిపేట, రామచంద్రాపురం, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ ప్రాంతాల్లో ఒడిశా తాగునీరు, పారిశుద్ధ్య అధికారుల బృందం పర్యటించింది. ఇంటింటికీ నీటి సరఫరాపై స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. నాబార్డ్ ఒడిశా, తెలంగాణ శాఖల ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పోజర్ విజిట్ ఏర్పాటైంది. ఒడిశా రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి పీకే నందా, చీఫ్ ఇంజినీర్ జనమేజయ్ సేఠీతో పాటు పదకొండు మంది ఇంజినీర్లు, ఒడిశా నాబార్డ్ డీజీఎం పాణి ఈ బృందంలో ఉన్నారు. మొదట సంగారెడ్డి జిల్లా బుస్సారెడ్డిపేటలో నిర్మించిన ఇన్‌టేక్‌వెల్‌తోపాటు 100 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఒడిశా బృందం పరిశీలించింది. మోటర్లు, పంపుల సామర్థ్యాన్ని భగీరథ చీఫ్ ఇంజినీర్ విజయ్ ప్రకాశ్ ఒడిశా అధికారులకు వివరించారు. అనంతరం నీటిశుద్ధి కేంద్రంలోని ప్రతివిభాగాన్ని పరిశీలించిన ఒడిశా అధికారులు.. నీటిశుద్ధికి ఉపయోగిస్తున్న ఫిల్టర్ మీడియా వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఒడిశా అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ డైనమిక్ లీడరని కొనియాడారు. తాగునీటి కోసం వేల కోట్లను ఉదారంగా వెచ్చించి మిషన్ భగీరథ పథకాన్ని తేవడం దేశానికే ఆదర్శమన్నారు. మిషన్ భగీరథ పథకంపై దేశంలోని పలు రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేసి, వారి రాష్ట్రాలలో అమలుచేస్తున్నారని తెలిసి ఒడిశా సీఎం బిజూపట్నాయక్ ఈ పథకంపై ఆసక్తి చూపారని తెలిపారు. తమవద్ద పరిమితంగా తాగునీటి సరఫరా ప్రాజెక్టును ప్రారంభించాలనుకుంటున్నామని, అందుకోసమే భగీరథ పనుల పరిశీలనకు వచ్చామని ఒడిశా ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి పీకే నందా చెప్పారు. ఒడిశాలో 85% నీటి సరఫరా భూగర్భజలాల ఆధారంగానే జరుగుతున్నదని అక్కడి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ జనమేజయ్ సేఠీ అన్నారు. తాగునీటి ప్రాజెక్టులకు భగీరథ రోల్‌మోడల్‌గా నిలిచిందని ఒడిశా నాబార్డ్ డీజీఎం పాణి తెలిపారు. అందుకే నాబార్డు తరపున ఒడిశా అధికారులను తెలంగాణకు తీసుకొచ్చామని వివరించారు.

ఆ తర్వాత నర్సాపూర్ మండలం రామచంద్రాపురంలో ఒడిశా అధికారులు పర్యటించారు. ఇంటింటికీ నల్లాతో నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. సర్పంచ్ లక్ష్మీనారాయణతోనూ, గ్రామస్థులతోనూ మాట్లాడారు. ఒడిశా అధికారుల పర్యటనలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ విజయప్రకాశ్, కన్సల్టెంట్ నర్సింగరావు, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు రఘువీర్, సురేశ్, లలిత, కమలాకర్, తెలంగాణ నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్లు రమేశ్, కల్పనతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డుల పరిశీలన

వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రభుత్వం నాబార్డ్ సహకారంతో నిర్మించిన 10 వేల టన్నుల సామర్థ్యం గల గోదాములను పరిశీలించిన ఒడిశా అధికారులు సంతోషం వ్యక్తంచేశారు. రైతుబంధు పథకం, గోదాముల సామర్థ్యం, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ఎన్నిక విధానం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.





దాణా కుంభకోణం మూడో కేసులో సీబీఐ కోర్టు లాలూప్రసాద్ యాదవ్‌ను దోషిగా తేల్చి ఐదేండ్ల శిక్ష విధించటం విషాదం. ఈ తీర్పు అంతిమం కాదు. మేం ఉన్నత న్యాయస్థానానికి వెళ్తాం. ఇదంతా బీజేపీ, నితీష్‌కుమార్‌లు కలిసి చేసిన కుట్ర, కక్ష సాధింపులో భాగమే. బీహార్ ప్రజలకు లాలూ ఏమిటో తెలుసు. ఆయన ప్రజల నాయకుడు.

తేజస్వీ యాదవ్, బీహార్ ప్రతిపక్ష నేత, ఆర్జేడీ అధినేత

మహాదాయి నదీజలాల పంపకం వివాదంలో కేంద్రం జోక్యం చేసుకోవాలనే డిమాండ్‌తో కర్ణాటకలో ఈ నెల 25న, ఫిబ్రవరి 4న బంద్‌కు పిలుపునివ్వటం కుట్రపూరితం. ఈ తేదీల్లో బీజేపీ అగ్రనేతలు అమిత్‌షా, మోదీ కర్ణాటక సందర్శిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పరోక్షంగా బంద్ నిర్వహించటం దారుణం. కర్ణాటక కాంగ్రెస్‌కు బీజేపీ అంటే ఎంత భయమో దీన్నిబట్టి తెలుస్తున్నది.

బీఎస్ యడ్యూరప్ప, కర్ణాటక రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు



చరిత్రలో నేడు



1565
తళ్లికోట యుద్ధం. విజయనగర రాజును ఓడించిన దక్కన్ సుల్తాన్ సేనలు.

1755
మాస్కో విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన రష్యా రాణి ఎలిజబెత్.





1802
ఇటాలియన్ (సిసాల్పిన్) రిపబ్లిక్ అధ్యక్షుడిగా నెపోలియన్ బోనాపార్టే ఎన్నిక.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల స్థిరత్వం, వృద్ధిరేటు ఆశించిన దాని కన్నా ఆశాజనకంగా ఉన్నదని ఐఎంఎఫ్ తాజా నివేదిక తెలియజేసింది. అయితే ధరల్లో నియంత్రణ లేకపోతే వ్యతిరేక ఫలితాలు చవిచూడాల్సిందేనని స్పష్టం చేసింది. 0.2శాతం వృద్ధిరేటుతో గ్లోబల్ ఎకానమీ మొత్తం గా 3.9 శాతం వృద్ధిరేటు సాధించటం శుభసూచకం. భారత్ కూడా 7.4 శాతం వృద్ధిరేటుతో చైనా కన్నా ముందుండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చేదేనని తెలుపటం గమనార్హం. అయితే పన్ను వసూళ్లలో ఆశించిన ప్రగతి సాధిస్తేనే అది సాధ్యమని సూచించింది.

ది హిందూ

బీజేపీ, శివసేన పార్టీల సుదీర్ఘ బంధానికి తెరపడింది. మహారాష్ట్రలో 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న శివసేన, వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే ఎన్నికల బరిలో నిలువాలని నిర్ణయించింది. రాబోయే 2019 లోక్‌సభ ఎన్ని కలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు లేకుండా పోటీ చేస్తామని ప్రక టించింది. అయితే ఇప్పటికిప్పుడు ఫడ్నవీస్ ప్రభుత్వానికి ప్రమాదమేమీ లేకున్నా రాబోయే రాజకీయ పరిణామాలపైనే అందరి దృష్టి ఉన్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

దావోస్‌లో భారత్ దర్పం

అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు వ్యాపార రంగంలో రక్షిత విధానాలను అనుసరిస్తున్న కాలంలో, భారత ప్రధాని మోదీ దావోస్ వేదికపై నుంచి ప్రపంచీకరణ విధానాలను పరిరక్షించుకుందామంటూ పిలుపునిచ్చి ప్రశంసలు అందుకున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో మంగళవారం మోదీ ప్రసంగం విన్న ప్రముఖులకు భారత్ ప్రాభవం మొదలైందన్న అభిప్రాయం కలిగింది. దావోస్ వేదికపై నుంచి మోదీ భారత్‌ను పెట్టుబడులకు తగిన గమ్యస్థానంగా వివరిస్తూనే, ప్రపంచానికి మూడు సూచనలు చేశారు. వాతావరణ మార్పు, ఉగ్రవాదం, వ్యాపార రక్షిత విధానాలు మూడు ప్రపంచానికి చేటు అని ఆయన హెచ్చరించారు. అమెరికా వాతావరణ మార్పువాదాన్నే అంగీకరించకుండా ప్యారిస్ ఒడంబడిక నుంచి వైదొలుగడం గమనార్హం. ఈ దశలో మోదీ ప్రపంచ దేశాలన్నీ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. తాము పర్యావరణ హితమైన వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాశ్చాత్య దేశాలు ఇవ్వడం లేదని ఆయన గుర్తు చేశారు. ప్రపంచీకరణ క్రమం ప్రశ్నార్థకమవుతున్న తీరును ఆయన ఆక్షేపించారు. ఇటీవలి కాలంలో బహుళ పక్ష చర్చలు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ ఇటీవలి కాలంలో ఉమ్మడి వ్యవస్థల పట్ల కినుక వహించడం పట్ల ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచి ఉగ్రవాదం, చెడు ఉగ్రవాదం అంటూ ఉండదనీ, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రమాదకరమని హితవుచెప్పారు. ఇది పాకిస్థాన్‌ను తప్పుబట్టినట్టు కనిపిస్తున్నప్పటికీ, పశ్చిమాసియాలో అమెరికా విధానాలు కూడా ఇందుకు భిన్నంగా లేవు.

ప్రధాని మోదీ ప్రసంగం పట్ల చైనా హర్షం వ్యక్తంచేసింది. చైనా మీడియా మోదీ ప్రసంగానికి విశేష ప్రాధాన్యం ఇచ్చింది. 'ప్రపంచీకరణ వర్తమాన ప్రపంచ పోకడనీ, దీనివల్ల వర్ధమాన దేశాలతో పాటు అన్నిదేశాలు లబ్ధి పొందుతాయనీ, రక్షిత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని మోదీ ప్రసంగాన్ని బట్టి అర్థమవుతున్నదని చైనా అధికార ప్రతినిధి హువా చున్‌యింగ్ అన్నారు. భారత్‌తోసహా అన్ని దేశాలతో కలిసి ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోవాలని, తద్వారా అన్నిదేశాల వృద్ధికి తోడ్పడాలని చైనా భావిస్తున్నది' అని ఆమె సౌహార్ద్రతను వ్యక్తం చేశారు. అంతర్జాతీయరంగంలో పాశ్చాత్య దేశాల విధానాలకు వ్యతిరేకంగా భారత్, చైనా ఏకతాటిపై నిలువడం ఇవాళ కొత్త కాదు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలుగా భారత్, చైనా దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలున్నాయి. భారత్ తూర్పు ఆసియా కూటమిలో, షాంఘై సహకార సంస్థలో చేరుతున్నప్పుడు చైనా పెద్దగా అడ్డుచెప్పలేదు. ప్రపంచ వాణిజ్య సంస్థతోపాటు పలు బహుళ పక్ష వేదికలపై రెండు దేశాలు సహకరించుకుంటున్నాయి. జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణమార్పు, బ్రిక్స్ సహకారం మొదలైన అంశాల్లో ఉమ్మడి లక్ష్యాలున్నాయి. భారత్, చైనా సహకరించుకుంటే బలమైన కూటమి అవుతుంది. కానీ ఇందులో కొన్ని చిక్కులు కూడా ఉన్నాయి. అయితే చైనాతో సరిహద్దు సమస్యతో పాటు ఇతర విభేదాలు కూడా ఉన్నాయి. హిందు మహాసముద్రంలో ప్రాబల్యం కోసం చైనా ప్రయత్నించే క్రమంలో పోటీ ఎదురవుతుంది. అయితే భారత్ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే చైనాను కట్టడిచేయగలదనే సూచన వినబడుతున్నది. భారత్ బలోపేతం అయితే చైనా సర్దుకుపోక తప్పదు.

అమెరికాకు ప్రత్యామ్నాయంగా తామున్నామని చైనా అధినేత జిన్‌పింగ్ బహిరంగంగానే అంటున్నారు. అయినప్పటికీ చైనా రాజకీయ- ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆమోదయోగ్యంగా లేదు. ఈ కారణంగానే మోదీ ప్రసంగం సభికులను ఆకట్టుకున్నది. భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రమంటూ మోదీ వివరించిన తీరు గమనార్హమైనది. ఇక్క డ రాజకీయ సుస్థిరత ఉంటుందనీ, సంపదను సంక్షేమాన్ని, శాంతిని సౌభాగ్యాన్ని పొందవచ్చునని వివరించారు. వసుధైక కుటుంబమన్న భారతీయ భావనను బలంగా వినిపించారు. ఇక్కడ ప్రజాస్వామ్యం ఉన్నదనీ, ప్రజలు అనుకూలురని వివరించారు.

భారత్ చైనా రెండూ ప్రపంచీకరణ అనుకూల విధానాలు అనుసరిస్తున్నాయి. చైనా అధినేత జి జిన్‌పింగ్ గతేడాది దావోస్ వేదికపై నుంచి ప్రసంగిస్తూ, ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ సారి మోదీ ప్రసంగం కూడా దాదాపుగా అదే బాటలో ఉన్నది. అయినప్పటికీ మోదీ ప్రసంగానికి వచ్చినంత స్పందన జిన్‌పింగ్‌కు రాలేదు. అమెరికా రక్షిత విధానాలు అనుసరించడం, యూరప్ ఏకతాటిపై నిలువలేకపోవడం వల్ల ప్రపంచమంతా మరో శక్తి కేంద్రంపై వైపు చూస్తున్నది. అమెరికాకు ప్రత్యామ్నాయంగా తామున్నామని చైనా అధినేత జిన్‌పింగ్ బహిరంగంగానే అంటున్నారు. అయినప్పటికీ చైనా రాజకీయ– ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆమోదయోగ్యంగా లేదు. ఈ కారణంగానే మోదీ ప్రసంగం సభికులను ఆకట్టుకున్నది. భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రమంటూ మోదీ వివరించిన తీరు గమనార్హమైనది. ఇక్కడ రాజకీయ సుస్థిరత ఉంటుందనీ, సంపదను సంక్షేమాన్ని, శాంతిని సౌభాగ్యాన్ని పొందవచ్చునని వివరించారు. వసుధైక కుటుంబమన్న భారతీయ భావనను బలంగా వినిపించారు. ఇక్కడ ప్రజాస్వామ్యం ఉన్నదనీ, ప్రజలు అనుకూలురని వివరించారు. సంకుచిత హద్దులు గీసుకోని స్వేచ్ఛాప్రపంచం ఆకాంక్షించే రవీంద్రనాథ్ టాగోర్ కవనాన్ని భారతీయ మనస్తత్వానికి ప్రతీకగా ఉటంకించారు. చైనా పేరు ప్రస్తావించకుండానే భారతీయ వ్యవస్థ ఔన్నత్యాన్ని, ప్రాధాన్యాన్ని మోదీ చాటగలిగారు. అందుకే దావోస్ సభ సందర్భంగా భౌగోళిక రాజకీయ శక్తిగా, ఆర్థిక శక్తిగా భారత్ ఆవిర్భావాన్ని ప్రపంచం గుర్తించింది.

జనగళం

కోతుల బెడద

గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా కోతుల బెడద ఎక్కువైంది. ఏవైనా పదార్థాలు చేతిలో పట్టుకుని రోడ్డెక్కాలంటనే భయమేస్తుంది. చేతిలో ఏది ఉన్నా కోతులు ఎగబడి గుంజుకుపోతున్నాయి. దీంతో ఒక్కోసారి పిల్లలు, వృద్ధులు తీవ్రంగా గాయపడటం జరుగుతున్నది. కోతుల బెడద నివారించాలని ఎంత మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. ఏమి చేయాలన్నా వణ్యప్రాణుల సంరక్షణ చట్టం ఉన్నది. కాబట్టి ప్రజలు ఏమీ చేయలేక కుమిలిపోతున్నారు. వాటి బెడదనుంచి ఎలా తప్పించుకోవాలో తెలియటం లేదు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

- సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

ప్రతిష్ఠాత్మక నిమ్స్ దవాఖానలో రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులను గంట వ్యవధిలోనే ఇచ్చేవిధంగా ఏర్పాటుచేయటం అభినందనీయం. గతంలో అయితే ఏ పరీక్షకు సంబంధించిన రిపోర్టు అయినా రోజుల తరబడి సమయం తీసుకోవటమే కాకుండా ఒక్కో టెస్టుకు ఒక్కో ల్యాబ్‌కు పరిగెత్తాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని పరీక్షలు, రోగుల వద్దనే తీసుకొని రిపోర్టులను వెంటనే ఇచ్చేలా ఏర్పాటుచేయటం రోగులకు మేలు చేస్తుంది.

- జంపాల అంజయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా

యువత మేల్కోవాలె

సెల్ఫీ ఫొటో దిగుతూ రైలు ప్రమాదానికి గురైన యువకుని వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగినా మేల్కొనకపోవడం బాధాకరం. యువత ఇలాంటి దుస్సాహస చేష్టలతో తమ బంగారు భవిష్యత్తును కోల్పోవటం విషాదం. ఇప్పటికైనా ఇలాంటి సెల్ఫీ దుస్సాహసాలకు దిగటం అందరూ మానుకోవాలి.

- గాలి రవీందర్, ముంజంపల్లి, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

తెలంగాణలో తాత్విక దారిద్ర్యం

తెలంగాణ 2014కు ముందు ఏమిటి? ఏమి కోరుకొని స్వయం పాలనను సాధించుకున్నది? రాష్ట్రంగా ఏర్పడినప్పుడు ఏ లక్ష్యాలను నిర్దేశించుకుంది? ఆ మేరకు జరుగుతున్న దానిలోని మంచిచెడులు ఏమిటి? అనే ప్రశ్నలపై తాత్విక దృక్పథం అవసరం. కాని రాజకీయ పార్టీలు, కొందరు సిద్ధాంతవాదులు, మేధావులు గతంలో వలెనే తమ షరామామూలు విమర్శలు, సినికల్ వ్యాఖ్యలు మినహా కొత్తగా ఆలోచించే పనిచేయటం లేదు. ఇందుకు కారణం వారి తాత్విక దారిద్ర్యం.

గమనించదగినది ఏమంటే, ఈ విధమైన తాత్విక దృక్పథం తెలంగాణలోని సామాన్య ప్రజలకు ఏర్పడింది. కానీ, పైన పేర్కొన్న వివిధ వర్గాలకు కాదు. అందుకు కారణం, ప్రజలకు తెలంగాణ బాగుపడటం, దానితోపాటు అదే క్రమంలో తాము బాగుపడటం అంటే ఏమిటి, అందుకు తమ బాధ్యత కూడా ఏదైనా ఉందా అనే ఆలోచన మినహా మరొక ప్రయోజనం లేదు. ఈ ఆలోచనే వారికి గల 'తెలంగాణ తాత్వికత'. అది సుసంపన్నమైన, అర్థవంతమైన తాత్వికత. కాని, పైన పేర్కొన్న వర్గాల ఆలోచనలు ఇందుకు భిన్నమైనవి. తరచూ విరుద్ధమైనవి కూడా. రాజకీయ పార్టీలకు తెలంగాణ బాగుకన్న తమ అధికారం, ఇతర ప్రయోజనాలు ముఖ్యం. ముందుగా అవి నెరవేరుతూ తర్వాత రాష్ట్రం కూడా బాగుపడితే వారికి సమస్య లేదు. అవి నెరవేరనపుడు, రాష్ట్రం బాగుపడుతున్నదా లేదా అనే దానితో నిమిత్తం లేదు. ఒకవేళ మంచి ఏదైనా జరిగినా దానిని వారు తోసిపుచ్చుతారు. అందులోని చెడును మాత్రమే వెతికితీయటం, మంచిని కూడా చెడుగా చూపబూనటం వారి ధోరణి అవుతుంది. ఇది గత మూడున్నరేండ్లుగా, ప్రతి ఒక విషయంలో కనిపిస్తున్న ధోరణి. తెలంగాణ తాత్వికత అన్నది తమకు పట్టుబడకపోవటం ఇందుకు కారణం. అట్లా పట్టుబడకపోవటమంటే అది తాత్విక దారిద్ర్యమన్నమాట. ఆ దారిద్ర్యం వల్లనే వారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు ఏ విధంగానైతే కేవలం స్వప్రయోజనాల తత్వంతో వ్యవహరించారో, ఈ ప్రాంతానికి హానిచేశారో ఇప్పటికీ అదే తత్వంతో ప్రవర్తిస్తున్నారు.

తాము తెలంగాణ మంచిని కోరుకుంటున్నందువల్లనే విమర్శలు చేస్తున్నామని, ఆ విషయం గ్రహించకుండా తమకు తెలంగాణ తాత్వికత వంట బట్టలేదనటం అర్థంలేని ఆరోపణ అని వారనవచ్చు. అప్పుడు వారికి ఒక ప్రశ్న వేయవలసి ఉంటుంది. తెలంగాణ తాత్వికత ఉన్నందువల్ల సామాన్య ప్రజలు విషయాలను నిష్పాక్షికంగా పరిశీలిస్తున్నారు. మంచిని మంచి అంటున్నారు, చెడును చెడు అని కూడా అంటున్నారు. అటువంటి నిష్పాక్షికమైన పరిశీలనలు తెలంగాణ తాత్వికతలో భాగమవుతాయి. అందుకు అనుగుణమైనవి అవుతాయి. ప్రజలను అందుకు ఎంతమాత్రం తప్పుబట్టలేము. అటువంటిస్థితిలో, రాజకీయ పార్టీలు కూడా సామాన్య ప్రజలవలెనే మంచిని మంచి అనీ, చెడును చెడు అనీ, ఎందుకు అనలేవు? అన్నింటినీ, ఎటువంటి మినహాయింపు లేకుండా చెడు అనటం ఎందుకు? అట్లా అనటం ప్రజలకు గల తాత్విక దృక్పథానికి విరుద్ధమైనది కాదా? అటువంటి విరుద్ధతకు మూలం, తెలంగాణ ప్రయోజనాలకు భిన్నంగా వీరికి సొంత ప్రయోజనాలు ఉండటం కాదా? బాగున్న కాళేశ్వరం పనులను బాగున్నాయన్నందుకు గవర్నర్‌ను విమర్శించటం ఇందుకు తాజా ఉదాహరణ.

ఇటువంటి తాత్విక దారిద్ర్యం విషయంలో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, విప్లవకారులు అనే తేడా లేకుండాపోయింది. విమర్శలు మూడు విధాలుగా ఉండవచ్చు. ఒకటి విధానపరం. రెండు, అమలుపరం. మూడు, సిద్ధాంతపరం. అయితే దేనిలోనైనా సమాచారాలు, విశ్లేషణలు, మదింపులు స్పష్టమైన విధంగా ఉండాలి. ఒక విషయం బాగా ఉందని చెప్పదలచినా, చెడుగా ఉందని విమర్శించదలచినా అట్లానే ఉండాలి. ఆ పద్ధతిలో ఏమన్నా అందులో తెలంగాణ తాత్వికత ఉంటుంది. కాని అది ఈ వర్గాల తీరులో ఈ మూడున్నరేండ్లలో ఒక అంశంలోనైనా కన్పించిందా అంటే అనుమానమే. అర్ధ సమాచారాలు, వక్రీకరణలు, తమ ప్రయోజనాలకు లేదా సిద్ధాంతాలకు ఉపయోగపడగల విధంగా పాక్షికమైన దృష్టి మాత్రమే కన్పిస్తున్నాయి. ఇది స్వీయ తాత్వికత అవుతుంది గాని తెలంగాణ తాత్వికత కాబోదు. అట్లా కానిదంతా కూడా తాత్విక దారిద్ర్యమే.

ఇక్కడ నిర్దిష్టంగా ఒక విషయం చూద్దాము. మిషన్ కాకతీయ కింద చెరువులను బాగుచేయటం వల్ల భూస్వాములు మాత్రమే లాభపడుతారని, ఈ పథకాన్ని ఉద్దేశించింది వారి కోసమేనని, సాధారణ రైతులకు కలిగే ప్రయోజనం ఏమి లేదని అన్నారు కొందరు. ఈ విమర్శలో బరువు చాలా ఉంది. అది నిజమైనా తెలంగాణ వ్యవసాయం, ఉత్పాదకత, ఉత్పత్తి, అభివృద్ధి కోణాల నుంచి అందువల్ల మేలు జరుగుతుందా లేదా అనే ప్రశ్న ఒకటి ఉంది. ఈ ప్రశ్నలో 'ప్యూర్ ఎకనమి క్స్' ఆ రూపంలో 'భూస్వామ్య అనుకూల' ధోరణి ఉందనుకున్నా, అం దులోని వాస్తవాలను కూడా క్షేత్రపరిశీలన, గణాంక వివరాల ద్వారా వెల్లడించవలసిన బాధ్యత విమర్శకులపై ఉంటుంది. మరొకస్థాయిలో చూస్తే, చెరువుల బాగు వల్ల ఏ తరగతుల రైతులు ఎందరు బాగుపడుతున్నారో, ఆ పథకం వల్ల ఇంకా ఎవరెవరికి ఏయే మేలు కలుగుతున్నదో ఆ విమర్శకులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి చెప్పింది ఏమీ లేదు. తెలంగా ణ తాత్వికత లేదనటం, తాత్విక దారిద్ర్యమనటం ఇటువంటివాటినే. విప్లవకారుల తీరు ఇట్లుండగా, ఉభయ కమ్యూనిస్టులు 'శూన్య గీతం' ఒకటి రచించారు. వారికి కలిసి పనిచేయటమైతే మూడున్నరేండ్లు గడిచినా చేతకావటం లేదుగాని, ఉభయులూ కలిసి 'అంతా శూన్యం' అన టం ఈ సరికి ఒక దయనీయమైన అలవాటుగా మారింది. కమ్యూనిస్టు లు 'బూర్జువా' అనే పార్టీలకన్న భిన్నమని, విషయ చర్చను వారు తమ క్షేత్ర పరిశీలనలు, విశ్లేషణలు, సైద్ధాంతిక దృష్టితో ఉన్నతమైన స్థాయికి తీసుకువెళ్తారని సమాజానికి మొదటినుంచి ఉన్న అభిప్రాయం. ఆ విధంగా వారిపట్ల గౌరవాలు, ఆశలు కూడా ఉండేవి. తమ బలం ఎంత అనే దానితో నిమిత్తం లేకుండా వారిపట్ల అటువంటి గురి ఉండేది. కాని వారికి ఒక మౌలికమైన మహా తాత్విక దారిద్ర్యం అంతటా ఆవరించింది. అదే దారిద్ర్యం, తెలంగాణ తాత్విక దారిద్ర్య రూపంలో కొంత పొడిగింపును సంతరించుకుంది. తమ సిద్ధాంతపు చట్రాలకు బయటకూడా కొన్ని వాస్తవాలు ఉంటాయని, కొత్తగా ఉనికిలోకి వస్తున్నాయని సృజనాత్మకంగా ఆలోచించలేకపోవటం వీరికి సమస్యగా మారింది.

వీరి పరిస్థితే ఇది అయినపుడు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీల గురించి చెప్పవలసింది ఏముంటుంది. ఈ అన్ని పార్టీలకు తమ సొంత లక్ష్యాలు ఉన్నాయి. అందుకు ఎవరూ ఆక్షేపించనక్కరలేదు. కాని అవి తెలంగాణకు చేస్తున్న మంచి చెడులేమిటన్నది ప్రశ్న. తెలంగాణ తనను తాను తన కోసం ఆవిష్కరించుకున్నది. తన ఆవిష్కరణ తన ప్రజల కోసమే గాని మరెవరి కోసమూ కాదు. అందుకు సరిపోగల తాత్వికతను పార్టీలుగాని, మేధావులుగాని చూపవలసి ఉంటుంది. అటువంటి తాత్వికతలో నిర్మాణాత్మకత ఉంటుంది. విమర్శ అందులో భాగం కావాలి. నిర్మాణాత్మక విమర్శ చేదుమాత్ర అయినా కావచ్చు, శస్త్రచికిత్స ప్రతిపాదనలైనా కావచ్చు. వాటి వెనుకగల తాత్వికత ఏమిటన్నది ప్రధానం. లేదా ఏకైక విషయం.

విమర్శకులకు ఒక పెద్ద అపోహ ఉన్నది. మంచిని మంచి చెడును చెడు అనటం, నిర్మాణాత్మక సూచనలు చేయటం వల్ల తాము నికార్సయిన ప్రతిపక్షం, నికార్సయిన మేధావులం కాకుండా పోతామన్నది వారి భయం. అయినదానికి కానిదానికి తర్క విరుద్ధంగానైనా సరే విమర్శిస్తేనే తమను ప్రజలు వారి కోసం పోరాడుతున్నట్లు భావిస్తారన్నది ఒక అపోహ. కాని సేహతుకమైన విమర్శలకు, సూచనలకే ప్రజలు విలువనిస్తారు. కానపుడు, అధికార రాజకీయం చేస్తున్నారంటూ తోసిపుచ్చుతారు. ఆ పనిచేసే మేధావుల పట్ల కూడా వారికి గౌరవం తగ్గుతుంది. ప్రజలు ఒకప్పటి వలె అమాయకులు కారు. ఆ మాట అన్ని పార్టీలు, మేధావులు అంగీకరిస్తున్నదే.

అందువల్ల వీరంతా తెలంగాణ ప్రజల తాత్వికతనే తమ తాత్వికతగా స్వీకరించటం అవసరం. అందులోనే ప్రజల మేలుతో పాటు తమ మేలు కూడా ఉంది. ఆ ప్రకారం వ్యవహరించడమంటే, మొదట చెప్పుకున్నట్లు, తెలంగాణలో 2014 నుంచి జరగుతున్నది, జరుగనిది, ఇంకా జరుగవలసింది ఏమిటి? జరుగుతున్న దానిలో మంచి ఏమిటి, చెడు ఏమిటి? అన్న విషయాలను విచారించటంలో సాధారణ ప్రజలు తీసుకునే దృష్టినే తాము కూడా తీసుకోవడమన్న మాట. ప్రజల కొలబద్దలే తమ కొలబద్దలు కూడా కావాలి. అంతకుమించి, ప్రజలకు తెలియని సూచనలు ఉంటే తప్పకచేయాలి. అందుకు మార్గదర్శనం చేయగలది కూడా తెలంగాణ తాత్వికత కావాలి. ఇటువంటి దృక్పథం తక్కిన పార్టీలకు లేకపోయినా కనీసం వామపక్షాలకు లేకపోవటం, విప్లవ సాధనకు నిర్హేతుక విమర్శ కూడా ఒక సాధనమని విప్లవకారులు నమ్మటం ఒక విచిత్ర స్థితి. మేధావులు నగరాలలో , తమ ఆలోచనా ప్రపంచాలలో బందీలై, క్షేత్రస్థాయి పరిస్థితులనూ, ప్రజల నాడినీ గమనించకపోవటం విచారకరమైన పరిస్థితి. ఇది కూడా తెలంగాణ తాత్వికతకు సరిపడనిదే. ఇటువంటి శూన్యాల నుంచే తాత్విక దారిద్ర్యం పుట్టుకువస్తున్నది.

> **ప్రజల కొలబద్దలే తమ కొలబద్దలు కూడా కావాలి. అంతకుమించి, ప్రజలకు తెలియని సూచనలు ఉంటే తప్పక చేయాలి. అందుకు మార్గదర్శనం చేయగలది కూడా తెలంగాణ తాత్వికత కావాలి. ఇటువంటి దృక్పథం తక్కిన పార్టీలకు లేకపోయినా కనీసం వామపక్షాలకు లేకపోవటం, విప్లవ సాధనకు నిర్హేతుక విమర్శ కూడా ఒక సాధనమని విప్లవకారులు నమ్మటం ఒక విచిత్ర స్థితి.**

పుస్తకమే ఒక జ్ఞాననిధి

సందర్భం



వారాల ఆనంద్

పుస్తకం ఒక జ్ఞాననిధి. అనుభవాల గది, అనుభూతుల సారధి. భాషకు, భావానికి, వ్యక్తీకరణకు అది ప్రధాన వారధి. తరతరాలుగా జ్ఞానాన్ని వారసత్వంగా అందిస్తున్నది పుస్తకం. అంతటి విలువగల పుస్తకాన్ని, దాని అవసరాన్ని, చదివే సంస్కృతిని పెంపొందించేందుకు గాను 'పుస్తక ప్రదర్శన'లు ఏర్పాటవుతున్నాయి. మానవ జీవన సాంస్కృతిక పరిణామ క్రమంలో పుస్తకం పోషించిన పాత్ర గొప్పది. ప్రపంచంలోని వందలాది భాషల్లో భావాల పరిణామాలను, ఉద్యమాలను, ఉద్వేగాలను ఒకటేమిటి మనిషి సమస్త మార్పులను పుస్తకం తనలో నిబిడీకృతం చేసుకొని సాక్షీభూతంగా నిలబడింది. అలాంటి పుస్తకాలు అనేకమందికి చేరడం, విస్తృతంగా చదువడం అవసరం. ఆ అవసరాన్ని 'హైదరాబాద్ బుక్ ఫేర్' పూర్తిచేస్తున్నది. లక్షలాదిమంది పుస్తక ప్రదర్శనకు రావడమే కాకుండా పుస్తకాల అమ్మకాల పరిస్థితి చూస్తుంటే పుస్తకాల భవిష్యత్తు మీద చదివే అలవాటు మీద గొప్ప ఆశలు ముప్పిరిగొంటున్నాయి. ఎంతో ఆశావహమైన స్థితి కనిపిస్తున్నది. పుస్తకాలు లేని ఇల్లు కిటికీలు లేని గది వంటిదన్నట్టు ఇండ్లల్లోకి పుస్తకాలు చేరితే చదువడం తప్పకుండా అలవాటవుతుంది. పుస్తక విక్రేతలు చెబుతున్నదాని ప్రకారం ఊహించనివిధంగా లక్షలాది రూపాయల పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. సందర్శకుల సంఖ్య పెరుగుతున్నది. అంటే జనంలో చదివేవాళ్లు ఉన్నారు కానీ, వారికి వాటిని అందించడంలోనే వైఫల్యాలున్నాయన్నది ఇప్పుడు రుజువవుతున్నది.

భారతీయ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఆచార్య రంగనాథన్ చెప్పినట్టు 'పుస్తకాలు ఉపయోగపడాలి. ప్రతి పుస్తకం తన చదువరిని చేరాలి, ప్రతి చదువరీ తన పుస్తకాన్ని చేరాలి' అట్లా పుస్తకాల పరిధి విస్తృతమై అందరిని చేరగలిగినప్పుడు అవి సార్థకమవుతాయి. వాటి లక్ష్యమూ నెరవేరుతుంది. ఆ పనిని ముఖ్యంగా పౌర గ్రంథాలయాలు, విద్యాసంస్థల్లో ఉండే గ్రంథాలయాలూ నెరవేర్చాలి. కానీ పెరిగిన సాంకేతికత, ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు పుస్తకాలను పూర్వపక్షం చేస్తున్నాయి. పుస్తక పఠనం తగ్గిపోవటం మంచి పరిణామం కాదన్నది నిజం.

21వ శతాబ్దంలో ఆధునిక తరం 'చదివే సంస్కృతి నుంచి వెరైపోతూ చూసే సంస్కృతి'కి దగ్గరవుతున్నారు. ముఖ్యంగా గత దశాబ్దకాలం నుంచి ఒక్క చదివే అలవాటు మినహా అన్ని అలవాట్లు పెరిగాయి. అంతా చూడటమే. టీవీ చూస్తారు, సినిమా చూస్తారు, కంప్యూటర్ చూస్తారు. స్మార్ట్ ఫోన్ మాట్లాడానికంటే బొమ్మలు వీడియోలు చూడటానికే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇలా ఒకటేమిటి అన్ని చూడటమే. దీనికి చిన్న పిల్లల నుంచి మొదలు అందరూ ఇలా చూసేందుకు అలవాటు పడిపోతున్నారు. అక్షరాలు రాయడానికి, చదువడానికి కూడా ఇమేజ్‌లనే వాడే సం స్కృతి వచ్చింది. ఒక మంచి పుస్తకం చదువుతూ గుండెల మీద ఉంచుకొని నిద్రపోయినప్పటి ఆనందం నేటి తరానికి తెలియకపోవడం ఒకింత విచారకరమే.

సుప్రసిద్ధ ఉర్దూ కవి గుల్జార్ రాసినట్టు.. 'పుస్తకం పుటల మధ్య ఒత్తిగిలి దొరికే పూల సువాసనల పరిమళాలు, పుస్తకం జారిపడిందనో, పుస్తకం ఇచ్చిపుచ్చుకునే నెపం మీదో మాటలు కలిపి, ఏర్పరుచుకునే ప్రేమ బంధాలు ఇక కనిపించవేమో'. ఆధునిక కాలంలో పుస్తక ప్రాధాన్యం తగ్గిపోవడాన్ని చూస్తూ కవి పడ్డ బాధ అది. పుస్తకం హస్తభూషణం అన్న స్థితి నుంచి నేడు పుస్తకం పురావస్తువు అయిపోయే స్థితి కనిపిస్తున్నది. ఇవ్వాళ పుస్తకం చదువడం అంటే విద్యాలయాల్లో మార్కులు ర్యాంకులు సాధించడానికి పరిమితమైపోతుండగా, పౌర గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల కోసం చదువడమే మనకు కనిపిస్తున్నది. ఫలితంగా మానవీయ విలువల ప్రాధాన్యం, సామాజిక రంగంలో వేళ్లూనుకుంటున్న సం క్లిష్టతలను, మానసిక సంక్షోభాలను ఆవిష్కరించిన పుస్తకాలను చదివే వాళ్ల సంఖ్య తగ్గిపోతున్నది. ఫలితంగా వ్యక్తిగత సామాజిక సంక్లిష్టతలు అర్థం చేసుకోకపోవడం వల్ల అనేక అనర్థాలకూ అవకాశం కలుగుతున్నది.

ఈ స్థితికి సాంకేతికత, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలూ కారణమనే వాదన వినిపిస్తూ ఉంటుంది. నేటి సాంకేతికత కూడా తాత్కాలికంగా పుస్తకాన్ని మరుగునపరిచినట్టు కనిపించినా దాన్ని సరైనదిశలో వినియోగించగలిగితే భౌతికంగా సాంకేతికత పుస్తక రూపాన్ని మింగేయవచ్చు. కాని భాషను, భావాలను మింగేయలేదు. చదువడం అనే ప్రక్రియకు సంబంధించి పాఠకుల అలవాటు పేజ్ రీడింగ్ నుంచి స్క్రీన్ రీడింగ్‌కు మారింది. కానీ ఆ స్థితిని ఎట్లా సరైన దిశలో మార్చుకోవాలో ఆలోచించాల్సి ఉన్నది.

సాంకేతికత దాని పర్యవసానాలను పక్కనబెట్టి చదివే అలవాటును ఎట్లా పెంచాల్నో ఆలోచించి అమలుచేయాల్సి ఉన్నది. పుస్తకాలు చదువడం వల్ల ఒనగూడే వ్యక్తిగత పరిణామమూ, పెరిగే అవగాహననూ అర్థం చేయించాలి. ఒక మంచి పుస్తకాన్ని చదివి జీర్ణించుకొని, మనసు లోపల ఇమిడించుకోవడంలో ఉన్న ఆనందాన్ని అర్థం చేయించాలి. అది ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీల్లో జరుగాలి. లైబ్రరీలను ఈ గ్రంథాలయాలు, డిజిటల్ గ్రంథాలయాలు అంటూ ఆధునిక వసతులు కల్పిస్తూనే విద్యార్థుల్లో, యువకుల్లో చదివే అలవాటును పెంపొందించే కార్యక్రమాలు జరుగాలి. చదివే సంస్కృతిని పెంపొందించాలి. దానికి ప్రధానంగా తరగతి గదులు, గ్రంథాలయాలు వేదిక కావాలి. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడానికే కాకుండా ఆలోచనల్లో విశాలత్వం పెంచుకోవడానికి, సామాజిక బాధ్యతను గుర్తెరుగడానికి పాఠ్య పుస్తకాలే కాకుండా సాహిత్యం, చరిత్ర లాంటి అనేక అంశాల పుస్తకాలు చదువాలని టీచర్లు చెప్పాలి. అప్పుడు విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుంది. పుస్తకాల మీద ప్రేమ కలుగుతుంది.

గ్రంథాలయాల సేవలు ఎప్పటికప్పుడు విస్తరించాలి. గ్రంథాలయం ఒక సాంస్కృతిక కేంద్రం కావాలి. పుస్తకాల ప్రాముఖ్యాన్ని తెలిపే పుస్తక పరిచయ సభలు, ముఖాముఖి కార్యక్రమాలు, 'రీడ్ అండ్ రివ్యూ' కింద పుస్తక సమీక్ష సభలు, పోటీలు ఏర్పాటుకావాలి. అలాగే దృశ్య మాధ్యమాన్ని కూడా ఒక ప్రధానాంశంగా తీసుకొని ప్రేరణ కలిగించే జీవిత చరిత్రల డాక్యుమెంటరీలు, సుప్రసిద్ధ రచనల దృశ్యరూపాల ప్రదర్శనలు ఏర్పాటుచేయాలి. సాక్షరతా మిషన్ లాగా లైబ్రరీ మిషన్, రీడర్‌షిప్ మిషన్ చేపట్టాలి. ఆ క్రమంలో 'హైదరాబాద్ బుక్‌ఫేర్' తన బాధ్యతను నెరవేర్చడం గొప్ప విషయం. ఇలాంటి ప్రదర్శన అన్నీ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయగలిగితే తెలంగాణ రాష్ట్రం పుస్తకాల తెలంగాణగా, చదువరుల తెలంగాణగా మారిపోతుంది. సమాచారం అందుబాటులోకి తేవడమే కాకుండా చదివే అలవాటును పెంచగలిగితే సత్ఫలితాలు ఉంటాయి. పుస్తక పఠనంతో బాధ్యత గల పౌరులు తయారవుతారు. ఉత్తమ విలువల సమాజం ఏర్పడుతుంది.

> **'హైదరాబాద్ బుక్‌ఫేర్' తన బాధ్యతను నెరవేర్చడం గొప్ప విషయం. ఇలాంటి ప్రదర్శన అన్నీ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయగలిగితే తెలంగాణ రాష్ట్రం పుస్తకాల తెలంగాణగా, చదువరుల తెలంగాణగా మారిపోతుంది. సమాచారం అందుబాటులోకి తేవడమే కాకుండా చదివే అలవాటును పెంచగలిగితే సత్ఫలితాలు ఉంటాయి. పుస్తక పఠనంతో బాధ్యత గల పౌరులు తయారవుతారు. ఉత్తమ విలువల సమాజం ఏర్పడుతుంది.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

జాతీయ ఓటర్ల దినోత్సవం 25 జనవరి 2018

ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం, 2018



ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గారి సందేశం

25 జనవరి 2018

ప్రియమైన ఓటరు మహాశయులారా!

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో 8వ జాతీయ ఓటర్ల దినోత్సవం అనే ఒక అద్వితీయ సంబరం సందర్భంగా మన దేశ పౌరులందరినీ అభినందించుటకు నేను గర్వపడుతున్నాను మరియు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. నేను నూతన ఓటర్లకు ప్రత్యేకించి ఇప్పుడిప్పుడే నమోదైన సహస్రాబ్ది ఓటర్లకు స్వాగతం పలుకుతున్నాను మరియు స్వేచ్ఛగా మరియు నిర్భయంగా తమ తమ నియోజక వర్గంలో రాబోవు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవల్సిందిగా వారికి పిలుపునిస్తున్నాను. భారత ఎన్నికల సంఘం 1950వ సంవత్సరంలో ఇదే రోజు స్థాపించబడినది. 2011వ సంవత్సరం నుండి జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించబడినది. ఈ దినం భారత ఓటర్లకు అంకితమీయబడినది మరియు మతం, జాతి, కులం, వర్గం, భాష, ప్రాంతం లేదా సామాజిక ఆర్థిక అంశాలతో సంబంధంలేకుండా ప్రతి భారత పౌరునికి ఇవ్వబడిన వయోజన ఓటు హక్కు, అనే రాజ్యాంగపరమైన హక్కులను మనకు గుర్తుకు తెస్తున్నది. ఈ రోజున "ప్రతిజ్ఞ" ద్వారా ప్రజాస్వామ్యం పట్ల మన విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ, స్వేచ్ఛాయుత, పారదర్శకమైన మరియు ప్రశాంత ఎన్నికల పవిత్రత మరియు మనదేశపు ఘనమైన ప్రజాస్వామ్య సాంప్రదాయాలను నిలిపే మన తీర్మానాన్ని నవీకరిద్దాం.

ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం అనేది ఓటర్ల జాబితాలో నమోదుతో ప్రారంభమై పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకోవటంతో ముగుస్తుంది. స్థిర ప్రయత్నాల వలన, మనం సుమారు 87.53 కోట్ల ఓటర్లు గల ఓటర్ల జాబితాను మరియు నలువైపులా 9.97 లక్షల పోలింగ్ కేంద్రాలను సాధించాము. ఇవి మన దేశంలోని దూర సుదూర ప్రాంతాలకు విస్తరించి ఉన్నవి.

అన్ని కేటగిరీల ఓటర్లు ఎన్నికల్లో కలిసికట్టుగా, విజ్ఞతతో మరియు నైతికంగా పాల్గొనేలా చేయుటకు వారిని ప్రోత్సహించుటకై ఎన్నికల సంఘం తన నిరంతర కృషిలో కొన్ని చర్యలను చేపట్టినది. "ఏ ఓటరునూ వదిలివేయరాదు" అనే ఇతివృత్తానికి అనుగుణంగా ఓటర్లను పోలింగ్ స్టేషన్‌కు అనుసంధానం చేసే సామర్థ్యం మరియు సార్థకతకై సామాజిక మాధ్యమంతో సహా సాంకేతికత మరియు సమాచార మాధ్యమాన్ని వదరు చర్యలు సంఘటితం చేస్తాయి.

ఓటర్ల చైతన్యం ఎన్నికల ప్రక్రియను ఓటరుతో అనుసంధానం చేస్తుంది. ప్రత్యేకించి భవిష్యత్ మరియు రాబోవు ఓటర్లను భాగస్వాములను చేయుటకు వ్యవస్థీకృత ఓటర్ల అవగాహన మరియు ఓటర్ల భాగస్వామ్య కార్యక్రమం (SVEEP) అనే అత్యంత ప్రధాన ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఇంకనూ పటిష్టపరచబడినది. పరస్పర చర్య పాఠశాల భాగస్వామ్యం మరియు ECI జాతీయ ఎన్నికల క్విజ్‌కు మన పాఠశాలల్లో భవిష్యత్ ఓటర్ల నుండి అద్భుతమైన ప్రతిస్పందన లభించినది. విద్యాసంస్థల ద్వారా ఎన్నికల పట్ల అవగాహనను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావటం ప్రవేశపెట్టబడినది, దీనిక్రింద ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల మొదటి బ్యాచ్ నేడు వెలుగులోకి వచ్చినది.

VVPATలతో EVMల 100% కవరేజ్ ద్వారా ఓటరు విశ్వాసాన్ని బలపరచుటకు గణనీయమైన మరియు ముఖ్యమైన చర్యలు తీసుకోబడినవి. భాగస్వాములకు e-సేవలను అందజేయుటకు ERO-నెట్ ప్రవేశ పెట్టబడినది. ఓటర్ల సర్వీసు యొక్క రిజిస్ట్రేషన్ కొరకు కూడా ప్రత్యేక చర్యలు ప్రారంభించబడినవి. పెరిగిన భాగస్వామ్యం రూపంలో ఈ చర్యల ఫలితం కనిపిస్తున్నది.

దివ్యాంగుల (PWDలు) రిజిస్ట్రేషన్ మరియు వారి విస్తృత భాగస్వామ్యానికి వీలు కల్పించుటకు 2018 సంవత్సరంలో మనకు సంఘం "ఎన్నికల్లో భాగస్వామ్యం" అనే ఇతివృత్తాన్ని ప్రవేశపెట్టినది.

ఈ జాతీయ ఓటర్ల దినోత్సవం, 2018ని పురస్కరించుకొని దేశ పౌరులందరికీ మరొకసారి నా హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

జై హింద్!

ఓమ్ ప్రకాష్ రావత్
భారత ప్రభుత్వ ప్రధాన ఎన్నికల కమిషనర్

ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌పై సౌకర్యాలు

క్రమ సంఖ్య	సదుపాయము	http://www.ceotelangana.nic.in
1	ఓటరు పేరు వెదకటానికి	హోమ్ పేజీలో "Search Your Name" అనే లింక్
2	మీ పోలింగ్ స్టేషన్ ఏదో తెలుసుకోవటానికి	హోమ్ పేజీలో "Know your PS/BLO" అనే లింక్
3	మీ బూత్ స్థాయి అధికారి ఎవరో తెలుసుకోవటానికి	హోమ్ పేజీలో "Know your PS/BLO" అనే లింక్
4	అసెంబ్లీ నియోజకవర్గం యొక్క ఓటర్ల జాబితాలలో పేరునామా నమోదు/సవరింపు/తొలగింపు/మార్పు కొరకు (ఫారం 6,7,8 & 8A దరఖాస్తులు)	హోమ్ పేజీలో "e-Registration" లింక్ పైన క్లిక్ చేయండి. "Assembly Constituency"ని ఓపెన్ చేయండి. "Form-6.." లేదా "Form-7" లేదా "Form-8" లేదా "Form-8A" పైన క్లిక్ చేయండి.
5	ఆన్‌లైన్ ఫారం-6,7,8 & 8A దరఖాస్తు స్థితి గురించి తెలుసుకోవటానికి	హోమ్ పేజీలో e-Registration లింక్ క్రింద "Know your Status"
6	పేర్ల తొలగింపు, మీ సేవా కేంద్రాల వద్ద సర్వీసు మరియు దరఖాస్తుల పెండింగ్/తిరస్కరణ, వగైరాలకు సంబంధించిన ఫిర్యాదులను రిజిస్టరు చేయుటానికి	హోమ్ పేజీలో "Register Your Complaint" అనే లింక్
7	ఇ-సేవా/మీ సేవా కేంద్రం గురించి తెలుసుకోవటానికి	హోమ్ పేజీలో "Mee Seva Centers" అనే లింక్
8	అసెంబ్లీ నియోజకవర్గాలు/ కొన్ని నియోజకవర్గాల PDF ఓటర్ల జాబితాలను చూడటానికి/ప్రింట్ చేయుటానికి	హోమ్ పేజీలో "PDF Electoral Rolls" అనే లింక్
9	సిట్టింగ్ MLAs/MPs/MLCs యొక్క అఫిడవిట్లను చూడటానికి	హోమ్ పేజీలో "Affidavits" అనే లింక్
10	విద్యార్థుల నమోదుకు సంబంధించిన సూచనలను చూడటానికి	హోమ్ పేజీలో "Students' enrollment" అనే లింక్
11	విదేశాలలో ఉన్న ఓటర్ల (NRIs) నమోదు కొరకు దరఖాస్తు చేయుటానికి	"ECI Home Page" అనే లింక్ పైన క్లిక్ చేసి, "National Voters Service Portal (NVSP)"ని సెలెక్ట్ చేయండి
12	జాతీయ ఓటర్ల దినోత్సవం వివరాలు తెలుసుకోవటానికి	హోమ్ పేజీలో "National Voters Day" అనే లింక్
13	ఎన్నికల చట్టాలు మరియు హ్యాండ్‌బుక్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవటానికి	హోమ్ పేజీలో "Election Laws & Handbooks" అనే లింక్
14	C.E.O. యొక్క E-Mail ID	ceo-telanganaeci.gov.in

ఓటర్ల జాబితా, 2018 యొక్క ఇంటెన్సివ్ రివిజన్:

ఓటర్ల జాబితాలోని లోపాలను సరిచేయుటానికి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలు కలిగిన 36 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్ల జాబితా యొక్క ఇంటెన్సివ్ రివిజన్ 2017లో చేపట్టబడినది. టాబ్లెట్ PC ని ఉపయోగిస్తూ బూత్ స్థాయి అధికారుచే ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో ప్రతి ఇంటిని సందర్శించి పరిశీలన చేపట్టబడినది. డాటాబేస్ నుండి సంబంధిత డాటాను పొందేందుకు మరియు తప్పొప్పులను సరిచేయుటానికి లేదా డాటాను ఎంట్రీ చేయుటానికి ఒక వెబ్ ఆధారిత దరఖాస్తు ఇవ్వబడినది. సేకరించబడిన డాటా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయబడినది.

భారత ఎన్నికల సంఘం 25 జనవరి 2011 నుండి తన వ్యవస్థాపక దినోత్సవమైన 25 జనవరిని ప్రతియేటా జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నది. "ఎన్నికలలో పాల్గొనటం" అనే ఇతివృత్తంతో 25 జనవరి 2018న 8వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోబడుతున్నది. భారత ప్రజాస్వామ్య ఘనతను పెంపొందించుటకు మరియు సార్వత్రిక వయోజన ఓటు హక్కును పరిపూర్ణం చేయుటకై ఈ సందర్భాన్ని వినియోగించుకోవడం ద్వారా ఓటర్ల నమోదును పెంచడమే ఈ సంఘం ఉద్దేశ్యం.

తెలంగాణ రాష్ట్రంలో 31,253 పోలింగ్ స్టేషన్లను పరిధిలోకి తెస్తూ 24,736 పోలింగ్ స్టేషన్ ప్రదేశాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేయబడినవి. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో నూతనంగా రిజిస్టరైన ఓటర్లు లోగో గల బ్యాడ్జి మరియు "ఓటరుగా గర్వించండి- ఓటేసేందుకు సిద్ధంకండి" అనే నినాదంతోపాటు కొత్త PVC (కలర్) EPIC (ఓటరు కార్డు)తో సన్మానించబడతారు.

విద్యార్థులకు / మహిళలకు పోటీలు

నేడు అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద విద్యార్థుల కొరకు - జూనియర్ స్థాయి (ఉన్నత పాఠశాల వరకు) మరియు సీనియర్ స్థాయి (ఉన్నత పాఠశాలలకు మించి) (i) వక్తృత్వంలో మరియు (ii) వ్యాసరచనలో మరియు (iii) మహిళల కొరకు రంగోలీలో పోటీలు నిర్వహించబడినవి. అన్ని స్థాయిలలో విజేతలకు మరియు పాల్గొన్న వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేయబడతాయి.

అంతేకాక, విద్యార్థుల కొరకు జాతీయ స్థాయి క్విజ్ పోటీ నిర్వహించబడింది. దిగువ తెలిపిన విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం నుండి రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేయబడ్డారు మరియు న్యూఢిల్లీలో సౌత్‌జోన్ రౌండ్‌లో పాల్గొన్నారు:

(i) CH. గోపీనాథ్ X వ తరగతి, ZPSS, ఎర్రుపాలెం, ఖమ్మంజిల్లా

(ii) P. స్వాతి, IX వ తరగతి, నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్, మధిర, ఖమ్మం జిల్లా.

ఆన్‌లైన్‌లో నమోదు సౌకర్యము

ఓటరు నమోదును పౌరులకు అత్యంత అనువుగా ఉంచేందుకు దరఖాస్తుదారుని ఇంటి వద్ద నుండే లేదా రాష్ట్రంలోని ఎట్టి మారుమూల ప్రదేశంలోని సమీప నెట్‌కెఫె/ ఇ-సేవ/మీ-సేవ/ పౌర సేవల కేంద్రాలనుండైనా ఓటరు నమోదు/దిద్దుబాట్లు/తొలగింపులను చేసుకునేందుకు CEO యొక్క వెబ్‌సైట్ (http://www.ceotelangana.nic.in) నందు అవకాశం కల్పించబడింది. 75% పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయి. మిగతా దరఖాస్తులు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు భౌతికంగా ఇవ్వబడ్డాయి.

ఓటరు అక్షరాస్యత క్లబ్‌లు

పాఠ్య ప్రణాళికేతర విధానాల ద్వారా భవిష్యత్ మరియు కొత్త ఓటర్లను పాల్గొనేట్లు చేసేందుకు నియత విద్యా వ్యవస్థ పరిధిలోలేని విద్యా సంస్థలు మరియు కమ్యూనిటీలలో ఓటరు అక్షరాస్యత క్లబ్‌లను (ELCs) నెలకొల్పాలని సంఘం ఆదేశించింది. ELC ల మొదటి బ్యాచ్ 8వ NVD, అనగా 25 జనవరి 2018న ప్రారంభించబడుతుంది. ఓటరు నమోదు, ఎన్నికల పూర్తి, ప్రక్రియ మరియు సంబంధిత విషయాల గురించి లక్షిత జనాభాకు అవగాహనను కల్పించటమే ఈ ELC ల ధ్యేయం.

NVD ప్రతిజ్ఞ

నేడు, NVD ప్రతిజ్ఞ విద్యా సంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో చేపట్టబడుతుంది. ఈ ప్రతిజ్ఞ పోలింగ్ కేంద్రం, అసెంబ్లీ నియోజకవర్గం వద్ద (జిల్లా మరియు రాష్ట్ర స్థాయి) NVD ఫంక్షన్లలో హాజరయ్యే పౌరులందరితో కూడా చేయించబడుతుంది.

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము.





CEO సందేశం

ప్రియమైన పౌరులారా!

మన దేశం రాజ్యాంగపరంగా గణతంత్ర దేశంగా అవతరించడానికి కేవలం ఒక రోజు ముందు అనగా 25 జనవరి 1950న రూపుదిద్దుకున్న ఒక ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూషన్ అయిన భారత ఎన్నికల సంఘం యొక్క వ్యవస్థాపక దినోత్సవం నేడే. NVD ప్రతి భారతీయ ఓటరు యొక్క సాధికారతకు అంకితం చేయబడినది. ప్రతి యువ భారతీయుడు ఓటరుగా నమోదుకావాలనే నిబద్ధతను పొందడము మరియు మతం, జాతి, కులం, కమ్యూనిటీ, భాష, ప్రాంతానికి అతీతంగా లేదా ప్రలోభాలకు గురికుండా ప్రతి ఎన్నికలో ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ రోజు గుర్తుకు తెస్తున్నది. ఈ ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, ప్రపంచంలో అతిపెద్ద మరియు అత్యంత ప్రభావశీల ప్రజాస్వామ్యంలో భాగస్వాములయిన పౌరులందరికీ మరియు కొత్తగా నమోదయిన ఓటర్లందరికీ నేను శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

సగర్వంగా నేను ప్రకటించునదేమనగా ట్యాబ్లెట్ డివైస్‌లను ఉపయోగిస్తూ ఇంటెన్సివ్ రివిజను నిర్వహించుట ద్వారా అర్బన్ మున్సిపల్ వార్డులలో ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టబడుటకు ఒక ప్రత్యేకమైనది మరియు సాహసోపేతమైన చర్య. బూత్‌స్థాయి అధికారులు ప్రతి ఓటరు ఉన్న ప్రదేశముతో సహా (lat-long) వివరములను నమోదు చేయుటానికి ఓటర్ల యొక్క ప్రతి ఇంటిని సందర్శించారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలలో ఇలాంటి చర్యలను చేపట్టడం దేశంలోనే ప్రథమము. ఓటర్ల జాబితాల భారీ ప్రక్షాళన మరియు పౌరుల సాధికారతకు ఈ చర్యలు సత్ఫలితాలిచ్చినవి.

ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జరిగే సంబరాలు అసెంబ్లీ నియోజకవర్గం మరియు జిల్లా ప్రధాన కార్యాలయాలతోపాటు అన్ని 24,736 పోలింగ్ స్టేషన్ కేంద్రాలలో జరుగుతున్నాయి. ఫారాలు (6,7, 8 & 8A) పంపిణీ కొరకు మరియు నేరుగా కేంద్రాల వద్ద భర్తీ చేసిన దరఖాస్తుల స్వీకరణ కొరకు అన్ని పోలింగ్ స్టేషన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయబడినవి. నేటి జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాలలో పాల్గొనాలని పౌరులందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

మన దేశం యొక్క ప్రజాస్వామ్య సాంప్రదాయాలను ఇనుమడింపచేయుటానికి మరియు మతం, జాతి, కులం, కమ్యూనిటీ, భాషకు అతీతంగా లేదా ఎట్టి ప్రలోభానికి గురికాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొనే నిబద్ధతను పాటించాలని జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ పూనవలసినదిగా పౌరులందరికీ నేను విజ్ఞప్తి కూడా చేస్తున్నాను.

అనూప్ సింగ్, IFS
ప్రధాన ఎన్నికల అధికారి (FAC), తెలంగాణ

ఎలక్టొరేట్ / ఓటర్లు

మున్సిపల్ కార్పొరేషన్లతో కూడిన తెలంగాణ రాష్ట్రంలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలలో 1-1-2018ను అర్హతా తేదీగా పేర్కొని ఓటర్ల జాబితా యొక్క ప్రత్యేక సవరణ చేపట్టబడింది మరియు తుది జాబితా 20-1-2018న ప్రచురించబడింది. 1-1-2018ని అర్హతా తేదీగా పేర్కొని ఓటర్ల జాబితా సవరణ యొక్క ప్రత్యేక సంగ్రహం క్రింద మిగిలిన 83 అసెంబ్లీ నియోజక వర్గాలలోని ముసాయిదా ఓటరు జాబితాలు 23-1-2018న ప్రచురించబడినవి. పైన తెలిపిన ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్ల మరియు పోలింగ్ స్టేషన్ల వివరాలు దిగువతెలిపిన విధంగా ఉన్నాయి.

జిల్లాల సంఖ్య	31
పార్లమెంటరీ నియోజకవర్గాల సంఖ్య	17
అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య	119
పోలింగ్ స్టేషన్ల సంఖ్య	31,253

ప్రచురణ తేదీ	23-1-2018 (83 అసెంబ్లీ నియోజక వర్గాలు -SSR, 2018 క్రింద ముసాయిదా జాబితా)	20-1-2018 (36 అసెంబ్లీ నియోజక వర్గాలు -IRER, 2018 క్రింద తుది జాబితా)	మొత్తం (టి.ఎస్)
సాధారణ ఓటర్ల సంఖ్య	1,54,55,451	95,05,786	2,49,61,237
పురుషులు	77,27,162	49,34,319	1,26,61,481
మహిళలు	77,27,076	45,69,924	1,22,97,000
మూడవ వర్గం	1,213	1,543	2,756

ఓటరు ఐడిని ఎలా పొందాలి?

ఇ-సేవ/మీ-సేవ/పౌర సేవల కేంద్రాల ద్వారా కలర్ PVC/ బ్లాక్ అండ్ వైట్ EPIC లను (ఓటరు కార్డులు) మూల్యం చెల్లింపుపై ఓటర్లకు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఎలక్టొరల్ ఆఫీసుల ద్వారా ఉచితంగా లభ్యమయ్యే సాధారణ సేవలతోపాటు, కొత్త కార్డు పొందాలనుకుంటున్న లేదా తమ కార్డును పోగొట్టుకున్న ఓటర్లు ఈ కేంద్రాల నుండి వాటిని పొందవచ్చును.


ఫారం-6ను వాడండి
18సం॥లు పూర్తయిన లేదా ఓటరుగా ఇతర నియోజకవర్గంలో నమోదైన వారు ఇటీవలి ఫోటో, వయస్సు రుజువు ధృవీకరణ పత్రం లేదా తల్లిదండ్రులు నిరక్షరాస్యులు అయినచో వారి నుండి డిక్లరేషన్‌తో దరఖాస్తు చేయండి

ఫారం-7ను వాడండి
ఇతర ఓటర్ల (మరణించిన/ షిఫ్ట్‌అయిన) పేర్లను తొలగించుటకు

ఫారం-8ను వాడండి
ప్రస్తుతమున్న జాబితాలోని ఎంట్రీలను సరిచేసుకొనుటకు (తప్పుడు ఫోటో/పేరు/ ఆద్యక్షరాలు, తండ్రి/భార్య లేదా భర్త పేరు వగైరా లాంటి ఇతర వివరాలు)

ఫారం-8Aను వాడండి
అదే నియోజకవర్గంలో మరొక పోలింగ్ ప్రదేశానికి మారినట్లైతే

జాతీయ ఓటర్ల దినోత్సవం 25 జనవరి 2018



సంప్రదించండి

ఫారాలు పొందడం / దాఖలు చేయడం మరియు ఫోటో ఓటర్ల జాబితాల్లో పేర్లను తనిఖీ చేసుకొనుటకు బూత్ స్థాయి అధికార్లు (BLOలు)/ తహసీలుదారు/ మండల/ RDO కార్యాలయాలను మరియు www.ceotelangana.nic.in వద్ద ఫారాలు పొందండి మరియు జాబితాల్లో పేర్లను తనిఖీ చేసుకోండి. ఇప్పటికే నమోదైనట్లైతే EPICని పొందుటకు e- సేవ/మీ-సేవ/AP ఆన్‌లైన్ కేంద్రాలను సంప్రదించండి.

ఓటరు గుర్తింపు కార్డు వలన ఇతర ప్రయోజనాలు:

నివాస ఫోటో ID రుజువు: బ్యాంక్ ఖాతా తెరవడం/ పాస్‌పోర్టు/ డ్రైవింగ్ లైసెన్స్/ PAN కార్డు/ విద్యా సంస్థల్లో ప్రవేశాలు/ మొబైల్ కనెక్షన్లు పొందడానికి వీలు కల్పిస్తుంది.



భారత ఎన్నికల సంఘం
నిర్వాచన్ సదన్, అశోకా రోడ్, న్యూఢిల్లీ-110001
వెబ్‌సైట్: www.eci.nic.in

అనూప్ సింగ్, IFS
ప్రధాన ఎన్నికల అధికారి (FAC), తెలంగాణ
H-బ్లాక్, సచివాలయం, హైదరాబాద్-500022

వివరాలకై కాల్‌చేయండి
1950
(ఉ. 8 గం. నుండి రా 8 గం.లు, టోల్ ఫ్రీ)



షేక్ అష్ఫక్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

టైప్ రైటింగ్‌లో షేక్ అష్ఫక్ గిన్నిస్ రికార్డు

చాంద్రాయణగుట్ట, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఫలక్‌నుమాకు చెందిన షేక్ అష్ఫక్ వేగంగా టైపింగ్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. అష్ఫక్ స్థానిక రైతుబజార్ సమీపంలోని సీఎస్‌సీ టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్‌లో అక్టోబర్ 2017లో నిర్వహించిన టైప్ రైటింగ్ పోటీల్లో పాల్గొన్నారు. 2015లో దుబాయ్‌లో జరిగిన టైప్ రైటింగ్ పోటీల్లో ఓ వ్యక్తి 1 నుంచి 50 అంకెలను 14.88 సెకన్లలో, ఇంగ్లిష్ అక్షరాలు ఏ నుంచి జెడ్ వరకు 3.37 సెకన్లలో టైప్ చేసి రికార్డు నెలకొల్పగా, అష్ఫక్ తిరగరాశారు. ఆదేవిధంగా కంప్యూటర్ కీబోర్డు కీలు కట్టుకొని ఏ-జెడ్ అక్షరాలను 4.13 సెకన్లలో టైప్ చేశారు. వీటిని రికార్డు చేసి లండన్ ప్రతినిధులకు పంపగా, పరిశీలించి గిన్నిస్ రికార్డులో చోటు కల్పించారు. వారు పంపిన మెడల్, సర్టిఫికెట్ నాలుగురోజుల కిందట అష్ఫక్‌కు చేరింది. అష్ఫక్‌ను డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అభినందించారు.

బీసీ సమాఖ్యల రిజిస్ట్రేషన్‌కు నూతన వెబ్‌సైట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ-బీసీ సహకార సమాఖ్యలు, సహకార సంఘాల రిజిస్ట్రేషన్ కోసం నూతన వెబ్‌సైట్ ప్రారంభించారు. ఈ విషయాన్ని హైదరాబాద్ జిల్లా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ సర్వీస్ కో ఆపరేటివ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మీ సేవా లేదా ఈ సేవా కేంద్రాల్లో సంప్రదించి ప్రతిపాదిత సహకార సంఘంలో చేరదలిచిన సభ్యుల వివరాలు సంఘం పేరు, చిరునామాతో దరఖాస్తు చేసుకోవాలి. దీని కోసం ఆధార్, ఆహార భద్రత, ఓటరు ఐడీ కార్డు, మీ సేవా ద్వారా జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రం నంబర్, ఆదాయ ధ్రువీకరణ పత్రం నంబర్, సభ్యుని ఫొటోను http:tsbcwd.cgg.gov.inలో అప్‌లోడ్ చేయాలి. నమోదు అనంతరం వివరాలను జిల్లా బీసీ డెవలప్‌మెంట్, బ్యాక్‌వర్డ్ క్లాసెస్ సర్వీస్ కో ఆపరేటివ్ అధికారికి ఆన్‌లైన్ ద్వారా సిఫారసు చేస్తారు. జిల్లా అధికారి పరిశీలించి బైలాస్‌ను ఆమోదించిన అడహక్ కమిటీని నియమించి రిజిస్ట్రేషన్ చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తూ సంబంధిత సభ్యులకు అనుబంధం కోసం ఆన్‌లైన్ ద్వారా సిఫారసు చేస్తారు. జిల్లా అధికారి ధ్రువీకరణ సంతకం చేసిన తర్వాత సంఘం నుంచి రూ.165 టీడీని సమాఖ్యకు పంపించాలి.

ఎల్‌ఆర్‌ఎస్ నకిలీ ప్రొసీడింగ్స్‌లో కదులుతున్న డొంక!

దళారీ నేతృత్వంలో అక్రమాలు జరిగినట్టు తేల్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్

- సహకరించిన జేపీవో, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి?
- నేడు ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హెచ్‌ఎండీఏలో వెలుగులోకి వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ నకిలీ ప్రొసీడింగ్స్ వ్యవహారంలో డొంక కదులుతున్నది. సంగారెడ్డికి చెందిన మహేశ్‌గౌడ్ ఇటీవల హేమలత్ అనే వ్యక్తి నుంచి ప్లాట్ కొని భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తుండగా ఆ ప్లాట్ ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ నకిలీవని తేలింది. దీంతో బాధితుడు హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులును ఆశ్రయించగా, ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తుకు ఆదేశించారు. అధికారుల ప్రాథమిక దర్యాప్తులో అక్రమాలు భారీగా జరిగినట్టు తేలింది. ఐటీ శాఖ సహకారంతో బాధితుడికి జారీ అయిన నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించగా చింతల్‌లో ఉండే దళారీ (బ్రోకర్) రాజేశం ప్రధాన పాత్ర పోషించాడని గుర్తించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం రాత్రి రాజేశంను విచారించగా సైదులు అనే వ్యక్తి సహాయంతో హెచ్‌ఎండీఏలో ముందస్తు డీడీలతో ఎంట్రీ చేసుకున్న ఎల్‌ఆర్‌ఎస్‌ను నంబర్‌ను హేమలత్ అనే వ్యక్తి ప్లాట్‌కు కేటాయించి ప్రాసెస్ చేసినట్టు చెప్పాడు. ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలనలో భాగంగా 2016 జూలైలో సంబంధిత ప్లాట్ క్రమబద్ధీకరణకు నిర్ణీత ఫీజును చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్టు సంస్థ రికార్డులోకి ఎక్కించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత ఫీజు చెల్లింపులు సంస్థ ఖజానాలోకి చేరకుండానే ధ్రువీకరణ పత్రం (ఫైనల్ ప్రొసీడింగ్స్) జారీ అయ్యింది. ఆ నకిలీ క్రమబద్ధీకరణ పత్రంలో అప్పటి ఓ జేపీవో అధికారి డిజిటల్ సంతకం ఉన్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. సంస్థ రికార్డుల్లో మాత్రం ఫీజు చెల్లించాలని నోటీసులు జారీ చేయడం, చివరగా సంబంధిత ఎల్‌ఆర్‌ఎస్‌ను రిజెక్ట్ చేసినట్టు కనబడుతున్నది. అయినా ఫైనల్ ప్రొసీడింగ్స్ జారీ అయిన తీరుపై బుధవారం సాయంత్రం వరకు విచారణ చేపట్టారు. రాజేశం వెల్లడించిన హెచ్‌ఎండీఏ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సైదులు, డిజిటల్ సంతకం ఉన్న జేపీవోను విచారించి గురువారం సాయంత్రంలోగా పూర్తి వివరాలు సేకరిస్తామని అధికారులు తెలిపారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. ఈ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినవారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కమిషనర్ చిరంజీవులు స్పష్టం చేశారు.

అంబేద్కర్‌నగర్ ఫ్లాట్లపై వివరాలు సమర్పించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని అంబేద్కర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ల నిర్మాణాలను నిలిపివేసేందుకు ఉమ్మడి హైకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. ఇక్కడ నిర్మించే ఫ్లాట్ల వ్యవహారంపై పూర్తి వివరాలను సమర్పించాలని ప్రభుత్వానికి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ గంగారావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. అంబేద్కర్‌నగర్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ల స్థలంలో తమ భూమి ఉన్నదని కొందరు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థన ఆధారంగా అప్పట్లో యథాతథ స్థితిని హైకోర్టు జారీచేసింది. అనంతరం నిర్మాణాలకు అనుమతించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పిటిషనర్లు అప్పీల్ చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఇరు పక్షాల వాదనలు పరిగణనలోనికి తీసుకుని డబుల్ బెడ్‌రూం నిర్మాణాలకు పోగా మిగిలిన భూమిని ఏమిచేస్తారనే విషయంపై పూర్తి వివరాలను సింగిల్ బెంచ్ న్యాయస్థానానికి సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నివేదిక ఆధారంగా సింగిల్ బెంచ్ న్యాయస్థానమే తదుపరి విచారణ చేపడుతుందని పేర్కొంటూ అప్పీల్‌పై విచారణను ముగించింది.

బల్దియాలో బర్త్ సర్టిఫికెట్ల స్కాం

- రూ.5 వేలు, తల్లిదండ్రుల పేర్లు ఇస్తే చాలు.. మూడురోజుల్లోనే నకిలీ సర్టిఫికెట్ చేతికి
- ముఠాగా ఏర్పడిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ఏజెంట్లు, మీసేవా నిర్వాహకులు
- 2,122 నకిలీ ధ్రువపత్రాలు గుర్తింపు..
- 13 మంది అరెస్ట్: రాచకొండ సీపీ మహేశ్‌భగవత్



నకిలీ ధ్రువపత్రాలు తయారుచేసిన ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీపీ మహేశ్‌భగవత్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఔట్ సోర్సింగ్ సిబ్బందితో కలిసి నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను సృష్టిస్తున్న ముఠాను రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌వోటీ) బుధవారం అరెస్ట్ చేసింది. ఎల్బీనగర్‌లోని కమిషనరేట్ క్యాంపు కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ వివరాలు వెల్లడించారు. కొందరు బ్రోకర్లు, మీ సేవా కేంద్రం నిర్వాహకులు, జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కలిసి ముఠాగా ఏర్పడి రూ.5 వేలు తీసుకొని నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నట్లు రాచకొండ ఎస్‌వోటీ ఇటీవల సమాచారం అందింది. దీంతో పోలీసులు సర్టిఫికెట్ కావాలంటూ ఏజెంట్లను సంప్రదించి కూపీ లాగి వెలుగులోకి తెచ్చారు. 13 మందిని అరెస్ట్ చేశారు. మరో 14 మంది పరారీలో ఉన్నారు. ఈ ముఠా 15, 18 సర్కిళ్లలో 2,122 నకిలీ పత్రాలు తయారుచేసినట్లు తేలింది, అన్ని సర్కిళ్లలో పరిశీలిస్తే భారీగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నదని సీపీ వెల్లడించారు.

నకిలీ పత్రాలు తయారీ ఇలా..

సరైన పత్రాలు లేనివారు, అత్యవసరంగా జనన ధ్రువీకరణ పత్రం కావాల్సినవారు, రెండో పాస్‌పోర్ట్ పొందాలనుకునేవారికి రెండు మూడు రోజుల్లో సర్టిఫికెట్ ఇప్పిస్తామని సంతకం రూ.5 వేలు వసూలు చేస్తారు. ఆ వ్యక్తి ధ్రువపత్రాల జిరాక్స్‌లు లేదా తల్లిదండ్రుల పేర్లను తీసుకొని ముఠాలో భాగమున్న మీ సేవ నిర్వాహకుడికి ఫోన్ చేస్తారు. సమాచారాన్ని ముఠాకు చెందిన జీహెచ్‌ఎంసీలోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పంపుతారు. తర్వాత ముఠాలోని హెల్త్ అసిస్టెంట్/సబ్‌రిజిస్ట్రార్ ఆ వివరాలను జీహెచ్‌ఎంసీ జనన, మరణ రిజిస్టర్‌లో నమోదు చేసి రిజిస్ట్రేషన్ నంబర్‌ను కేటాయిస్తారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆ వివరాలతో జీహెచ్‌ఎంసీ ఆన్‌లైన్ రికార్డు ఎంట్రీతో పాటు సర్టిఫికెట్‌ను రూపొందించి తిరిగి జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. మీ సేవా నిర్వాహకుడు సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఏజెంట్లకు అందిస్తారు. మూడేండ్లుగా ఈ దందా కొనసాగుతున్నది. అప్పటికే జారీ అయిన పత్రాల్లోనూ మార్పులు, చేర్పులు చేశారని తేలింది. జీహెచ్‌ఎంసీ సీలో సర్టిఫికెట్లు జారీ రికార్డుల్లో ఎంట్రీలను ఏటా డిసెంబర్ 31న నిలిపివేస్తారు. కానీ ఈ ముఠా ఎంట్రీని కొనసాగిస్తూ 1991–2010 మధ్య పాత తేదీలు వేస్తూ సర్టిఫికెట్లను తయారు చేస్తున్నట్టు తేలింది. అత్యధికంగా 1995 సంవత్సర తేదీలతో 763 నకిలీ ధ్రువపత్రాలను జారీ చేశారు.

ఉన్నతాధికారుల పాత్రపైనా ఆరా

ఈ వ్యవహారంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని, వారి పాత్రపైనా ఆరా తీస్తున్నామని సీపీ తెలిపారు. ఎవరెవరు సర్టిఫికెట్లను తీసుకున్నారో పరిశీలిస్తున్నామని, వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. చాలామంది రెండో పాస్‌పోర్టు పొందేందుకు నకిలీ పత్రాలు కోసం ఈ ముఠాను ఆశ్రయించినట్టు తెలిసిందన్నారు. ఈ నకిలీ సర్టిఫికెట్లతో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు ప్రయత్నించారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ ముఠా గుట్టును బయటపెట్టిన ఎస్‌వోటీ అదనపు డీసీపీ రఫీక్, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఇతర సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందజేశారు.

దొడ్డిదారిన రాకుంటే చుక్కలే..

జీహెచ్‌ఎంసీలో జనన, మరణ ధ్రువపత్రాల కోసం ఏజెంట్ల ద్వారా కాకుండా నేరుగా దరఖాస్తు చేస్తే సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ అమెరికాలో ఓ అంగ్ల దినపత్రికలో పనిచేస్తున్నారు. కొన్నేండ్ల కిందట తన తండ్రి మరణ ధ్రువీకరణపత్రం కోసం జీహెచ్‌ఎంసీలో దరఖాస్తు చేశారు. తొందరగా రావాలనే ఉద్దేశంతో అప్పటి కేంద్రమంత్రులు మంత్రి సుశీల్‌కుమార్‌షిండేతో ఇక్కడి సీఎంవోకు, అక్కడి నుంచి జీహెచ్‌ఎంసీ కమిషనర్ కృష్ణబాబుకు ఫోన్ చేయించారు. దీంతో వెంటనే ధ్రువపత్రం జారీ చేయాలని కమిషనర్ ఆదేశించినా సిబ్బంది వారంపాటు తిప్పించుకున్నారు. ఇంత పెద్దస్థాయిలో సిఫారసు ఉన్నా వారంరోజులు తీసుకున్న సిబ్బంది.. నకిలీ పత్రాలను రెండు మూడు రోజుల్లోనే జారీ చేస్తున్నారు.

పోలీసులు అరెస్ట్ చేసిన ముఠా సభ్యులు..

బ్రోకర్లు/ఏజెంట్లు: చౌలా సునీల్‌కుమార్, బల్లా చంద్రమౌళి, బద్దం రవికుమార్.

మీ సేవా నిర్వాహకులు: మేకల వెంకటాద్రి, బొంకలి రంజిత్‌కుమార్, గుడ్ల కృష్ణ, మాయే నారాయణ రావు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లు: బొరం భానుప్రకాశ్, సారా కిరణ్‌కుమార్.

జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది (సబ్ రిజిస్ట్రార్/హెల్త్ అసిస్టెంట్స్): అడపాలెడ్డి రాజు, యేదుగు రామకృష్ణ, దిటికెల బాబునాయుడు, రెడ్డి నాగిబాబు.

పరారీలో ఉన్నవారు: యాదగిరి, ఆనంద్, అబ్దుల్, తిరుపతి, వినయ్, దినేశ్, కనక య్య, కుమార్, మాథ్యూస్, రాజ్‌కుమార్, శ్రీను, సాగర్, ఏజెంట్ తిరుమలేశ్.

మాజీ సర్పంచ్ కిడ్నాపర్ల అరెస్ట్

- 30 కోట్లు డిమాండ్ చేసిన నిందితులు
- తప్పించుకొని వచ్చిన బాధితుడు
- పరారీలో ప్రధాన సూత్రధారి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా దేవరకొండ మాజీ సర్పంచ్‌ను కిడ్నాప్ చేసి రూ.30 కోట్లు డిమాండ్ చేసిన ముఠాను రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కిడ్నాపర్ల చెర నుంచి బాధితుడు తప్పించుకొని వచ్చి ఫిర్యాదు చేయడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కిరాయి హంతక ముఠా పోలీసులకు చిక్కింది. ఎల్బీనగర్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ క్యాంపు కార్యాలయంలో సీపీ మహేశ్ భగవత్ వివరాలు వెల్లడించారు. మాజీ సర్పంచ్ చేపల్లి అంతయ్య(68) హైదరాబాద్ బీఎన్‌రెడ్డినగర్‌లో ఉంటున్నారు. ఆయన ఈ నెల 20న మార్నింగ్ వాక్ పూర్తి చేసుకొని ఓ దుకాణం వద్దకు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా కారులోకి ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. అంతయ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. సీసీ కెమెరాలను పరిశీలించి కారు నంబర్, సెల్‌ఫోన్ నంబర్ రాకపోకలను విశ్లేషించగా కిడ్నాపర్లు చౌటుప్పల్ వైపు వెళ్లారని తెలుసుకొని గాలింపు చేపట్టారు. అదే రాత్రి అంతయ్య వారి నుంచి తప్పించుకొని వచ్చి వనస్థలిపురం పోలీసుల వద్దకు చేరారు. దీని వెనుక ఎవరున్నారో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కిడ్నాపర్లను గుర్తించారు. బుధవారం బైరోజు ప్రభాకర్, ఏలుపాక కృష్ణ, ముబారక్ అన్సారీ, షేక్ షరీఫ్ పూలిమోహెల్, షేక్ హసీబ్, షేక్ షోరబ్‌ను అరెస్ట్ చేశారు. కారు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి గౌటిముక్కల మాధవాచారి పరారీలో ఉన్నాడు.

గుంత పెట్టగానే తప్పించుకొచ్చాడు..

నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన మాధవాచారి మూడేండ్లుగా హయత్‌నగర్‌లో బంగారం దుకాణం నడుపుతున్నాడు. చోరీ సొత్తును తక్కువ ధరకు కొనుగోలు చేసిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అంతయ్యకు భారీగా ఆస్తులు ఉన్నట్టు తెలియడంతో కిడ్నాప్ చేసి రూ.30 కోట్లు గుంజాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా ఫేస్‌బుక్‌లో పరిచయమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముబారక్ అన్సారీతో కలిసి బెరం కుదుర్చుకున్నాడు. కిడ్నాప్ చేస్తే ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ఇస్తానన్నాడు. దీంతో అన్సారీ బెంగాల్ నుంచి షేక్ షరీఫ్, షేక్ హసీబ్, షేక్ షోరబ్ అలీని పిలిపించాడు. మాధవాచారి తన స్నేహితులు బైరోజు ప్రభాకర్, ఏలుపాక కృష్ణను ముఠాలో చేర్చుకున్నాడు. కొన్నాళ్లు రెక్కీ నిర్వహించి ఈ నెల 20న కిడ్నాప్ చేశారు. అతడు ముసుగు తొలగించి హయత్‌నగర్, చౌటుప్పల్ మధ్యలో ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడికి ఓ వ్యక్తి బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వచ్చి అంతయ్యతో మాట్లాడాడు. మీ కొడుకు అమెరికా వెళ్లి బాగా సంపాదించుకున్నాడని, కోడలు ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ కూతురని, మీకు దేవరకొండలో మంచి పేరు ఉన్నదని చెప్పి రూ.30 కోట్లు ఇస్తే వదిలిపెడతానని బెదిరించాడు. తన వద్ద అంత డబ్బు లేదని అంతయ్య బతిమాలడంతో చివరికి రూ.4 కోట్లు ఇవ్వాలని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వారు అంతయ్యను ఓ బండరాయి మీద కూర్చోబెట్టి గుంత తవ్వడం ప్రారంభించారు. ముగ్గురు కిడ్నాపర్లు ఆహారం కోసం దగ్గరలోని హోటల్‌కు వెళ్లారు. మిగిలిన వారు గుంత తవ్వుతుండగా అంతయ్య ధైర్యం తెచ్చుకొని నెమ్మదిగా బండరాయి దిగి చౌటుప్పల్ ప్రధాన రహదారిపైకి వచ్చి ఓ హోటల్ వద్ద పడిపోయాడు. స్థానికుల సాయంతో వనస్థలిపురం పోలీసులకు విషయం వివరించారు. పోలీసులు ముమ్మర దర్యాప్తుతో ముఠా గుట్టు వీడింది.




విద్యుత్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ రాయితీ?

- కాలుష్య నివారణకు రానున్న కొత్త పాలసీ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చిన కమిటీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పెరిగిపోతున్న వాహన కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ-వెహికిల్స్ పాలసీ తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా డీటీసీ ప్రవీణ్‌రావు నేతృత్వంలో కమిటీని వేసింది. ఈ కమిటీ ప్రభుత్వానికి పలు సూచనలతో నివేదిక సమర్పించింది. ఎలక్ట్రికల్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్‌ను రాయితీగా ఇవ్వాలని ప్రధానంగా సూచించినట్టు సమాచారం. అంతేకాకుండా ఒక వెహికిల్ ఉన్నవారు మరో ఈ-వెహికిల్‌ను కొనుగోలు చేస్తే సెకండ్ వెహికిల్ ట్యాక్స్ వసూలు చేయకుండా రాయితీ ఇవ్వాలని కూడా ప్రతిపాదించింది. ఇలా రాయితీలు ఇవ్వడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు ఉండటంతో విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతుందని కమిటీ పేర్కొన్నది. అంతేకాకుండా రాయితీపై పేదలకు, యువసంఘాలకు ఉపాధి కింద ఇచ్చే ఆటోలు, కార్లు తదితర ఇంధన వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. వీటన్నింటిపై మొత్తం రాయితీ ఇవ్వడం సాధ్యం కాని పక్షంలో కొంతైనా పన్ను వేయాలని సూచించారు. ప్రస్తుతం లైఫ్ ట్యాక్స్ బైక్‌లకు 9 శాతం, కార్లకు 12 శాతంగా ఉన్నది. రెండో వాహనం కొనుగోలు చేస్తే 14 శాతం చెల్లించాల్సి ఉంటుంది. కమిటీ సూచనలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత పన్ను విధానంపై స్పష్టత రానున్నది. మెట్రోరైలు ఫీడర్ సర్వీసులుగా ఎలక్ట్రికల్ వాహనాలు రానున్నాయి. ఆర్టీసీ సైతం ఎలక్ట్రికల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. బ్యాటరీ రిక్షాలు, ఈ-బైకుల మార్కెట్‌లోకి రానుండటంతో ప్రభుత్వం నూతన పాలసీని తీసుకురావాలని నిర్ణయించింది.

గజల్ శ్రీనివాస్‌కు బెయిల్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యువతిని లైంగికంగా వేధించిన కేసులో గజల్ శ్రీనివాస్ అలియాస్ కేశిరాజు శ్రీనివాస్‌కు బుధవారం నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తుతోపాటు ప్రతి బుధ, ఆదివారాల్లో పంజాగుట్ట స్టేషన్‌లో హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గజల్ శ్రీనివాస్ బుధవారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ఇదే కేసులో ఏ-2 నిందితురాలు, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న పార్వతికి కూడా కోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. గజల్ శ్రీనివాస్ ఆలయవాణి రేడియోలో జాకీగా పనిచేస్తున్న కరీంనగర్‌కు చెందిన యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు, మసాజ్ చేయాలంటూ వేధించాడు. అవకాశం వచ్చినప్పుడల్లా అనే మహిళ కూడా సహకరించేది. శ్రీనివాస్ వేధింపులు పెరగడంతో ఆ యువతి అతడి చేష్టలను వీడియో తీసి గతనెల 29న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆధారాలను పరిశీలించిన పోలీసులు గజల్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. పార్వతి అప్పటినుంచి పరారీలో ఉన్నది.

ఆస్తిపన్ను నిబంధనలో సవరణ!

- ప్రతిపాదన సిద్ధంచేస్తున్న బల్దియా
- అక్రమాలను అరికట్టడమే లక్ష్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం ఆస్తిపన్ను పరిధిలోకిరాని పాత ఆస్తులను పన్ను పరిధిలోకి తేవాలంటే జరిమానా కింద గరిష్ఠంగా రెండున్నరేండ్ల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధన చాలావరకు దుర్వినియోగం అవుతున్నది. ...

రూ.1000 పన్నుకు రూ.5000 విధింపు

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
గురువారం 25 జనవరి 2018

వెజ్ ప్రియులకు కావాల్సినన్ని వెరైటీలు.. అందులో టాపుగా ఉండాలనుకుంటే పన్నీర్ టేస్ట్ చేస్తారు.. అంతకంటే తోపు రుచిని పంచే టోఫులున్నాయి తెలుసా?

సోయా పాలతో తయారు చేసే ఈ టోఫులు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.. ఈ టోఫు మనదేశంలో పుట్టకపోయినా..

ఇప్పుడిప్పుడే రెస్టారెంట్లలో దర్శనమిస్తున్నాయి. వీటిని మీ ఇంటిలోకి ఆహ్వానించి.. భిన్న వంటకాలతో.. విభిన్న రుచులను ఆస్వాదించండి..

టోఫు రుచిలో టాపు!



టోఫు బుర్జీ



కావాల్సినవి :

టోఫు : అర కప్పు
జీలకర్ర : అర టీస్పూన్
ఉల్లిపాయ ముక్కలు : అర కప్పు
పచ్చిమిరపకాయలు : 2
పసుపు : పావు టీస్పూన్
టమాటా ముక్కలు : అర కప్పు
ధనియాల పొడి : అర టీస్పూన్
కొత్తిమీర : చిన్న కట్ట
ఉల్లి ఆకు : 1
నిమ్మరసం : ఒక టేబుల్‌స్పూన్
నూనె : ఒక టేబుల్‌స్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

స్టెప్ 1 : టోఫుని చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసి జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి బాగా వేగనివ్వాలి.
స్టెప్ 2 : ఇందులో పసుపు, టమాటా ముక్కలు వేసి మరో రెండు నిమిషాలు పాటు వేయించాలి.
స్టెప్ 3 : ఆ తర్వాత టమాటాలు ఉడికాక అందులో టోఫు, ధనియాల పొడి, ఉప్పు వేసి సన్నని మంట మీద కాసేపు ఉండనివ్వాలి.
స్టెప్ 4 : చివరగా కొత్తిమీర, ఉల్లి ఆకు, నిమ్మరసం వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. రుచికరమైన టోఫు బుర్జీ రెడీ!

టోఫు మేతీ చమన్



కావాల్సినవి : టోఫు : అర కప్పు, **వెల్లుల్లి** : 5 రెబ్బలు, **పచ్చిమిరపకాయలు** : 4, **ఉల్లిగడ్డ** : 1, **కొత్తిమీర** : చిన్న కట్ట, **పుదీనా** : చిన్న కట్ట, **పాల కూర** : ఒక కట్ట, **మెంతికూర** : చిన్న కట్ట, **బటర్** : ఒక టీస్పూన్, **శనగపిండి** : ఒక టీస్పూన్, **జీలకర్ర పొడి** : అర టీస్పూన్ , **ధనియాల పొడి** : అర టీస్పూన్, **గరం మసాలా** : పావు టీస్పూన్, **ఫ్రెష్ క్రీమ్** : 2 టేబుల్‌స్పూన్, **నూనె** : ఒక టేబుల్ స్పూన్, **ఉప్పు** : తగినంత

తయారీ :

స్టెప్ 1 : కడాయిలో నూనె పోసి వెల్లుల్లిపాయలు, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, పుదీనా, పాలకూర, మెంతికూర, ఉప్పు వేసి వేయించాలి.
స్టెప్ 2 : ఇవి వేగాక వీటిని మెత్తగా పేస్ట్ చేసి పక్కన పెట్టాలి. కడాయిలో బటర్ వేసి అందులో వెల్లుల్లిపాయలు, శనగపిండి ఒక నిమిషం పాటు వేగనివ్వాలి.
స్టెప్ 3 : దీంట్లో జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా, ముందు చేసిన పేస్ట్, కొద్దిగా నీళ్లు పోసి మూత పెట్టేయాలి. చిక్కగా అయ్యేంత వరకు అలా వదిలేయాలి.
స్టెప్ 4 : దీంట్లో టోఫు వేసి కలుపాలి. ఆ తర్వాత ఫ్రెష్ క్రీమ్ వేసి దించేయాలి. టోఫు మేతీ చమన్ నోరూరించడానికి మీ ముందుంటుంది.



చిల్లీ టోఫు

కావాల్సినవి : టోఫు : 200 గ్రా., **క్యాప్సికం ముక్కలు** : ఒక కప్పు, **అల్లం** : చిన్న ముక్క, **వెల్లుల్లి** : 4 రెబ్బలు, **మిరియాల పొడి** : పావు టీస్పూన్, **గ్రీన్‌చిల్లీ సాస్** : ఒక టేబుల్‌స్పూన్, **సోయాసాస్** : ఒక టేబుల్‌స్పూన్, **సోడియం సాల్ట్** : చిటికెడు, **వెనిగర్** : ఒక టీస్పూన్, **టమాటా కెచప్** : ఒక టేబుల్‌స్పూన్, **మైదా** : అర కప్పు, **కార్న్‌ఫ్లోర్** : పావు కప్పు, **పచ్చిమిర్చి పేస్ట్** : ఒక టీస్పూన్, **ఉల్లిగడ్డ** : 1, **పచ్చిమిరపకాయలు** : 4, **చక్కెర** : ఒక టీస్పూన్, **నూనె, ఉప్పు** : తగినంత



తయారీ :

స్టెప్ 1 : ఒక గిన్నెలో చిల్లీ పేస్ట్, కార్న్‌ఫ్లోర్, మైదా, ఉప్పు కొద్దిగా నీళ్లు పోసి చిక్కటి మిశ్రమంలా కలుపుకోవాలి. దీంట్లో టోఫు వేసి కలిపి కాసేపు పక్కన పెట్టాలి.
స్టెప్ 2 : కడాయిలో నూనె పోసి టోఫు ముక్కలను రంగు మారే వరకు వేయించి పక్కన పెట్టాలి. ఆ తర్వాత ఒక గిన్నెలో టమాటా కెచప్, వెనిగర్, సోడియం సాల్ట్, ఉప్పు, సోయా సాస్, గ్రీన్ చిల్లీ సాస్, మిరియాల పొడి వేసి కలిపి పక్కన ఉండనివ్వాలి.
స్టెప్ 3 : ఒక కడాయిలో కొద్దిగా నూనె పోసి అల్లం, వెల్లుల్లి, పచ్చిమిరపకాయలు వేయించాలి. దీంట్లోనే క్యాప్సికం, ఉల్లిగడ్డ ముక్కలను కూడా వేయాలి. ఇవి కాస్త వేగాక కలిపి ఉంచిన టమాటా మిశ్రమం, చక్కెర వేసి కలుపాలి.
స్టెప్ 4 : సన్నని మంట మీద కాసేపు ఉండనివ్వాలి. ఆ తర్వాత టోఫు వేసి మరొక నిమిషం ఉంచి దించేయాలి. ఘుమఘుమలాడే చిల్లీ టోఫు మీ నోరూరిస్తుంది.



సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్


టోఫు చీజ్ స్టిక్స్

కావాల్సినవి :

టోఫు : 200 గ్రా., **మైదా** : 2 టేబుల్‌స్పూన్స్, **ఒరెగానో ఆకులు** : అర టీస్పూన్, **ధనియాల పొడి** : ఒక టీస్పూన్, **ఎండుమిర్చి పొడి** : ఒక టీస్పూన్, **సోయా సాస్** : 2 టేబుల్‌స్పూన్స్, **కార్న్‌ఫ్లోర్** : 2 టేబుల్‌స్పూన్స్, **బ్రెడ్ క్రంబ్స్** : ఒక కప్పు,**ఉప్పు, నూనె** : తగినంత

తయారీ :

స్టెప్ 1 : టోఫుని నిలువుగా వచ్చేలా కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో సోయా సాస్, ఎండుమిర్చి పొడి, ధనియాల పొడి, ఒరెగానో ఆకులు వేసి బాగా కలుపాలి.
స్టెప్ 2 : దీంట్లో టోఫు వేసి కలిపి కాసేపు పక్కన పెట్టాలి. మరో గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, ఉప్పు, ధనియాల పొడి, కొన్ని వేడి నీళ్లు పోసి కలుపుకోవాలి.
స్టెప్ 3 : ఒక ప్లేట్‌లో బ్రెడ్ క్రంబ్స్ వేసి అన్నీ సిద్ధంగా పెట్టుకోవాలి. ఆ తర్వాత కడాయిలో నూనె పోసి వేడి చేయాలి.
స్టెప్ 4 : ఇప్పుడు టోఫులను ముందుగా మైదా మిశ్రమంలో, ఆ తర్వాత బ్రెడ్ క్రంబ్స్‌లో ముంచి నూనెలో డీప్ ఫ్రై చేయాలి. వీటిని వేడిగా తింటే టేస్టీగా ఉంటాయి.



టోఫు ఫ్రైడ్ రైస్

కావాల్సినవి :

టోఫు : ఒక కప్పు, **అన్నం** : 2 కప్పులు, **ఉల్లిగడ్డ** : 1, **క్యాప్సికం ముక్కలు** : ఒక కప్పు, **ఆలుగడ్డ ముక్కలు** : ఒక కప్పు, **క్యారెట్ ముక్కలు** : ఒక కప్పు, **పసుపు** : అర టీస్పూన్, **ధనియాల పొడి** : ఒక టీస్పూన్, **జీలకర్ర పొడి** : అర టీస్పూన్, **కారం** : ఒక టీస్పూన్, **ఉప్పు, నూనె** : తగినంత



తయారీ :

స్టెప్ 1 : కడాయిలో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి వేయించాలి. ఉల్లిపాయలు రంగు మారే వరకు వేయిస్తుండాలి.
స్టెప్ 2 : దీంట్లో క్యాప్సికం, ఆలుగడ్డ ముక్కలు వేసి కాసేపు కలుపాలి. ఆ తర్వాత క్యారెట్, పసుపు వేయాలి.
స్టెప్ 3 : ముక్కలన్నీ ఉడికాక.. ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, టోఫు వేసి కలుపాలి. ఇందులోనే అన్నం వేసి కలుపాలి.
స్టెప్ 4 : రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచి కలిపి దించేయాలి. దీన్ని వేడివేడిగా లాగించేస్తే చాలా బాగుంటుంది.

నమస్తే తెలంగాణ చిత్రం

ఆ తప్పుల్ని సరిదిద్దుకున్నాను!

'పిల్ల జమీందార్' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు అశోక్. ఆ తరువాత ఆయన చేసిన సినిమాలేవీ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. అయితే తాజా చిత్రంతో తప్పకుండా విజయాన్ని సొంతం చేసుకుంటానని చెబుతున్నారు అశోక్. ఆయన రూపొందిస్తున్న తాజా చిత్రం 'భాగమతి'. అనుష్క ప్రధాన పాత్రలో నటించింది. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో దర్శకుడు అశోక్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.


అశోక్

'తను గెలుస్తూ తన చుట్టూ వున్న వాళ్లను గెలిపిద్దామని ఎవరైనా ఒక వ్యక్తికి ఆలోచన వస్తే అతనిలో దైవత్వం ప్రవేశించినట్లు' అని ఈ సినిమా ప్రీరిలీజ్ వేడుకలో చెప్పడానికి కారణం?

• 'సుకుమారుడు' చిత్రీకరణ పూర్తవుతున్న సందర్భంలో అంటే 2012లో 'భాగమతి' కథను యు.వి.క్రియేషన్స్ వారికి వినిపించాను. వారికి నచ్చడంతో ప్రభాస్‌కు కథ వినిపించమన్నారు. కథ విన్న ప్రభాస్ 'చాలా కొత్తగా వుంది. తప్పకుండా చేద్దాం' అని చెప్పారు. యు.వి.క్రియేషన్స్‌ను వెనకుండి నడిపిస్తూ అందరినీ వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారాయన. ఆయన సహకారంతోనే అనుష్కకు కథ వినిపించాను. ఆమెకు కూడా నచ్చడంతో సినిమా చేయాలని బలంగా అనుకున్నాం. 'భాగమతి'ని అనుష్కతో తప్ప మరొకరితో ఊహించుకోలేక ఆమె డేట్స్ కోసం ఎదురుచూశాను. అందుకే ఈ సినిమా కార్యరూపం దాల్చడానికి ఇంత సమయం పట్టింది.

'భాగమతి' ఎలా వుంటుంది. ఏదైనా సంఘటనని స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను రాసుకున్నారు?

• 'భాగమతి' ఇదొక సార్వజనీనమైన కథ. ఏ ప్రాంతానికైనా,ఏ భాషకైనా దీన్ని ఆపాదించుకోవచ్చు. ప్రతీ చోట జరుగుతున్న కథనే నేను ఈ చిత్రంలో చర్చించాను. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ ఇది. సినిమా హారర్ థ్రిల్లరా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. హారర్ అంటే భయం. కానీ మనకు తెలిసిన హారర్ అంటే దయ్యం. అయితే మా సినిమా విషయంలో మాత్రం అలా ఆలోచించకుండా థియేటర్‌కు వస్తే థ్రిల్ ఫీలవుతారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం. సినిమా ప్రమోషన్ కోసం చెబుతున్న మాట కాదు ఇది. ఏ సినిమా ఫలితమైనా మార్నింగ్ షోతో తేలిపోతుంది.

ఇటీవల మీ దర్శకత్వంలో వచ్చిన చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాల్ని సొంతం చేసుకోలేకపోవడానికి కారణం?

• ఒక కథను అనుకున్న స్థాయిలో సమర్థవంతంగా చెప్పలేకపోయినప్పుడే అవి పరాజయాల్ని చవిచూస్తుంటాయి. అలా నేను రూపొందించిన చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయాయంటే ఆ తప్పు నాదే. గతంలో చేసిన తప్పుల్ని సరిదిద్దుకునే ఈ చిత్రాన్ని చేశాను. నిన్న సినిమా ఫైనల్ ప్రింట్స్ పూర్తి కావడంలో డాల్బీఅట్మాస్ థియేటర్ నుంచి బయటికి వస్తుంటే కళ్ల వెంట నీళ్లు తిరిగాయి. చిన్నపాటి భావోద్వేగానికి లోనయ్యాను.

'భాగమతి' అని టైటిల్ పెట్టడానికి కారణం?

• టైటిల్ ఖరారు చేయగానే 'అరుంధతి' తరహాలో టైటిల్ పవర్‌ఫుల్‌గా వుందని, సౌండింగ్ బాగుందిని చాలా మంది చెప్పారు. 'అరుంధతి' చిత్రాన్ని అనుష్క చేసింది కాబట్టే అరుంధతి అనే పేరు చాలా పాపులర్ అయింది. అలాగే 'భాగమతి' పేరు కూడా అలాగే పాపులర్ అవుతుంది. 'భాగమతి' అనేది సౌండిగ్ బాగుండటమే కాకుండా ఓ దేవత పేరు కాబట్టి ఈ టైటిల్ అయితే బాగుంటుంది అనిపించింది.

ఈ సినిమాకు అనుష్కనే ఎంచుకోవడానికి కారణం?

• కథ అనుకున్నప్పుడే ఈ పాత్రకు అనుష్క అయితేనే బాగుంటుందనుకున్నాం. ఆమె కోసమే ఈ కథను రాసుకున్నాను. నిర్మాతలు కూడా ఆమె అయితేనే బాగుంటుందని భావించారు. అందుకే ఆమె డేట్స్ కోసం ఇన్నేళ్లు ఎదురుచూశాం. అనుష్క అనగానే ప్రేక్షకులకు అంచనాలుంటాయి. ఆ అంచనాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా సినిమా వుంటుంది. సినిమా ఆలస్యం కావడం కూడా మా మంచికే జరిగిందేమో. 'బాహుబలి' తరువాత అనుష్క నటించిన ఈ సినిమా వస్తుండడం నాకు ప్లస్‌గా భావిస్తున్నాను. 'బాహుబలి'లో దేవసేనగా ఆకట్టుకున్న అనుష్కను 'భాగమతి'గా ఎలా చూపించారా? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో వుంటుంది. అనుష్క లేకపోతే ఈ సినిమా లేదు. ఎడమ భుజానికి సంబంధించిన గాయం బాధిస్తున్నా లెక్కచేయకుండా ఆమె సినిమా పూర్తి చేశారు.


లావణ్య త్రిపాఠి, సాయిధరమ్‌తేజ్, వి.వి.వినాయక్, సి.కల్యాణ్

నాన్న కోరిక నెరవేరింది!

'సి.కల్యాణ్ సంస్థలో సినిమా చేయమని మా నాన్నగారు ఎప్పుడూ చెప్పేవారు. అది 'ఇంటిలిజెంట్' సినిమాతో కుదిరింది. దీంతో మా నాన్న కోరిక నెరవేరింది'అన్నారు వి.వి.వినాయక్. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్నారు. సి.కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ 'గతంలో నేను రూపొందించిన 'కృష్ణ' చిత్రం తరహాలో అన్ని అంశాల్ని మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. సాయిధరమ్‌తేజ్ అద్భుతంగా నటించాడు. తను ఎంత ఎదిగినా అన్నయ్య చిరంజీవిలా వుండాలి. 'కొండవీటిదొంగ'లోని 'చమకు చమకు..అనే పాటను ఇందులో రీమిక్స్ చేశాం. ఈ పాటలో సాయిధరమ్‌తేజ్ వేసిన స్టెప్స్ చూసి ఆశ్చర్యపోయాను. శివ ఆకుల చక్కని కథని అందించారు. మా కాంబినేషన్‌లో హిట్ సినిమా అవుతుంది. లావణ్య గ్లామర్, తమన్ సంగీతం, ఎస్.వి.విశ్వేశ్వర్ ఛాయాగ్రహణం చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి' అన్నారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ 'ఖైదీనంబర్ 150' వంటి సినిమా తరువాత ఆయన నాతో సినిమా చేయడం ఆనందంగా వుంది. మంచి పాత్ర కుదిరింది. డబ్బింగ్ చెబుతున్నప్పుడు కొన్ని సన్నివేశాలు చూసి ఆశ్చర్యపోయాను. చేసింది నేనేనా అనిపించింది. నా సినిమాతో పాటు రిలీజ్ అవుతున్న వరుణ్‌తేజ్ చిత్రం కూడా సక్సెస్ కావాలి' అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ 'ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నాం. మా సినిమా ఎవరికి పోటీకాదు. సంక్రాంతికి బాలయ్య సినిమా 'జైసింహా'తో హిట్ కొట్టాం. 'ఇంటిలిజెంట్' కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. నిర్మాతగా నేను గర్వంగా చెప్పుకునే చిత్రమిది. వినాయక్ మార్కు ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగే ఎనర్జిటిక్ ఎంటర్‌టైనర్. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో లావణ్య త్రిపాఠి, సప్తగిరి, శివ ఆకుల, సి.వి.రావు, పచ్చా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

8.
నమస్తే తెలంగాణ
విందు
హైదరాబాద్
హైదరాబాద్
గురువారం 25 జనవరి 2018
బుధవారం 6 డిసెంబర్ 2017

బాలీవుడ్‌లో ఫ్యాషన్ దివా ఎవరంటే.. వెంటనే సోనమ్‌కపూర్ పేరు చెబుతారు. ఎక్కడ అడుగు పెట్టినా తనదైన మార్క్ వేయగల సత్తా ఆమె సొంతం. బొద్దుగా ఉండే ఈ ముద్దుగుమ్మ సినిమాల కోసం చాలానే త్యాగాలు చేసింది. కానీ అప్పుడప్పుడు తన జిహ్వాచాపల్యాన్ని వదులుకోనంటున్నది. ఇంకా ఆ అమ్మడు ఏం విందు ఆరగిస్తుందో తెలుసా?

40 సమోసాలు.. ఒకేసారి హాంఫట్ అనిపిస్తుంది!



అనిల్‌కపూర్ కూతురిగా తెరంగేట్రం చేసిన ఈ అమ్మడు బాలీవుడ్‌లో ఇప్పుడు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది. పైగా ఏ ర్యాంప్‌లోనైనా కొత్తగా కనిపించే ఈమెకు రుచుల్లో కూడా కొత్తకొత్తవి ట్రై చేయాలని కోరిక. 365 రోజులు చాక్లెట్‌కి సంబంధించిన పలు రకాల పదార్థాలు అంటే.. చాక్లెట్ కేక్, చాక్లెట్ కుకీస్, చాక్లెట్ ఐస్‌క్రీమ్ ఇలా తీరొక్కటి తెచ్చుకొని తింటుంది. ఇక ముంబైలో దొరికే స్ట్రీట్ ఫుడ్ అంటే తెగ ఇష్టమట. కానీ ఈ మధ్యకాలంలో బయటకు వెళ్లలేకపోతున్నానని బాధపడుతున్నది. బాంద్రాలో దొరికే బేల్‌పురీ, పానీ పురీ, పావ్ బాజీ వరకు అన్ని టేస్ట్ చేస్తానంటున్నది. ఇక తండ్రి అనిల్ కపూర్‌తో పోటీ పడి కనీసం 40 సమోసాలు లాగించేస్తుందట సోనమ్! సినిమా వాళ్లు ఎప్పుడూ కొబ్బరినీళ్లు తాగుతామంటారు. కానీ సోనమ్ మాత్రం కొబ్బరినీళ్లు, బటర్ మిల్క్, కీర దోస జ్యూస్ జోలికే వెళ్లనంటున్నది. ఢిల్లీలో చేసే ప్రత్యేక వంటకాలంటే కూడా సోనమ్‌కి చాలా ఇష్టమట. ఇవి కాకుండా జపనీస్, గ్రీక్, బెంగాలీ వంటకాలను ఇష్టంగా తింటుంది. ఒకవేళ ట్రావెల్ చేయాల్సి వచ్చినప్పుడు ఆలీవ్ ప్రొడక్ట్స్, తేనె ఎప్పుడూ తన దగ్గర ఉంటుందట. బ్రేక్‌ఫాస్ట్ ఎగ్‌వైట్, ప్రొటీన్ షేక్‌లతో మొదలవుతుంది. లంచ్‌లో సలాడ్, పప్పు, చపాతీ.. కప్పు చేపలకూర తెప్పించుకునేదట. కానీ ఈమధ్యకాలంలో తను పూర్తి వెజిటేరియన్‌గా మారిపోయింది.

కార్బో‘హై’డ్రేట్లు



శరీరానికి కావాల్సిన ప్రధాన వనరుల్లో కార్బోహైడ్రేట్స్ చాలా ముఖ్యమైనవి. ఇవి గ్లూకోజ్‌లోకి చాలా వేగంగా విచ్ఛిన్నం అవుతాయి. కాబట్టి ప్రొటీన్, కొవ్వు కణాల కంటే రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే.. మధుమేహ వ్యాధిగ్రస్తులు కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహార పదార్థాలు తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- సాధారణ కార్బోహైడ్రేట్లు ఫ్రక్టోజ్, గ్లూకోజ్ శాతాన్ని ఎక్కువగా కలిగి ఉంటాయి.
- కార్బోహైడ్రేట్లు సాధారణ రసాయనిక నిర్మాణాలు కలిగి ఉంటాయి. ఈ కారణంగా ఇవి రక్తంలో చక్కెర పెరుగుదల, ప్యాంక్రియాస్, ఇన్సులిన్ స్రావాల మీద ప్రభావం చూపుతూ, రక్తం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి.
- రెండవది కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు. ఇవి అత్యంత సంక్లిష్టమైన రసాయన నిర్మాణాలు కలిగి ఉంటాయి. ఒలిగోసకరైడ్లు, పోలిసాకరైడ్లు ఇందులో నిర్మితమై ఉంటాయి. ఇవి ఫైబర్, విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి. కాబట్టి జీర్ణం అవడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి.
- అంటే.. ఇవి రక్తంలోని చక్కెర మీద తక్షణ ప్రభావాన్ని చూపిస్తాయి. తెల్లజొన్న రొట్టె, తెల్ల ఆలూ, వంటి ఆహార పదార్థాల్లో సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, పిండి పదార్థాలు పుష్కలంగా ఉంటాయి.
- రక్తంలో కార్బోహైడ్రేట్లను అదుపులో ఉంచడానికి, ఇన్సులిన్ శాతం పెరుగడానికి బీన్స్, తియ్యటి బంగాళాదుంపలు, సంపూర్ణ ధాన్యాలు, వంటి ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు ఎంచుకోవాలి.
- రక్తం నుంచి అవసరమైన గ్లూకోజు పొందడానికి ఇన్సులిన్ ఉత్పత్తి చేయడమే శరీరం యొక్క సహజ ప్రతిస్పందన. అధిక కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకుంటే అధిక స్థాయిలో గ్లూకోజ్ విడుదలవుతుంది.
- దీని కారణంగా టైప్ 2 డయాబెటీస్ వ్యాధితో బాధపడుతున్నవారు రక్తంలో ఎక్కువ గ్లూకోజ్ కలిగి ఉంటారు.
- అందుకే మధుమేహంతో బాధపడేవారు తక్కువ క్యాలరీలున్న ఆహార పదార్థాలు తీసుకుంటే మధుమేహానికి చెక్ పెట్టొచ్చు.



డాక్టర్ మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
mayuri.trudiet@gmail.com



ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందన్నట్లు వ్యాపారాన్ని అభివృద్ధి పరుచుకోవడానికి పలువురు కొత్త కొత్త ఆలోచనలు చేస్తుంటారు. దీంతో అది ఆకర్షణగా మారి వ్యాపారాన్ని వృద్ధి చేస్తుంది. చైనాకు చెందిన ఓ వ్యాపారవేత్త చేసిన ప్రయోగం విజయవంతమై ఆయన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ఇంతకు ఆయన ఏం చేసాడంటే బోయింగ్ 737 విమానాన్ని రెస్టారెంట్ గా మార్చడమే. ‘లిల్లీ ఎయిర్వేస్’ పేరున మొట్టమొదటిసారి భిన్నంగా ఆవిష్కరించిన ఈ బోయింగ్ విమానం రెస్టారెంట్ ఇప్పుడు చాలామందిని ఆకట్టుకుంటున్నది.

విమానంలో విందు

ఈ విమానం రెస్టారెంట్‌లో భోజనం చేయాలంటే మాత్రం చైనాకు వెళ్లాల్సిందే. చైనాకు చెందిన ఒక వ్యాపార వేత్త మొట్ట ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ‘విమానం రెస్టారెంట్’ ప్రత్యేకాకర్షణగా నిలుస్తున్నది. వ్యాపారవేత్త లీ లియాంగ్ మే 2015లో ఇండోనేషియా ఎయిర్‌లైన్స్ బటావియాకు చెందిన బోయింగ్ 737 విమానాన్ని కొనుగోలు చేశాడు. అది.. డీ మౌంటింగ్, పోర్ట్, షిప్పింగ్, బిజినెస్ లైసెన్స్, ట్రేడ్ డిక్లరేషన్ వంటి విధి విధానాలు, కస్టమ్స్ ప్రొసీజర్లు పూర్తి చేసుకొని చైనా చేరేసరికి ఆర్నెల్లకాలం పట్టేసింది. తాను ఒక్కొక్కటిగా పనులు చేయించుకోవడంతో ఆ బోయింగ్ 737 విమానాన్ని ఎనిమిదిసార్లు డిస్ అసెంబుల్ చేశారని, ఇండోనేషియా నుంచి అది చైనా లోని ఊహాన్ చేరేసరికి నాలుగు నెలలు పట్టిందని లీ తెలిపాడు. ముక్కలు ముక్కలుగా విడి భాగాలను సుమారు 70 కంటెయినర్లలో షిప్పింగ్ చేశారని, అవి.. విడతలు విడతలుగా తనకు చేరేసరికి ఇంచుమించుగా రవాణాఖర్చుతో 452,325 డాలర్ల నుంచీ 5.28 మిలియన్ డాలర్లకు చేరిపోయిందట. ఇప్పుడు తాను స్థాపించిన విమానం రెస్టారెంట్ ప్రపంచంలోనే ఖరీదైన రెస్టారెంట్లలో ఒకటి.

ఎన్నో కష్టాలను ఎదుర్కొని చివరికి చైనా చేరిన పాత బోయింగ్ 737 విమానాన్ని లీ.. ఆప్టిక్స్ వ్యాలీ పెడెస్ట్రియన్ వీధిలో రెస్టారెంట్ గా ఏర్పాటు చేశాడు. ఊహాన్‌లోనే అత్యంత రద్దీగా ఉండే షాపింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ కొత్త హోటల్ ఇప్పుడు ఆసక్తికరమైన ఆహారపదార్థాలతో భోజనప్రియులతోపాటు.. విమాన ప్రియులకు ఆహ్వానం పలుకుతోంది. విమానంలోని క్యాబిన్ ప్రాంతాన్ని రెస్టారెంట్‌గా ఏర్పాటుచేసిన లీ.. జెట్ ఫైట్‌ను నడుపుతున్న అనుభూతి కలిగేలా కాక్ పిట్ ఏరియాను ఫ్లయింగ్ సిమ్యులేటర్‌గా మార్చేశాడు. తాను విభిన్నంగా రూపొందించిన ‘లిల్లీ ఎయిర్వేస్’ (రెస్టారెంట్)లో డిన్నర్ ఖరీదు ఒక్కొరికీ 30 నుంచి 40 డాలర్లు ఉంటుందని, అలాగే కాక్‌ఫిట్ సిమ్యులేటర్ వినియోగించాలనుకునే ఔత్సాహికులు 45 నుంచి 60 డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్తున్నాడు.







ఈ విమానాన్ని రెస్టారెంట్‌గా మార్చడానికి లీ చాలా ఖర్చు చేశాడు. చెఫ్‌ను కూడా విదేశాల నుండి తీసుకురావడంతో పాటు కిచెన్ ఏర్పాటుకు కూడా పెద్ద మొత్తాన్నే ఖర్చుచేశాడు. ఈ విమానంలో 128 మంది ప్రయాణీకులు ప్రయాణించడానికి వీలుండేది. ప్రస్తుతం ఇందులో 70 మంది అతిథులు ఒకేసారి భోజనం చేయడానికి వీలుగా వసతులు కల్పించారు. కొద్దికాలం క్రితం లీ స్వీడన్‌లో రెస్టారెంట్‌గా మారిన విమానాన్ని చూసిన తర్వాత చైనాలోనై అలాంటి ప్రయోగం చేయాలన్న ఆలోచనతో దీన్ని ఏర్పాటు చేశాడట. రెస్టారెంట్ థీమ్ విమాన నేపథ్యం కనుక అందులో పనిచేసే వెయిటర్స్‌ను కూడా ఎయిర్‌లైన్స్ ప్రమాణాల ప్రకారమే ఎంపిక చేశారట. ఇందులో పనిచేసే వెయిటర్స్ మగవాళ్లయితే 5 పీట్ల ఏడంగులాలు, ఆడవాళ్లు 5 ఫీట్ల నాలుగంగులాల పొడవు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరందరినీ కూడా ప్రత్యేక శిక్షణ ద్వారా ఎంపిక చేశారు.వెయిటర్లు, వెయిట్రిసెస్ అనుభవాన్ని నిర్ధారించడానికి వీలుగా వారికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేస్తున్న చెఫ్‌లలో ప్రపంచ వ్యాప్త ఆహార పదార్థాల తయారీలో అనుభవం ఉన్న వారు ఉన్నారని లీ చెబుతున్నారు.

ఈ విమానాన్ని పర్యాటక ప్రాంతం, మంచి వ్యాపార కూడలి నిత్యం వందలాదిమంది పాదచారులు పర్యటించే ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రతిరోజు పెద్ద సంఖ్యలో కస్టమర్లు వస్తున్నారట. ఫ్యామిలీ, సింగిల్ వేర్వేరుగా భోజనం చేయడానికి వీలుగా విమానంలోపలి భాగాన్ని విభజించారు. మొత్తం ఈయన ప్రయోగం ఫలించి రెస్టారెంట్ బ్రహ్మాండంగా నడుస్తున్నప్పటికీ తను విమానాన్ని కొన్న వెల మాత్రం ఇంకా రాలేదట పాపం!

నల్లకోడే బెస్ట్!



బ్రాయిలర్ కోడి కంటే నాటుకోడి బెస్ట్ అంటారు. కానీ ఇప్పుడు నాటుకోడి కంటే మంచి కోడి వచ్చింది.

నల్లకోడి ఇప్పుడు హైదరాబాద్ హోటల్లలో హల్‌చల్ చేస్తున్నది. ఇండోనేషియా, బాలీ దీవుల్లో ఈ కోళ్లను సెమనీ అంటారు. మధ్యప్రదేశ్‌లోని ఆదివాసులు అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు శరీరంలో వేడి పుట్టించే ఈ నల్లకోడిని తింటారు. కడక్‌నాథ్ కోడి అని పిలిచే ఈ నల్లకోడిలో అద్భుతమైన ఔషధ గుణాలున్నాయని ఆహార పరిశోధనా సంస్థ ధృవీకరించింది. కేవలం కోడి మాత్రమే కాదు.. దాని ఎముక కూడా నల్లగానే ఉంటుంది. నల్లగా ఉండడం వల్ల వండిన తర్వాత మాడిపోయినట్టుగా నల్లగా కనిపిస్తుంది. ఈ కోడి పెరుగడానికి దాదాపు ఆరు నెలల సమయం పడుతుంది. నరాల వ్యాధి, గుండె సంబంధ జబ్బులు, క్షయ, ఆస్తమా, తలనొప్పి, ఫిట్స్ వంటి ఆరోగ్య సమస్యలకు నల్లకోడి మాంసం మేలు చేస్తుంది. ఈ కోడిలో కొవ్వు శాతం చాలా తక్కువ. బి1, బి2, బి6, బి12, సి, ఇ, నియాసిన్, కాల్షియం, ఫాస్పరస్, నికోటినికి ఆమ్లం వంటి పోషకాలు నల్లకోడిలో పుష్కలంగా లభిస్తాయట.. నాటుకోడితో పోల్చితే ఈ కోడిలో ఐరన్ పదిరెట్లు ఎక్కువగా ఉంటుంది.

ఖరీదైన పువ్వులో పోషకాలెన్నో!

కుంకుమ పువ్వు ధర ఎక్కువే. కానీ ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.



- కుంకుమపువ్వు వాడితే శరీరంలోని సెరోటోనిన్ ప్రమాణాలు పెరుగుతాయి.
- ఈ పువ్వు జీర్ణశక్తిని పెంచుతుంది. జీర్ణక్రియ సంబంధిత సమస్యల నివారణకు కూడా ఈ పువ్వు ఉపయోగపడుతుంది.
- పొటాషియం శరీరంలో తక్కువగా ఉంటే డిప్రెషన్‌కి లోనవుతారు. కుంకుమ పువ్వు వాడితే పొటాషియం శరీరానికి లభించి డిప్రెషన్ నుంచి దూరమవుతారు.
- ఇందులో ఉండే పొటాషియం వల్ల రక్తపోటు తగ్గుతుంది. తద్వారా గుండె జబ్బులు తగ్గే అవకాశం ఉంటుంది.
- చాలామంది గర్భవతులు మాత్రమే కుంకుమ పువ్వు పాలల్లో వేసుకొని తాగాలి అనుకుంటారు. కానీ ఎవరైనా కాస్త గోరువెచ్చని పాలతో రాత్రి పూట తీసుకుంటే గాఢనిద్ర పడుతుంది.
- దగ్గు, కడుపుబ్బరం చికిత్సకు కూడా కుంకుమ పువ్వు మంచి మందులా పనిచేస్తుంది.

ఎలా వండాలో చెప్తుంది!

స్మార్ట్ కుకింగ్

ఫ్రిడ్జ్‌లో ఐదారు రకాల కూరగాయలున్నాయి. రెండు మూడు రకాల పండ్లున్నాయి. ఏం వండాలో తెలియదు. ఏం చేయాలి? యమ్లీ 2.0 యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. ఎలా వండాలో చెప్తుంది.

ఎలా వండాలో? ఏమేం వండాలో ఇప్పటికీ వందల యాప్‌లు వచ్చాయి. కానీ ఇదో భిన్నమైన యాప్. మీ ఫ్రిడ్జ్‌లో ఉన్న కూరగాయలను స్కాన్ చేస్తే మీరు ఏ కూర వండుకుంటే బాగుంటుంది. ఏమేం కలిపి వండితే ఎన్ని రకాల ప్రొటీన్లు వస్తాయి. ఎన్ని కిలో కేలరీలు వస్తాయి. ఏ ఏ కూరగాయలను కలిసి ఎలా వండుకోవాలో చెప్తుంది. మీ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని అనుగుణమైన, వాటికి సంబంధించిన వంటకాల రెసిపీలను మీకు అందిస్తుంది. వీటితో పాటు ఈ యాప్ వాల్‌పూల్ స్మార్ట్ పొయ్యి, మైక్రో ఓవెన్‌కు కూడా పని చేస్తుంది. ప్రతి వంటకం ఎలా చేయాలో స్టెప్ బై స్టెప్ చూపిస్తుంది. రాబోయే వేసవి కాలంలో దీన్ని ప్రారంభించనున్నారు. ఇది ఫ్రీ యాప్. ఆండ్రాయిడ్ ప్లే స్టోర్‌లో, ఐఓఎస్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.



సుడోకు

డైలీ సుడోకు 109 సమాధానం

1	6	3	7	5	2	9	8	4
5	9	2	8	4	6	7	3	1
7	8	4	3	9	1	6	5	2
3	7	5	9	1	4	2	6	8
6	4	9	2	8	3	1	7	5
2	1	8	6	7	5	3	4	9
4	3	6	5	2	9	8	1	7
9	5	7	1	3	8	4	2	6
8	2	1	4	6	7	5	9	3

డైలీ సుడోకు -110

2	1	4						3
		3			4		5	
	7							
7	3		1		9	8		
			2		8			
		2	3		7		9	5
							1	
	6		9			5		
4						9	2	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



సింగపూర్‌లో ఎంఎస్ ధోని క్రికెట్ అకాడమీ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా ధోనిని కలువడం సంతోషంగా ఉన్నది. క్రికెట్ కోసం ధోని తీసుకుంటున్న చొరవ అంతా ఇంతా కాదు.



శరత్ కుమార్
@realsarathkumar

శరత్ కుమార్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
825,729

కామన్‌మ్యాన్ వాయిస్

నీడను చూసి కూడా భయపడుతున్నారు కదా!
ఎవరు?
ఇంకెవరూ.. కాంగ్రెస్ పార్టీ వాళ్లు.
ఎందుకు?
పవన్ కల్యాణ్ పర్యటన పాపం వాళ్లను బాగా కలిచివేసింది. మరి వాళ్ల అన్నయ్య వీళ్ల పార్టీయే కదా.. తనతో ఒక పర్యటన పెట్టిస్తే బాగుంటుంది కదా. మీరు మరీనూ.. తెలంగాణ ప్రజలంటే ఏమిటో అందరికంటే కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ తెలుసు.
–Satya Prasad Peddapelli

డబ్బు.. ఆక్సిజన్‌లాంటిది. అది లేకుంటే ఊపిరాడక చచ్చిపోతాం. అది మాత్రమే ఎక్కువైతే అగ్గి రాజుకుని కాలిపోతాం(ఆక్సిజన్ మరీ ఎక్కువైతే మంట లంటుకుంటాయని చిన్నప్పుడు చదివినట్టు గుర్తు).
–JS Chaturvedi

వైరల్ వీడియో



ఆయన పేరు చిట్టిబాబు. అందరికీ సౌండ్ వినపడుతుంది. ఆయనకు మాత్రం కనబడుతుంది. ఇంకేమవుతుందో రంగస్థలం టీజర్ చూడండి.

Rangasthalam Official Teaser | Ram Charan | Samantha | Aadhi | DSP | Sukumar | #RangasthalamTeaser
Total views : 85,873+
Published on Jan 24, 2018

నమస్తే తెలంగాణ
రైతుబడి
[హైదరాబాద్]
గురువారం 25 జనవరి 2018



వరిలో కాండం తొలిచే పురుగు
యాజమాన్య పద్ధతులు



రాష్ట్రంలో యాసంగి వరి సాధారణ విస్తీర్ణం 6.15 లక్షల హెక్టార్లు. ఇప్పటి వరకు రెండున్నర లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. ప్రస్తుతం చాలా చోట్ల వరి నారుమడి దశలోనూ మరికొన్ని చోట్ల పిలకలు వేసే దశ నుంచి అంకురం వేసే దశలో ఉన్నది. ఈ యాసంగిలో వేసే రకాలైన తెలంగాణ సోన, కునారం సన్నాలు, బతుకమ్మ కాటన్‌దొర సన్నాలు, ఇర్ 64, తెల్లహంస రకాలలో కాండం తొలిచే పురుగు ఆశించి నష్ట పరుస్తుంది. కాబట్టి రైతులు ముందస్తు చర్యగా తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- ముదురు ఎండుగడ్డి లేదా పసుపు రంగులో ఉండే రెక్కల పురుగులు లేత నారు కొనల మీద గోధుమ రంగు ముద్దల వలె గుడ్లు పెడుతాయి.
- ప్రధాన పొలంలో పిలకదశలో ఆశిస్తే మొవ్వ చనిపోతుంది.
- అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్లకంకులు రావటం గమనించవచ్చు.

దీని నష్టాన్ని నివారించడానికి, ఖర్చు తగ్గించుకోవటానికి రైతాంగం కింది చర్యలు తప్పక చేపట్టాలి.

1. నారు పీకే వారం రోజుల ముందు 2-3 గుంటల నారుమడికి 800 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకతో కలిపి పలుచగా నీరు ఉంచి ఆ నీరు అందులోనే ఇంకే విధంగా చేయాలి.
2. రెక్కల పురుగు ఉధృతి గమనించడానికి ప్రధాన పొలంలో ఎకరాకు 3 లింగాకర్షక బుట్టలు అమర్చి వారానికి బుట్టకు 25 మగ రెక్కల పురుగులు పడినవెంటనే పిలక దశలో సస్యరక్షణ చేపట్టాలి.
3. తొలిదశలో ఈ పురుగు నివారణకు గాను ఎసిఫేట్ 75 శాతం ఎస్.పి 1.5 గ్రా. (300 గ్రా/ఎకరాకు) లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్.పి 2.0 గ్రా/లీటరు (400 గ్రా/ఎకరాకు) లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ 8.0 కిలోలు ఎకరానికి నాటిన 25-35 రోజుల్లోపు వేయాలి.
4. అంకురం నుంచి చిరుపొట్ట దశలో తప్పనిసరిగా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్.పి 20గ్రా. (400 గ్రా, ఎకరానికి) లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ./లీ. (60 మి.లీ/ఎకరానికి). ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం తయారుచేసుకొని పిచికారీ చేయాలి.

అంకురం నుంచి చిరుపొట్ట దశలోపు రైతాంగం అత్యంత శ్రద్ధ వహించి పైన సూచించిన మందులను తప్పకుండా పిచికారీ చేయాలి. ఒకవేళ ఈ దశ దాటి తెల్ల కంకులు వచ్చాక మందులను పిచికారీ చేసినట్లయితే ఎలాంటి ఫలితం ఉండదు, పైగా వృథా ఖర్చు కూడా.



ఆర్. జగదీశ్వర్,
ప్రధాన శాస్త్రవేత్త (వరి)
వరి పరిశోధన కేంద్రం,
రాజేంద్రనగర్
8179540261



నాడు జవాన్ నేడు కిసాన్

ప్రభుత్వ ప్రోత్సాహంతో పాలీహౌజ్ నిర్మాణం ● చామంతి పూల సాగుతో లాభాలు

అతను దేశ రక్షణలో సీఐఎస్ఎఫ్‌లో 23 ఏండ్ల పాటు జవాన్‌గా పనిచేశారు. అనంతరం శారీరకంగా ఇబ్బందులతో ఎనిమిదేండ్ల కిందట వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం చామంతి పూల సాగును చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో పాలీహౌజ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందులో మేరీగోల్డ్ చామంతి రకం సాగుచేస్తూ నిత్యం క్వింటాల్ పూల దిగుబడిని సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రాందాస్ నాయక్ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాక తండాకు వచ్చి తనకున్న నాలుగెకరాల పొలంలో దాదాపు ఆరేండ్ల పాటు సేద్యం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాలీహౌజ్‌ల నిర్మాణాల కోసం అందిస్తున్న ప్రోత్సాహకం గురించి తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు అతనికి పాలీహౌజ్‌ను మంజూరు చేశారు. పాలీహౌజ్ నిర్మాణానికి రూ.34 లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, రూ.25 లక్షల 80 వేలు సబ్సిడీ అందింది. మొక్కల పెంపకానికి, ఎరువులు, మందులు, ప్రత్యేక బెడ్ ఏర్పాటుకు సంబంధించి మరో రూ.14 లక్షల 80 వేలు మంజూరు చేయగా, వీటిలో రూ.11 లక్షల 16 వేలు సబ్సిడీ కింద అందజేసింది. మొత్తం రూ.49 లక్షలకు గాను రూ.37 లక్షలను ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చింది. తాను సొంతంగా మరో రూ.10 లక్షలు సమకూర్చుకొని ఎకరా పొలంలో పాలీహౌజ్‌ను నిర్మించుకుని డ్రిప్ సాయంతో పూలసాగును చేపట్టారు.

భిన్న రకాల పూల సాగు

రాందాస్ నాయక్ మేరీగోల్డ్ చామంతి నారును బెంగళూరు నుంచి తెప్పించి దాదాపు 20 వేల మొక్కలను నాటారు. ఒక మొక్కకు రూ.18 చొప్పున మొత్తం మొక్కలకు రూ.3.60 లక్షలు ఖర్చు చేశారు. 45 రోజులకు ఈ చామంతి మొగ్గలు మొదలైనప్పటికీ 90 రోజుల వ్యవధి వచ్చే వరకు మొగ్గలను నిలువరించారు. ఆగస్టులో నాటిన ఈ పూల మొక్కలు డిసెంబర్ నెలలో పూర్తిస్థాయిలో పువ్వులు పూయడం మొదలైంది. ముప్పావు ఎకరాలో మేరీగోల్డ్ చామంతి నాటగా ప్రస్తుతం కాపు మొదలైంది. మరో పావు ఎకరాలో నెల రోజుల తేడాతో జంబో చామంతిని నాటగా ప్రస్తుతం మొగ్గ దశలో ఉన్నది.

ప్రతి రోజు 100 కిలోల దిగుబడి..

ఇప్పుడిప్పుడే మొదలైన మేరీగోల్డ్ చామంతి పూలను ప్రతి రోజు 100 కిలోల వరకు తెంపుతున్నారు. వీటన్నింటినీ స్థానిక మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. ప్రతి రోజు ఎనిమిది మంది కూలీలు పని చేస్తున్నారు. పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాల సమయంలో మంచి డిమాండు ఉంటుంది. ఇప్పుడు లేనందున మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.80 చొప్పున అమ్ముకుంటున్నాడు. సీజన్ వస్తే ఇవే పూలను రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముతామని తెలిపారు. ఆర్డర్‌లను బట్టి ఎన్ని కిలోలు కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నానని, రోజు మూడు క్వింటాళ్లయినా సరఫరా చేయనున్నారు. ఇంకా ఆరు నెలలకుపైగా ఈ చామంతి పూలు బాగా పూసే అవకాశం ఉన్నది. కాగా, మరో నెల తర్వాత జంబో చామంతి కూడా పూర్తి స్థాయిలో కాపునకు వస్తుంది.

-వంగూరు నరసింహారెడ్డి
వనపర్తి 9182777677

సహకారం లేకుంటే సాధ్యమయ్యేది కాదు..



రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించకుంటే మాలాంటి వాళ్లకు ఇది సాధ్యమయ్యే పని కాదు. లక్షల రూపాయలు సబ్సిడీ ఇవ్వడం వల్ల పాలీహౌజ్ ఏర్పాటు చేసుకున్నాను. ఇప్పుడిప్పుడే పూల పంట చేతికి వస్తున్నది. ప్రతి రోజు సొంతంగా స్థానిక మార్కెట్‌లో అమ్ముకుంటున్నాను. సీజన్ వస్తే బాగా డిమాండ్ ఉంటుంది. వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట కేంద్రాల్లోనే ప్రస్తుతం చామంతిని అమ్ముతున్నాను. వివాహాలకు, పూజలకు ఇతర కార్యాలకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే తాజా చామంతి పూలను అందజేస్తాం.

– రాందాసు నాయక్, రైతు 9885468477

ఆడుతూ పాడుతూ పని



నేను డిగ్రీ చదువుతున్నాను. తండాలోనే చామంతి పూలతోట ఉన్నది కాబట్టి సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు పూల కటింగ్‌కు వస్తాను. పెద్ద కష్టమైన పని కాదు. ఆడుతూ, పాడుతూ చేసే పని కాబట్టి సరదాగా పూలను తెంపుతున్నాం. వేరే పనికంటే ఇందులో ఉత్సాహం ఉన్నది. ఇంటి దగ్గర వద్దన్నా మాకు రావాలనిపిస్తుంది.

– మంజుల, అనకాయిపల్లి తండా

పదిమందికి ఉపాధి



మా తండాలో ఇంత పెద్ద చామంతి తోటను చూస్తే పొద్దస్తమానం ఇక్కడే ఆడుకోవాలనిపిస్తుంది. ఇంటర్ చదువుతున్నాను. సెలవులున్నప్పుడు పూలు తెంపడానికి వస్తాను. రంగురంగుల పూలతో ఆడుకున్నట్లుగానే ఉంది తప్ప పని చేసినట్లు లేదు. మా తండాలో పది మందికి ఈ పాలీహౌజ్ ద్వారా పని దొరుకుతున్నది. ప్రతి ఒక్కరు రోజుకు 10 నుంచి 15 కిలోల పూలను కట్ చేస్తాం.

– మౌనిక, అనకాయిపల్లి తండా

ఇంత స్వేచ్ఛ ఎక్కడా ఉండదు

ఉద్యోగం వదిలి ఊరిలో వ్యవసాయం • కూరగాయల సాగు.. ఆన్‌లైన్ మార్కెటింగ్

ఈ రోజుల్లో చదువుకున్న యువకులు ఉద్యోగాల కోసం పరుగులు పెడుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో నెలకు నలభై నుంచి లక్ష రూపాయల జీతం పొందేవారున్నారు. కానీ వ్యవసాయం వైపు ఆసక్తి చూపలేకపోతున్నారు. కానీ వచ్చిన ఉద్యోగాన్ని వదిలి ఇంటివద్దనే వ్యవసాయ చేస్తూ ఉపాధి పొందాలనుకునే వారు చాలా తక్కువ. కానీ సదాశివపేట పట్టణానికి చెందిన రమామాకాంత్ అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి స్వస్తిపలికి వ్యవసాయం బాటపట్టాడు. రెండేండ్లలోనే కూరగాయల సాగులో లాభాలు గడిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



పాశికంటి రమాకాంత్‌కు మండలంలోని ఎన్కెపల్లిలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా 75 శాతం రాయితీపై పాలీహౌజ్‌ను మంజూరు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీతో పాలీహౌజ్ షెడ్లు నిర్మించుకొని రెండేండ్లుగా కూరగాయల సాగు చేస్తున్నాడు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధిస్తున్నాడు. ఉద్యోగం కన్నా వ్యవసాయంలోనే ఆదాయం ఎక్కువగా ఉందంటున్నాడు రమామాకాంత్.

ఎక్కువ లాభాలు

బయట పదెకరాల్లో సాగు చేసి పండించే పంటకన్నా పాలీహౌజ్ రెండెకరాల్లో పండించి ఎక్కువ లాభాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నాడు. బయట పండించే పంటలకు రకరకాల చీడపీడలు సోకుతాయి. వాటిని అదుపు చేయాలంటే క్రిమిసంహారక రసాయన మందులు వాడుతారు. పాలీహౌజ్‌లో బయటి వాతావరణ ప్రభావం పడకుండా ఉంటుంది. ఎలాంటి చీడపీడల బెడద ఉండదు. పాలీహౌజ్ షెడ్ పైకప్పు, చుట్టూ ఉన్న పాల్తీన్ కవరు మొక్కకు కావాల్సినంత మోతాదులో వాతావరణాన్ని అందిస్తుంది. ఇందులో పండించే కూరగాయల పంటలకు సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు, బయో ఆర్గానిక్ మందులు వాడుతున్నాం. దీనితో మొక్కలు ఆరోగ్యంగా ఎదిగి రైతు ఆశించినంత దిగుబడిని ఇస్తుంది.

నీరు, సమయం ఆదా

పాలీహౌజ్‌లో పంటలకు డ్రిప్పు ద్వారా తక్కువ సమయంలో తక్కువ నీటితో ఎక్కువ పారుకం చేయవచ్చు. మొక్క దశను బట్టి నీళ్లను అందిస్తారు కావాల్సిన తేమను మొక్క పీల్చుకుంటుంది. పది నుంచి పదిహేను నిమిషాల్లో రెండెకరాలకు నీటిని డ్రిప్పు ద్వారా పారబెడుతున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో ఆటోమెటిక్ డ్రిప్పు పరికరాలతో నీటిని అందిస్తాం. ఈ ఆటోమెటిక్ డ్రిప్పు పైపులను పై నుంచి అమర్చడంతో మంచు మాదిరిగా స్ప్రే అవుతుంది బయటినుంచి వచ్చే వేడిని అదుపుచేస్తుంది.

ఎండకాలంలో కీర దోస మేలు

వచ్చేది ఎండకాలం. కాబట్టి ఆకుపచ్చ కీరదోస సాగుకు దుక్కిని సిద్ధం చేస్తున్నారు. ఈ దోస మొక్కలను నాలుగు సెంటీ మీటర్లకు ఒక మొక్కను నాటుతారు. ఈ మొక్కలను నర్సరీల నుంచి కొనుగోలు చేసి నాటుతారు. ఎకరాకు 10 నుంచి 12 వేల మొక్కలు నాటుతారు. దీనికోసం రూ.40 నుంచి 50వేల ఖర్చవుతుందని అంటున్నారు. ఒక మొక్కకు పంట దిగుబడి నాలుగు నుంచి ఐదు కిలోల దిగుబడి ఉంటుంది. ఒక ఎకరాకు 38 నుంచి 40 టన్నుల పంట దిగుబడి వస్తుందని రైతు పేర్కొంటున్నాడు. కీర దోసకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుందన్నారు.

పూల సాగులో లాభాలు

పాలీహౌజ్‌లో కూరగాయలతో పాటు పూల తోటలు సాగు చేస్తే లాభాలు బాగా ఉంటాయి. జెర్బర పూలకు పెండ్లిళ్ల సీజన్‌లో డిమాండ్ ఉంటుంది. మార్కెట్‌లో ఒక పువ్వు 15 రూపాయల చొప్పున అమ్ముడుపోతుంది. ఈ పూలన్ని హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌లోని పూల మార్కెట్‌లో విక్రయిస్తారు.

ఆన్‌లైన్ మార్కెట్

పండించిన పంటను ఆన్‌లైన్ ద్వారానే మార్కెట్ చేస్తున్నట్లు రమాకాంత్ అన్నాడు. పంట అమ్మిన వారంలోపే డబ్బులు ఆన్‌లైన్ ద్వారా అకౌంట్‌లో జమవుతాయని అన్నాడు. ఈ పంటను బిగ్ బాస్కెట్ మార్కెట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని కూరగాయలు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. బయటి మార్కెట్ కంటే కిలోకు ఒకటి, రెండు రూపాయలు ఎక్కువధరకు కొంటారన్నాడు. వ్యవసాయంలో ఉన్నంత స్వేచ్ఛ ఎక్కడ పనిచేసినా ఉండదంటున్నాడు.

ప్రభుత్వ ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం రైతు వాటా 25 శాతం చెల్లించగా ప్రభుత్వం సబ్సిడీ 75 శాతం కలిపి పాలీహౌజ్ షెడ్ నిర్మించి ఇచ్చింది. ఎకరాకు రూ.32 లక్షలు మంజూరు చేసింది. అందులో రైతు వాటా రూ 8.40లక్షలు కాగా ప్రభుత్వం సబ్సిడీ రూ 24.60 లక్షలు. ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసారంగాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేసింది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామీణ ప్రాంతాల రైతులను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి నూతన ఉత్తేజాన్ని నింపుతున్నారని అభిప్రాయపడ్డారు. ఎకరం రెండెకరాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఈ పాలీహజ్‌లు ఎంతో దోహదపడి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతాయి.

– ఎర్రోళ్ల విజయ్‌కుమార్, సదాశివపేట
94400 97091

వ్యవసాయంపై ఆసక్తితో...

ఎంబీఏ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ వేలకు వేలు జీతం వచ్చినా ప్రశాంతత లేకుండే. ఉన్న ఊరును, కుటుంబాన్ని వదిలి దూరంగా పన్నెండేండ్లు ఉద్యోగం చేశాను. ఎంత సంపాదించినా తన కుటుంబం కళ్లముందు లేనిది ఎందుకని ఉద్యోగాన్ని వదిలేశా ను. వ్యవసాయంపై ఆసక్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలీహౌజ్‌లకు సబ్సిడీ కోసం ఉద్యానవన శాఖకు దరఖాస్తు పెట్టుకున్నా. షెడ్లు నిర్మించి సాగు చేపట్టిన ఉపాధి పొందుతూ నలుగురికి పని కల్పిస్తున్నా. రెండేండ్లుగా ఆర్థిక పురోగతి సాధిస్తున్నా. వ్యవసాయంలో వేసిన పంటను రోజు పర్యవేక్షించినప్పుడే నష్టాలు రావు. అధిక దిగుబడులు సాధించి లాభాలను పొందవచ్చు.

– పాశికంటి రమాకాంత్,
యువరైతు సదాశివపేట, 98498 32389



పసుపు ఉడికించటంలో జాగ్రత్తలు

పసుపును తయారీ (ప్రాసెసింగ్) ఉడకబెట్టడం, ఆరబెట్టడం, అలాగే పాలిష్ వంటి అంశాలపై జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ జిల్లా అధికారి సూర్యనారాయణ తెలిపారు.

తల్లి దుంపలు, పిల్ల దుంపలు వేరుచేసి, శుభ్రంగా కడిగి వేడిచేయాలి. ఉడకబెట్టడం అనేది పొడి కొమ్ములను శుభ్రమైన పాత్రలో వేసి, అవి మునిగేదాక నీళ్లు పోసి ఉడకబెట్టాలి. ఉడకబెట్టే సమయంలో పాత్రలో సరిపడా నీళ్లు పోయాలి. కొమ్మలు పూర్తిగా మునిగి, ఒక క్రమపద్ధతిలో ఉండేటట్లు వేడి చేయాలి. పాత్రలో ఉన్న నీరు మరుగడానికి దాదాపు 45-60 నిమిషాలు పడుతుంది. అలాగే మరిగే నీళ్ల నుంచి వచ్చే నురగలూ, ఒక విధమైన వాసన వెలుబడిన తర్వాత దుంపలు ఉడికినట్లు గుర్తించాలి.

పాలిష్ చేసే పద్ధతి

నీటితో బాగా శుభ్రం చేయబడిన పసుపు కొమ్ములను చదునైన, పరిశుభ్రమైన ప్రదేశం పైగా ఎండలో ఆరబెట్టాలి. అప్పుడప్పుడు ఈ కొమ్ములను పైకి, కిందికి తిప్పుతూ ఉండాలి. క్రమపద్ధతిలో ఆరడం జరుగాలంటే పసుపు కొమ్ములను రాత్రి పూట కుప్పగా వేసి, దానిని కప్పి ఉంచాలి. వర్షం నుంచి రక్షణ కల్పించాలి. పసుపు కొమ్ములు కనుక వర్షానికి గురయితే నారింజ రంగులోకి మారిపోతాయి. పూర్తిగా ఆరినప్పుడు పసుపు కొమ్ములు గట్టిపడి, చాలావరకు గరుకుగా ఉండి ఒక క్రమమైన పసుపు రంగును కలిగి ఉంటాయి. ఎండబెట్టిన పసుపును యథాతథంగా గాని, లేక పాలిష్ చేసిగాని విక్రయిస్తారు. ఎండబెట్టిన కొమ్ములను మాములుగా చేతులతో గాని, లేక యంత్రం ద్వారా గాని పాలిష్ చేస్తారు. గట్టిగా గరుకుగా ఉంటే ఏదైనా ఉపరితలంపై వీటిని రుద్దడం లేక గొనె సంచులలో వేసి పాదాలతో తొక్కవచ్చు. అంతేగాక ఆధునిక పద్ధతి ద్వారా పాలిషింగ్ చేసే అవకాశం ఉంది. పసుపు కొమ్ములను ఇంకా ఆకర్షణీయంగా మెరుగుపర్చాలనే ఉద్దేశంతో పాలిషింగ్ చేసేటప్పుడు గాని, ఆ తర్వాత గానీ, రసాయన రంగులను వాడకూడదు. ఎందు కంటే రసాయనాలలు లేక కృత్రిమ రంగులను పసుపు దిగుమతి చేసుకొనే దేశాలు బహిష్కరించాయి. ఇది రైతులు దృష్టిలో పెట్టుకోవాలి.

ప్యాకింగ్ చేయడం

పరిశుభ్రమైన కొత్త సంచులను మాత్రమే ఎండిన పసుపును ప్యాక్ చేయడానికి ఉపయోగించాలి. ఎండు పసుపును ప్యాక్ చేయడానికి పాలిథిన్‌తో లామినేట్ చేయబడిన గోనె సంచులను ఉపయోగించడం మంచిది. ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వచేసే పద్ధతులు,రవాణా చేయడంలోనూ నాణ్యత క్షిణించిపోకుండా చూడాలి.

నిల్వ చేయటకు జాగ్రత్త చర్యలు

పసుపు చెక్కపెట్టెలలో, ప్యాక్ చేయబడిన సంచులను పేర్చి, నేలపై నుంచి తేమ చొరబడకుండా నిల్వ చేయాలి. గోడల నుంచి 50-60 సెం.మీ. దూరంలో ఈ సంచులను పేర్చి ఉండాలి. పసుపు కొమ్ములమీద ఎట్టి పరిస్థితుల్లోనూ క్రిమిసంహారక మందులను ఉపయోగించకూడదు. క్రిమికీటకాదులు, ఎలుకల వంటివి, మరే ఇతర జంతువులను ఈ పసుపును నిల్వ చేసిన ఈ పరిసరాల్లోకి రానివ్వకుండా సమర్థవంతంగా నిరోధించాలి. ఒకవేళ పసుపు చాలాకాలం నిల్వ చేయాల్సి వస్తే నిల్వచేసిన పసుపు కొమ్ములు అప్పుడప్పుడు ఎండలో పెట్టడం శ్రేయస్కరం.

– గుండెల రాజు, మహబూబాబాద్ అగ్రికల్చర్,
7288985757

10. నమస్తే తెలంగాణ చిత్రం
[హైదరాబాద్]
గురువారం 25 జనవరి 2018



జానపద చిత్రాల కథానాయికగా, అభినయ రాజకుమారిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి కృష్ణకుమారి. అసమాన నటనతో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన ఆమె తెలుగు చిత్రసీమలో విలక్షణ నటిగా తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. కాంతారావు, ఎన్టీఆర్, ఏఎన్నార్ మొదలుకొని అలనాటి అగ్రకథానాయకులందరితో కలిసి మరపురాని చిత్రాల్లో నటించిన కృష్ణకుమారి(85) బుధవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని తన స్వగృహంలో ఉదయం తుదిశ్వాస విడిచారు. తెలుగు, తమిళ , కన్నడ భాషల్లో కృష్ణకుమారి దాదాపు 150కిపైగా సినిమాల్లో నటించారు .



దివికేగిన అభినయ కృష్ణకుమారి

కృష్ణకుమారి 1936 మార్చి 6న కలకత్తాలో జన్మించారు. ఆమె తండ్రి టేకుమళ్ల వెంకోజీరావు ఆంధ్రా పేపర్ మిల్లులో ఉద్యోగం చేస్తుండేవారు. తండ్రిది బదిలీలతో కూడిన ఉద్యోగం కావడంతో కృష్ణకుమారి బాల్యం వివిధ ప్రాంతాల్లో గడిచింది. ఆ తర్వాత వీరి కుటుంబం రాజమండ్రిలో స్థిరపడింది. ప్రముఖ నటి షావుకారు జానకి, కృష్ణకుమారి అక్కాచెల్లెళ్లు. చిన్నతనం నుంచి కళల పట్ల ఆసక్తిని కనబరిచే కృష్ణకుమారి భరతనాట్యం, కూచిపూడిలో ప్రావీణ్యాన్ని సంపాదించడమే కాకుండా అనేక నృత్యప్రదర్శనలిచ్చారు.

1951 సంవత్సరంలో 'నవ్వితే నవరత్నాలు' సినిమాతో కృష్ణకుమారి సినీ జీవితం మొదలైంది. ఆమె అంగీకరించిన తొలి చిత్రమిదే అయినా 'మంత్రదండం' ముందుగా విడుదలైంది. 'నవ్వితే నవరత్నాలు' సినిమాలో కృష్ణకుమారికి కాకతాళీయంగా అవకాశం వచ్చింది. 'స్వప్నసుందరి' సినిమా చూడటానికి పాండిబజార్‌లోని ఓ థియేటర్‌కు వెళ్లింది కృష్ణకుమారి. అదే సినిమా చూడటానికి వచ్చిన నిర్మాత సౌందరరాజన్ కూతురు.. కృష్ణకుమారిలోని అందం, అమాయకత్వాన్ని గమనించి తమ సంస్థ ద్వారా నిర్మిస్తున్న 'నవ్వితే నవరత్నాలు' చిత్రంలో నటించే అవకాశాన్ని ఇచ్చారు. ఈ సినిమా ఆమెకు ఎనలేని గుర్తింపుతో పాటు చాలా అవకాశాల్ని తెచ్చిపెట్టింది. ఒకేసారి పద్నాలుగు సినిమాల్ని అంగీకరించారామె. 'నవ్వితే నవరత్నాలు' సినిమాతో రామశర్మ, కృష్ణకుమారి విజయవంతమైన జోడీగా పేరుతెచ్చుకున్నారు

• 'ఇలవేల్పు'తో పునర్జన్మ

తొలి సినిమాలో చక్కటి అభినయంతో రాణించిన కృష్ణకుమారి ఆ తర్వాత ప్రియురాలు, మరదలు పెళ్లి, చిన్నమ్మకథతో పాటు సినిమాల్లో నటించారు. ఆమె పాత్రలకు మంచి గుర్తింపు లభించినా ఈ సినిమాలన్ని కమర్షియల్‌గా వైఫల్యాలుగా నిలవడంతో కృష్ణకుమారితో సినిమా అంటేనే నిర్మాతలు భయపడేవారు. ఎంతో నమ్మకం పెట్టుకున్న 'బంగారుపాప' చిత్రం ఆమెకు చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఈ సినిమా పరాజయంతో కృష్ణకుమారి కెరీర్ ముగిసిపోయినట్లేనని అంతా భావించారు. ఎల్.వి. ప్రసాద్ నిర్మించిన 'ఇలవేల్పు'తో కృష్ణకుమారి సినీ జీవితం కొత్త మలుపు తిరిగింది. నటిగా ఆమెకు ఈ సినిమా పునర్జన్మనిచ్చింది. ఇందులో రేలంగి సరసన హాస్యభరిత పాత్రలో నటించింది కృష్ణకుమారి. ఈ పాత్ర ఆమెకు మంచి పేరును తీసుకొచ్చింది. ఈ సినిమాలో రేలంగి, కృష్ణకుమారి కాంబినేషన్‌లో చిత్రీకరించిన 'చల్లని పున్నమి వెన్నలలోన' గీతం అశేషప్రజాదరణను చూరగొన్నది.

• 150కిపైగా సినిమాల్లో...



'ఇలవేల్పు' తర్వాత తెలుగు చిత్రసీమలో అగ్రకథానాయికల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు కృష్ణకుమారి. వద్దంటే పెళ్లి, గంగా గౌరీ సంవాదం, సతీ సుకన్య, రమా సుందరి, జయవిజయ, పెళ్లి కానుక, దేవాంతకుడు, వినాయకచవితి, ఇరుగుపొరుగు, అగ్గిపిడుగు, మర్మయోగి, ఉమ్మడి కుటుంబం, లక్షాధికారి, బందిపోటు, బంగారుభూమి, గుణవంతుడు, జేబుదొంగ, యశోదకృష్ణ, దేవదాసు, నేరముశిక్ష, మానవుడు దానవుడు, భార్యబిడ్డలు, తల్లాపెళ్లామా, శ్రీకృష్ణావతారం, అంతస్తులు, గుడిగంటలు, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మాయిలు ఎదురీత, కులగోత్రాలు, భార్యాభర్తలు, శభాష్‌రాజా, దీపావళితో పాటు పలు సినిమాలు ఆమె నటనాప్రతిభకు తార్కాణాలుగా నిలిచాయి. తెలుగులోనే కాకుండా తమిళ, కన్నడ ప్రేక్షకులకు కృష్ణకుమారి సుపరిచితమే. మూడు భాషల్లో కలిపి దాదాపు 150కిపైగా సినిమాలు చేశారమే. చివరగా దాసరి నారాయణరావు దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫూల్స్' సినిమాలో అతిథి పాత్రలో నటించారు కృష్ణకుమారి. ఇదే ఆమె నటించిన చివరి సినిమా. సుదీర్ఘ సినీ ప్రయాణంలో తన అసమాన అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించిన కృష్ణకుమారి మూడు జాతీయ అవార్డులను, రెండు నంది పురస్కారాలను దక్కించుకున్నారు.

• కాంతారావుతో 28 సినిమాలు..

తెలుగు చిత్రసీమలో జానపద చిత్రాలంటే కాంతారావు, కృష్ణకుమారి జోడీనే గుర్తొస్తుంది. కాంతారావుతో కలిసి దాదాపు 28 జానపద చిత్రాల్లో నటించారు కృష్ణకుమారి. ఈ సినిమాలన్ని ప్రేక్షకాదరణను సొంతం చేసుకోవడంతో జానపద చిత్రాల కథానాయికగా కృష్ణకుమారి పేరు మారుమ్రోగిపోయింది. ఎన్టీఆర్‌తో 25 సినిమాలు, అక్కినేని నాగేశ్వరరావుతో 18 సినిమాల్లో జంటగా నటించారు కృష్ణకుమారి. వారితో పాటు రామశర్మ, కృష్ణంరాజు, జగ్గయ్య, రేలంగి, రమణామూర్తి తెలుగు సినీ పరిశ్రమలోని కథానాయకులందరితో సినిమాలు చేశారు.

• పెళ్లితో సినిమాలకు స్వస్తి..

అగ్రకథానాయికగా కొనసాగుతున్న తరుణంలో పెళ్లి చేసుకొని సినిమాలకు స్వస్తిపలికారు కృష్ణకుమారి. అజయ్ మోహన్ అనే మార్వాడీని ప్రేమించి పెళ్లాడారు. 1969లో వీరి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత బెంగళూరులో స్థిరపడ్డారు కృష్ణకుమారి. ఈ దంపతులకు దీపిక అనే ఓ దత్తపుత్రిక వుంది.




ఆమెను సహజనటి అనలేదు, మహానటి అనలేదు. కానీ ఆమెను మన నటి అనుకున్నారు. మంచి నటి అని మెచ్చుకున్నారు. ఎన్నో అపురూప చిత్రాల్లో మరపురాని పాత్రల్లో నటించి కన్నుమూసిన కృష్ణకుమారి గారు స్వర్గలోక ప్రాప్తిపొందాలి.

– పరుచూరి గోపాలకృష్ణ

ఎన్.ఏ.టి సంస్థలో నాన్నగారు తొలిసారి స్వయంగా నిర్మించిన 'పిచ్చి పుల్లయ్య'లో కృష్ణకుమారి కథానాయికగా నటించారు. దేవాంతకుడు, బందిపోటు, వరకట్నం, ఉమ్మడికుటుంబంతో సహా 25 సినిమాల్లో నాన్నగారితో కలిసి కృష్ణకుమారి నటించారు. అటువంటి మేటి నటి నేడు మన మధ్య లేకపోవడం బాధాకరం.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరుకుంటున్నాను.

– బాలకృష్ణ



రంగస్థలం'లో రామచరణ్

చిట్టిబాబు సౌండ్ ఇంజినీర్

చిట్టిబాబుది రంగస్థలం. అందరికి శబ్దం వినిపిస్తే అతడికి మాత్రం కనబడుతుంది. ఊరిలో అందరూ అతడిని సౌండ్ ఇంజనీర్ అని పిలుస్తుంటారు. చెవులు వినబడకపోయినా పెదవుల కదలికలను బట్టి ఎవరూ ఏం చెబుతున్నారో ఇట్టే గ్రహిస్తాడు. తప్పుగా మాట్లాడితే తాట తీస్తాడు. రంగస్థలం ఊరి ప్రజల ఆపద్బాంధవుడైన ఈ చిట్టిబాబు కథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అంటున్నారు సుకుమార్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రంగస్థలం'. రామచరణ్, సమంత జంటగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్(సి.వి.ఎమ్) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టీజర్‌ను విడుదలచేసింది. ఇందులో పల్లెటూరి యువకుడిగా రామ్‌చరణ్ కొత్త పంథాలో కనిపిస్తున్నారు. గోదావరి యాసలో ఆయన పలికిన సంభాషణలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. గ్రామీణ ప్రజల మనస్తత్వాలు, ఆహార్యాలు, పూరిళ్లు, తీర ప్రాంతాల అందాలకు పెద్దపీట వేస్తూ సాగే ఈ టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది.1985 కాలం నాటి పరిస్థితులను సహజత్వ కోణంలో ఆవిష్కరించారు. నవ్యమైన కథ, కథనాలతో దర్శకుడు సుకుమార్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సుకుమార్, రామ్‌చరణ్ కలయికలో తొలిసారిగా వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదలచేయబోతున్నారు. జగపతిబాబు, ఆదిపినిశెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.



సమంత

యూటర్న్ రీమేక్‌లో...

నాగచైతన్యతో పెళ్లి తర్వాత కథల ఎంపికలో తన ప్రాధామ్యాల్ని మార్చుకుంటున్నది సమంత. నటనకు ఆస్కారమున్న పాత్రలపై దృష్టిసారిస్తున్నది. తాజాగా ఆమె ఓ కన్నడ రీమేక్‌లో నటించనున్నది. రెండేళ్ల క్రితం కన్నడ భాషలో విడుదలైన 'యూటర్న్' చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో రీమేక్ చేయడానికి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రీమేక్‌లో కథానాయికగా నటించనున్నట్లు సమంత బుధవారం ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. ఫిబ్రవరిలో ఈ సినిమా చిత్రీకరణ మొదలుకానున్నట్లు పేర్కొన్నది. సిల్వర్‌స్క్రీన్ పతాకంపై శ్రీనివాస ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మాతృకకు దర్శకత్వం వహించిన పవన్‌కుమార్ తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. సూపర్‌నాచురల్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నది. ప్రస్తుతం సమంత తెలుగులో 'రంగస్థలం', 'మహానటి' తమిళంలో 'ఇరుంబుతిరై' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.

Dwaraka


ఒడిశాలో స్తంభించిన జనజీవనం

లైంగికదాడికి గురైన గిరిజన బాలిక ఆత్మహత్యపై వెల్లువెత్తిన నిరసన



భువనేశ్వర్, జనవరి 24: ఒడిశాలో 14 ఏండ్ల గిరిజన బాలిక సామూహిక అత్యాచారానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై రాష్ట్రంలో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. ఆ బాలికపై భద్రతా దళాలకు చెందిన నలుగురు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పలు పార్టీలు బుధవారం బంద్ చేపట్టాయి. ఆందోళనకారులు ఎక్కడికక్కడ రైళ్లను నిలిపివేశారు. దుకాణాలు, వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. పోలీసులు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకి చెందిన దాదాపు 200 మంది కార్యకర్తలు రాష్ట్ర సచివాలయంలోనికి చొరబడటానికి ప్రయత్నించారని చెప్పారు. కొన్ని చోట్ల ఆందోళనకారులు రోడ్లను దిగ్బంధించారని తెలిపారు. ఆందోళనకారులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు దిగారని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ తగు చర్యలు చేపట్టామని వివరించారు. ఒడిశా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్ హరిచందన్ మాట్లాడుతూ బాలిక మృతికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం నవీన్ పట్నాయక్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

9 వేల ఏండ్ల కిందటి యువతి ముఖం పునర్నిర్మాణం



ఏథెన్స్: తొమ్మిది వేల ఏండ్ల కిందట జీవించిన ఒక యువతి ముఖాన్ని శాస్త్రవేత్తలు పునర్నిర్మించారు. క్రీస్తుపూర్వం 7 వేల ఏండ్ల కిందట మధ్య శిలాయుగంలో ప్రజలు ఎలా ఉండేవారో తెలుసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కాగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దిన డాన్ ముఖంలో ఎముకలు, పండ్లను బట్టి ఆమె వయస్సు 15 నుంచి 18 ఏండ్ల మధ్య ఉంటుందని లెక్కగట్టారు. ఆమె దవడ ఎముక ముందుకు పొడుచుకుని వచ్చి ఉండడాన్ని బట్టి.. ఆ కాలంలో ప్రజలు జంతువుల చర్మాలను నమిలే వారని అంచనా వేస్తున్నారు. అప్పటికాలంలో ఉండే ప్రజల్లో ఇది సర్వసాధారణ విషయమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తుంటి, కీళ్లకు సంబంధించిన సమస్యలు ఉండటం వల్లే గుహలో నుంచి కదలడానికి వీలుపడకపోయి ఉండవచ్చని.. ఆమె చనిపోవడానికి ఇదే కారణం కావొచ్చని అన్నారు. డాన్‌కు సంబంధించిన అవశేషాలను 1993లో గ్రీస్‌లోని ఓ గుహలో కనుగొన్నారు.

రాజీవ్ హత్యతో నాకు సంబంధం లేదు

సుప్రీంకోర్టులో పెరారివళన్ పిటిషన్



న్యూఢిల్లీ, జనవరి 24: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులోని ప్రధాన దోషుల్లో ఒకడైన పెరారివళన్ ఇప్పుడు తాను అమాయకుడినని అంటున్నాడు. ఈ కేసులో తనను దోషిగా ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని సుప్రీంకోర్టును కోరాడు. ఈ మేరకు పెరారివళన్ తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు ధర్మాసనం అతని వాదనపై మూడువారాల్లోగా స్పందించాలని సీబీఐని బుధవారం ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను వచ్చే నెల 21కి వాయిదా వేసింది. తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో 1991, మే 21న తేదీన రాజీవ్ హత్య జరిగింది. ఈ కేసులో హత్యకు కుట్ర తదితర అభియోగాలపై పెరారివళన్‌తో పాటు నళిని, సంతానం తదితరులకు శిక్షలు పడ్డాయి.

అంతర్జాతీయ ఉగ్రవాది.. సిద్ధార్థ్ ధార్

భారతసంతతి వ్యక్తిని టెర్రరిస్టుల జాబితాలో చేర్చిన అమెరికా



వాషింగ్టన్, జనవరి 24: భారత మూలాలున్న ఐసిస్ ఉగ్రవాది సిద్ధార్థ్ ధార్‌ను అంతర్జాతీయ టెర్రరిస్టుగా అమెరికా ప్రకటించింది. బ్రిటన్‌కు చెందిన సిద్ధార్థ్ హిందూ మతం నుంచి ఇస్లాంకు మారాడు. తన పేరును అబూ రుమైసాగా మార్చుకున్నాడు. అల్‌ముహాజిరో సంస్థతో సంబంధాలు కలిగిన ఆయనను బ్రిటన్ పోలీసులు పలు ఆరోపణలతో అరెస్టు చేశారు. 2014లో బెయిల్‌పై విడుదలైన సిద్ధార్థ్ బ్రిటన్ నుంచి తప్పించుకుని భార్య పిల్లలతో కలిసి సిరియాకు వెళ్లాడు. అక్కడే ఐసిస్‌లో చేరాడు. జిహాదీ జాన్‌గా పిలిచే మహమ్మద్ ఎమ్వాజి స్థానంలో ఐసిస్ సీనియర్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. నిహాద్ బర్కత్ అనే యాజిదీ బాలిక తనను సిద్ధార్థ్ ధార్ అపహరించినట్లు తెలిపిందని 'ఇండిపెండెంట్' పత్రిక గతంలో వెల్లడించింది. బ్రిటన్ కోసం గూఢచర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ పలువురు బందీలను హత్య చేసిన వీడియోను 2016 జనవరిలో ఐసిస్ రిలీజ్ చేసింది. ఆ వీడియోలో ముసుగుతో కనిపించిన ఉగ్రవాది సిద్ధార్థ్‌గా భావిస్తున్నట్లు అమెరికా అప్పట్లోనే ప్రకటించింది. తాజాగా సిద్ధార్థ్‌తోపాటు బెల్జియన్-మొరాకన్ పౌరుడైన అబ్దెలతీఫ్ గైనిలను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటిస్తూ అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ నలుగురు పోలీసులు మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు పోలీసులు మృతిచెందారు. అందులో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. బుధవారం అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో నక్సల్స్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరి రాకను గుర్తించిన మావోయిస్టులు కాల్పులకు దిగడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు గాయపడ్డారు.

ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై స్టే ఇవ్వలేం:హైకోర్టు

న్యూఢిల్లీ: లాభదాయక పదవులు చేపట్టిన 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా పేర్కొంటూ కేంద్రం జారీ చేసిన ప్రకటనపై స్టే ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు బుధవారం నిరాకరించింది. దీంతోపాటు ఈ నెల 29 వరకు ఉప ఎన్నికల తేదీలు ప్రకటించడం వంటి చర్యలు చేపట్టరాదని ఎన్నికల సంఘానికి సూచించింది. ఈ మేరకు దీనిపై తమ స్పందనలు తెలియజేయాలని ఎన్నికల సంఘంతోపాటు కేంద్రానికి నోటీసులు జారీచేసింది. 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని రాష్ట్రపతికి సిఫారసు చేయడానికి సంబంధించిన మొత్తం రికార్డులను సమర్పించాలని ఈసీని ఆదేశించింది. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉన్నందున ఈ నెల 29 నుంచి రోజువారీగా విచారణ జరుపనున్నట్టు పేర్కొన్నది.

పాక్‌లో అమెరికా డ్రోన్ దాడి

ఉగ్రవాద సంస్థ హక్కానీ కమాండర్‌తోపాటు మరో ఇద్దరు హతం

పేషావర్: పాకిస్థాన్- ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులోని కుర్రమ్ ఏజెన్సీ ప్రాంతంలో బుధవారం అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో ఉగ్రవాద సంస్థ 'హక్కానీ నెట్‌వర్క్'కు చెందిన కమాండర్ ఈసన్ అలియాస్ ఖావరి, అతని ఇద్దరు సహచరులు హతమయ్యారని మీడియా తెలిపింది. పాక్‌లోని స్పీన్ థాల్ ప్రాంతంలోని ఓ ఇంట్లో హక్కానీ నెట్‌వర్క్ శిబిరం ఏర్పాటుచేసినట్టు గుర్తించి, దానిపైకి డ్రోన్‌ను ఉపయోగించి రెండు క్షిపణులతో దాడిచేశారు. అమెరికా గూఢచార విమానాలు ఈ డ్రోన్ దాడులు చేశాయి.

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్, జనవరి 24: జమ్ముకశ్మీర్‌లో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ సంఘటన బుధవారం షాపియాన్ జిల్లాలోని చాయ్‌గుండ్ ప్రాంతంలో జరిగింది. ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా వారి రాకను గుర్తించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అనంతరం ఎన్‌కౌంటర్ ప్రాంతం సమీపంలో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేయగా వారిని చెదరగొట్టడానికి భద్రతా బలగాలు పెల్లెట్ బుల్లెట్‌లను ప్రయోగించాయి. దీంతో 17 ఏండ్ల బాలుడు మృతిచెందాడు.

రాష్ట్రపతి ప్రసంగానికి క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: ఈ నెల 29నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలనుద్దేశించి మొదటి రోజు రాష్ట్రపతి చేయనున్న ప్రసంగానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దావోస్ నుంచి ప్రధాని మోదీ తిరిగి వచ్చిన అనంతరం ఆయన అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమైంది.

మార్చి 17 వరకు హఫీజ్‌ను అరెస్ట్ చేయవద్దు

లాహోర్ కోర్టు ఆదేశం

లాహోర్: ముంబై ఉగ్రదాడి సూత్రధారి హఫీజ్ సయీద్‌ను మార్చి 17 వరకు అరెస్టు చేయవద్దని పాకిస్థాన్‌లోని లాహోర్ కోర్టు ఆదేశించింది. ఉగ్రవాద చర్యల నిర్మూలనకు పాక్ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నదో తెలుసుకోవడానికి ఆదేశంలో గురువారం నుంచి ఐక్యరాజ్యసమితి బృందం పర్యటించనుంది. ఈ నేపథ్యంలో లాహోర్ కోర్టు ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఇంజినీరింగ్, సాంకేతిక విద్యా కోర్సుల్లో పాఠ్యాంశాల మార్పు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, సాంకేతిక విద్యా కోర్సుల్లో పాఠ్యాంశాలను మార్చినట్టు సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) బుధవారం తెలిపింది. థియరీకి కావల్సిన క్రెడిట్ల సంఖ్యను 220 నుంచి 160కి తగ్గించినట్టు పేర్కొంది. 160 క్రెడిట్లలో పద్నాలుగింటిని వేసవి శిక్షణలో తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేసింది. నూతన పాఠ్యాంశం ప్రకారం విద్యార్థులు ఎక్కువ సమయం థియరీకి బదులుగా పరిశోధన శాలల్లో గడుపాల్సి ఉంటుందని తెలిపింది.

పర్యావరణ నిర్వహణలో మనం 177/180!

న్యూఢిల్లీ, జనవరి 24: పర్యావరణ నిర్వహణ సూచిలో భారత్ అట్టడుగు స్థాయికి దిగజారింది. పర్యావరణ నిర్వహణలో 180 దేశాల పనితీరుపై యేల్, కొలంబియా విశ్వవిద్యాలయాలు రూపొందించిన ద్వైవార్షిక నివేదికను దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో విడుదల చేశారు. 2016లో భారత్ 141వ స్థానంలో ఉండగా 2017 నాటికి 177వ స్థానానికి పడిపోయింది. పర్యావరణ ఆరోగ్య విధానం, వాయు కాలుష్యం వల్ల సంభవించిన మరణాల ఆధారంగా ఆయా దేశాలకు ర్యాంకులు కేటాయించారు. ఈ జాబితాలో స్విట్జర్లాండ్ మొదటిస్థానంలో ఉండగా, భారత్‌తోపాటు బంగ్లాదేశ్, బురుండీ, కాంగో, నేపాల్ చివరి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

లాలూకు మరో ఐదేండ్ల జైలు

మొదటిపేజీ తరువాయి...

రూ.7.10 లక్షలు మాత్రమే కేటాయించినా నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్లు సృష్టించి రూ.కోట్లు దోచేశారని గుర్తించింది. ఈ మేరకు లాలూను మొదటి నిందితుడిగా, జగన్నాథ్ మిశ్రాతోసహా మొత్తం 76 మందిని సహనిందితులుగా చేర్చింది. వారిలో 14 మంది ఇప్పటికే మృతిచెందగా, ముగ్గురు అప్రూవర్లుగా మారారు. మరో ఇద్దరికి ఇప్పటికే శిక్షలు ఖరారయ్యాయి. ఒకరు పరారీలో ఉన్నారు. మిగతా 56 మంది నిందితుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు దాణా సరఫరాదారులను న్యాయస్థానం నిర్దోషులుగా గుర్తించింది. మిగతా 50 మందిని దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై తాము హైకోర్టుకు వెళ్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆర్‌జేడీ పార్టీ ప్రకటించింది. బీహార్ సీఎం నితీశ్‌కుమార్, బీజేపీ నేతలతో కలిసి తన తండ్రిని వేధిస్తున్నారని లాలూ కుమారుడు, బీహార్ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు తేజస్వీయాదవ్ ఆరోపించారు. లాలూ ప్రసాద్ యాదవ్ ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. దాణా కుంభకోణంలోని రెండో కేసులో దోషిగా తేలడంతో ఈ నెల 6వ తేదీన న్యాయస్థానం మూడున్నరేండ్ల జైలుశిక్ష విధించింది. ఈ కుంభకోణానికి సంబంధించి మరో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

పద్మావత్‌పై ఆరని జ్వాల

నిరసనలతో అట్టుడికిన ఐదు రాష్ట్రాలు

గుజరాత్‌లో థియేటర్లను తగులబెట్టిన కర్ణిసేన కార్యకర్తలు

40వాహనాలకు నిప్పు.. 200కుపైగా వాహనాలు ధ్వంసం

పోలీసులపైకి రాళ్లు రువ్విన ఆందోళనకారులు

బాష్పవాయుగోళాలను ప్రయోగించిన పోలీసులు.. గాల్లోకి కాల్పులు

జనతాకర్ఫ్యూకు పిలుపునిచ్చిన కర్ణిసేన.. నేడే పద్మావత్ సినిమా విడుదల



అహ్మదాబాద్‌లో ఆందోళనకారులు దహనం చేసిన వాహనాలు



అహ్మదాబాద్‌లో తగులబడుతున్న మల్టీప్లెక్స్

న్యూఢిల్లీ, జనవరి 24:

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన పద్మావత్ చిత్రం విడుదలపై కొనసాగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఆందోళనకు దిగిన రాజ్‌పుత్ కర్ణిసేన కార్యకర్తలు రహదారులపై విధ్వంసం సృష్టించారు. 40వాహనాలకు నిప్పుపెట్టారు. 200కు పైగా వాహనాలను ధ్వంసం చేశారు. సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పద్మావత్ సినిమా నేడు (గురువారం) దేశవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు హెచ్చరికలకే పరిమితమైన రాజ్‌పుత్ సంఘాలు బుధవారం రెచ్చిపోయాయి.

పద్మావత్ సినిమా విడుదలను వ్యతిరేకిస్తూ గుజరాత్‌లో హింస చెలరేగింది. సినిమావిడుదలను అడ్డుకుంటామని హెచ్చరించిన కర్ణిసేన అహ్మదాబాద్‌లో థియేటర్లపై దాడులకు పాల్పడింది. సినిమా విడుదల అవుతున్న పలు థియేటర్లు, మాల్‌లపై ఆందోళనకారులు దాడిచేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఓ మాల్‌పైకి పెట్రోల్‌బాంబులను విసిరినట్లు పోలీసులు గుర్తించారు. 30కిపైగా వాహనాలను తగులబెట్టారు. కర్ణిసేన దాడిలో 200కి పైగా వాహనాలు ధ్వంసమయ్యాయని తెలుస్తున్నది. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారుల్ని చెదురగొట్టారు. గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో బాష్పవాయుగోళాలను ప్రయోగించినట్లు అహ్మదాబాద్ సంయుక్త పోలీస్ కమిషనర్ జేకే భట్ తెలిపారు. ఇప్పటివరకు 48మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మాస్కులు ధరించి థియేటర్లపై దాడి చేస్తున్న యువకుల వీడియోలను పోలీసులు విడుదల చేశారు. అదనపు బలగాలను రంగంలోకి దించి సినిమాను ప్రదర్శించే థియేటర్ల వద్ద భద్రతను పెంచారు. ఆందోళనలపై స్పందించిన గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ శాంతియుతంగా వ్యవహరించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'రాజ్‌పుత్‌ల మనోభావాలు దెబ్బతినవద్దన్న ఉద్దేశంతోనే పద్మావత్ సినిమాపై రాష్ట్రప్రభుత్వం నిషేధం విధించింది. కానీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సినిమానువిడుదల చేస్తున్నారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా సినిమాను బహిష్కరించాలి' అని గుజరాత్ డిప్యూటీ సీఎం నితిన్ పటేల్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంత తీవ్ర పరిణామాలు ఎదురైనప్పటికీ థియేటర్ల వద్ద ప్రజాకర్ఫ్యూను విధించితీరుతామని కర్ణిసేన చీఫ్ లోకేంద్రసింగ్ కల్వి ప్రకటించారు.

గంటల వ్యవధిలోనే హింస వ్యాప్తి

గుజరాత్‌లో చెలరేగిన హింస గంటల్లోనే ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకు వ్యాపించింది. రాజస్థాన్‌లోనూ నిరసనలు తీవ్రమయ్యాయి. పలుచోట్ల రహదారుల్ని దిగ్బంధించారు. జైపూర్‌లో రెండు బస్సులను, శిఖర్‌లో ఓ బస్సును ధ్వంసం చేశారు. ఢిల్లీ-అజ్మీర్, ఢిల్లీ-జైపూర్ రహదారులపై ఆందోళనకారులు టైర్లు వేసి నిప్పటించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సిబ్బందిని రాజస్థాన్ ప్రభుత్వం అప్రమత్తం చేసింది. మీరట్‌లోని పీవీఎస్ మాల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. హర్యానాలోని గుర్గావ్‌లోనూ అల్లర్లు చెలరేగాయి. సోహ్నా గ్రామంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఓ బస్సును నిరసనకారులు తగులబెట్టారు. ముందజాగ్రత్త చర్యల్లో భాగంగా పలు పట్టణాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు హర్యానా ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ముంబైలో వివిధ ప్రాంతాల్లో నిరసనలకు దిగిన 35మంది కర్ణిసేన సభ్యుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాసిక్ సమీపంలోని గంగాపూర్ డ్యామ్‌లో జలసమాధికి యత్నిస్తామని ప్రకటించిన 20మంది రాజ్‌పుత్ సంస్థ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ మల్టిపెక్స్ వద్ద రాజ్‌పుత్ యువకులు ఆందోళనకు దిగారు. ముజఫర్‌నగర్, కాన్పూర్‌లలో థియేటర్లలోకి దూసుకెళ్లిన ఆందోళనకారులు అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. మధ్యప్రదేశ్‌లో ఇండోర్‌లో ఆగ్రా-ముంబై నగరాలను కలిపే ఎన్‌హెచ్-3 రహదారిని 200మంది ఆందోళనకారులు దిగ్బంధించారు. వందలాది గాజుసీసాలను రోడ్లపై పగులగొట్టారు. ఇండోర్-దీపల్‌పూర్ రోడ్డుపై పద్మావత్ చిత్ర దర్శకుడు భన్సాలీ దిష్టిబొమ్మను దహనం చేశారు. జమ్ములోని ఇంద్ర థియేటర్ వద్ద టిక్కెట్ కౌంటర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసంచేశారు.

సినిమాను ప్రదర్శించం: మల్టిపెక్స్ యజమానులు

పద్మావత్ వివాదం సద్దుమణిగేవరకు సినిమాను ఏ ఒక్క థియేటర్‌లోనూ ప్రదర్శించబోవడం లేదని గుజరాత్ రాష్ట్ర మల్టిప్లెక్స్ యజమానుల సంఘం బుధవారం ప్రకటించింది.

మూతపడిన చిత్తోడ్‌గఢ్ కోట.. చరిత్రలో రెండోసారి

పద్మావత్ విడుదలను నిరసిస్తూ రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్ కోట మూతపడింది. స్వాతంత్ర్యం వచ్చాక కోట ద్వారాలను మూసివేయడం ఇది రెండోసారి. గత నవంబర్‌లో సంజయ్ లీలా భన్సాలీపై దాడి చేసిన సందర్భంలో తొలిసారిగా మూసివేశారు. తాజా ఆందోళనల నేపథ్యంలో రాజ్‌పుత్‌లు కోటను బుధవారం మూసివేశారు.

పాఠశాల బస్సుపై రాళ్లురువ్విన ఆందోళనకారులు

పద్మావత్ సినిమాను విడుదల చేయవద్దంటూ నిరసనకారులు ఓ స్కూల్ బస్సు పై రాళ్లు రువ్వారు. దీంతో విద్యార్థులు తీ వ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సం ఘటన బుధవారం ఢిల్లీకి సమీపంలోని గుర్గావ్‌లో జరిగింది. జీడీ గోయంక వరల్డ్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతోపాటు సిబ్బందితో రోడ్డుపై వెళ్తున్నది. అందులో 2వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నారు. అయితే పద్మావత్ సినిమాను వ్యతిరేకిస్తున్న ఆందోళనకారులు ఒక్కసారిగా ఈ బస్సుపై రాళ్లు రువ్వారు. దీంతో విద్యార్థులు సీట్ల కింద తలదాచుకున్నారు. ఈ దాడిలో బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి.

గణతంత్ర వేడుకలకు అసాధారణ భద్రత

అతిథులకు ఉగ్రవాద ముప్పు ❑ నిఘా వర్గాల హెచ్చరిక ❑ ఢిల్లీలో హైఅలర్ట్



ఢిల్లీలో బుధవారం గణతంత్ర దినోత్సవం కవాతు రిహార్సల్స్

న్యూఢిల్లీ, జనవరి 24: దేశ 69వ గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరవుతున్న 10 ఆసియాన్ దేశాల అధినేతలకు ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని నిఘావర్గాలు ఉన్నత స్థాయి హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో దేశరాజధాని నగరం ఢిల్లీతోపాటు పరిసర ప్రాంతాల్లో కూడా అసాధారణ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. గణతంత్ర వేడుకలకు పది మంది విదేశీ నేతలు ఒకేసారి హాజరు కావడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఆసియాన్ సదస్సుతో పాటు గణతంత్ర వేడుకల్లోనూ వారు పాల్గొంటున్నారు. దీంతో భద్రతాసంస్థలపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. కశ్మీర్‌లోని నియంత్రణరేఖ వెంబడి అనుమానాస్పద కదలికలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఉగ్రవాద ముప్పుపై అనుమానాలు మరింత బలపడుతున్నాయని నిఘా వర్గాలు హెచ్చరించినట్టు సమాచారం. దీంతో ఢిల్లీలోని కీలక ప్రాంతాలలో గస్తీని ముమ్మరం చేశారు. గతంలో ఉగ్రవాద కార్యకలాపాలు చోటుచేసుకున్న ప్రాంతాలపై నిఘాను మరింత పటిష్ఠం చేశారు. ఉగ్రవాదులు దాడులు జరిపేందుకు సంప్రదాయేతర పద్ధతులను కూడా అవలంబించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది. ఉగ్రవాదులు మెటల్ డిటెక్టర్లకు దొరకకుండా పేలుడు పదార్థాలను రూపొందించి ఉంటారని, అందువల్ల రాష్ట్రాలు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. అసోంలో వేర్పాటువాద, తీవ్రవాద సంస్థలు గణతంత్ర వేడుకలను బహిష్కరించిన నేపథ్యంలో అక్కడ కూడా భద్రతా దళాలు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశాయి.

శౌర్య పతకాల్లో సింహభాగం కశ్మీర్ వీరులకే

పోలీసు పతకాల కోసం ఈసారి 795 మంది ఎంపిక

న్యూఢిల్లీ, జనవరి 24: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక చర్యల్లో పాల్గొన్న ఆ రాష్ట్ర పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఈ ఏడాది అత్యధికంగా పోలీసు శౌర్య పతకాలను గెలుచుకున్నారు. మొత్తం 107 శౌర్య పతకాలకు గాను 65 వీరికే దక్కాయి. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని కేంద్రం ఆ జాబితాను బుధవారం విడుదల చేసింది. ఎంపికైన 35మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందిలో 27 మంది జమ్ముకశ్మీర్‌లో ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు, మిగిలినవారు జార్ఖండ్‌లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు ఈ పతకానికి ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పది మంది, మహారాష్ట్రకు చెందిన ఏడుగురు, తెలంగాణ నుంచి ఆరుగురు, ఢిల్లీ నుంచి ముగ్గురు శౌర్యపతకాలకు ఎంపికయ్యారు. రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకానికి ఎవరూ ఎంపిక కాలేదు. మొత్తం 795 మంది పోలీసు సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేసినట్టు కేంద్ర హోంశాఖ తెలిపింది. వీరిలో రాష్ట్రపతి ప్రత్యేక సేవా పతకానికి 75 మందిని, విశిష్ఠ సేవా పతకం కోసం 613 మందిని ఎంపిక చేసింది.

పిల్లలను కాపాడి ప్రాణాలర్పించిన క్రీడా శిక్షకుడికి అత్యున్నత పురస్కారం



మార్టిన్

కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న భవనం నుంచి పిల్లలను రక్షించి తన ప్రాణాలు కోల్పోయిన బబ్లూ మార్టిన్.. పౌరులకు ఇచ్చే అత్యున్నత శౌర్య పతకం 'సర్వోత్తమ్ జీవన్‌రక్షా పదక్'కు ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్‌కు చెందిన మార్టిన్ ఫుట్‌బాల్ శిక్షకుడు. 2016లో వర్షాల కారణంగా కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఓ భవంతిలో చిక్కుకుపోయిన ఇద్దరు పిల్లల్ని రక్షించారు. ఈ క్రమంలో భవనం కూలిపోయి మార్టిన్ ప్రాణాలు కోల్పోయారు. రెండో అత్యున్నత పురస్కారానికి అమర్‌నాథ్ యాత్రికులను ఉగ్రదాడి నుంచి కాపాడిన గుజరాత్‌కు చెందిన బస్సుడ్రైవర్ సలీం గఫూర్ ఎంపికయ్యారు. పౌరులకు ఇచ్చే శౌర్య పతకాలకు మొత్తం ఆరుగురు ఎంపికయ్యారు.

లిబియాలో జంట పేలుళ్లు: 34 మంది దుర్మరణం



బెంఘాజి: కారుబాంబు పేలుళ్లతో లిబియా నెత్తురోడింది. సెంట్రల్ అల్ సల్మానీ జిల్లా బెంఘాజిలోని ఓ మసీదు ప్రాంగణంలో సంభవించిన జంట పేలుళ్లలో 34 మంది దుర్మరణం చెందగా, మరో 87 మంది గాయపడ్డారు. మంగళవారం సాయంత్రం ప్రార్థనలు ముగించుకొని బయటకొస్తుండగా 8.30 గంటల ప్రాంతంలో మొదటి బాంబు పేలుడు సంభవించింది. భద్రతాదళాలు, వైద్యసిబ్బంది సంఘటనాస్థలికి చేరుకోగా రెండోకారు బాంబు పేలింది. దీంతో క్షతగాత్రులను తరలిస్తున్న అంబులెన్స్ పేలిపోయింది. మృతుల్లో సైనికులు, వైద్య సిబ్బంది, పౌరులు ఉన్నారు. అయితే, ఈ దాడికి బాధ్యత వహిస్తూ ఇంతవరకు ఎవరూ ప్రకటన చేయలేదు.

నేటి నుంచి ఆసియాన్ సదస్సు

సదస్సుకు హాజరవుతున్న పది దేశాల అధినేతలు

ఆసియాన్-భారత్ సంస్మరణ సదస్సు కోసం దేశ రాజధాని నగరం సిద్ధమైంది. గురు, శుక్రవారాల్లో జరుగనున్న ఈ సదస్సుకు పది దేశాల అధినేతలు హాజరుకానున్నారు. ఈ నేతలు శుక్రవారం జరుగనున్న గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

వియత్నాం ప్రధాని ఎన్‌గుయెన్ జువాన పూక్



ఈయన నేతృత్వంలోనే భారత్‌తో రక్షణరంగంలో వియత్నాం కీలక భాగస్వామిగా మారింది. రెండేండ్ల క్రితం ప్రధాని మోదీ వియత్నాంను సందర్శించారు. తూర్పు ఆసియా సదస్సులోనూ మోదీ, పూక్ కలుసుకున్నారు. దక్షిణచైనా సముద్రంలో చైనా ఆధిపత్యం పెరుగుతున్న నేపథ్యంలో తమ సైనిక విస్తరణకు ఊతమివ్వాలని పూక్ కోరుతున్నారు.

ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో



జోకోవీగా పేరొందిన ఇండోనేషియా అధ్యక్షుడు భారత్‌ను సందర్శించడం ఇది రెండోసారి. తమ దేశంలో ప్రజానాయకుడుగా ఆదరణ పొందుతున్న జోకోవీ దేశాధ్యక్షుడు కాకముందు జకార్తా మేయర్‌గా పనిచేశారు. సైన్యం నేపథ్యం నుండి వచ్చిన జోకోవీ హిందూ మహాసముద్రంలో ఇండోనేషియా ప్రాబల్యాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.

సింగపూర్ ప్రధాని లీ సియెన్ లూంగ్



లూంగ్ తండ్రి లీకువాన్ యూవ్ సింగపూర్‌కు మొట్టమొదటి ప్రధాని. తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న లూంగ్ సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానంపై తన దృష్టిని సారించారు. సింగపూర్ అభివృద్ధిని చూసి ఆకర్షితుడైన ప్రధాని మోదీ, అదే స్ఫూర్తితో స్మార్ట్ సిటీల అభివృద్ధిని, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టారు.

మలేషియా ప్రధాని నజీబ్ రజాక్



వంద కోట్ల డాలర్ల కుంభకోణానికి రజాక్ పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఈ ఏడాది మలేషియాలో ఎన్నికలు అనివార్యమయ్యాయి. మాజీ ప్రధాని అబ్దుల్ రజాక్ హుస్సేన్ కుమారుడైన నజీబ్ రజాక్ సహాయం కోసం చైనాను ఆశ్రయించారు. దీంతో మలేషియా సార్వభౌమత్వాన్ని చైనాకు అమ్మివేశారన్న విమర్శల్ని ఆయన ఎదుర్కొంటున్నారు.

కాంబోడియా ప్రధాని హున్‌సేన్




ప్రపంచంలో అత్యధిక కాలం ఓ దేశాన్ని పాలిస్తున్న వ్యక్తి హున్ సేన్. 1985 నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఇటీవల ప్రతిపక్ష నేషనల్ రెస్క్యూ పార్టీని కాంబోడియా సుప్రీంకోర్టు రద్దు చేసింది. జూలైలో జరుగనున్న ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసే అవకాశం లేదు. దీంతో హున్‌సేన్ మరో పర్యాయం అధికారంలో ఉంటారు.

మయన్మార్ స్టేట్ కౌన్సెలర్ ఆంగ్‌సాన్ సూకీ



పదవి స్టేట్ కౌన్సెలర్ అయినా ఆంగ్‌సాన్ సూకీ మయన్మార్‌కు అనధికార ప్రధానిగా వ్యవహరిస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సూకీ ప్రతిష్ట రోహింగ్యాల సంక్షోభంతో కాస్త మసకబారినట్లు కనిపిస్తున్నది. రోహింగ్యాల సమస్యల పట్ల ఆమె మౌనంపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రాడ్రిగో డ్యుటర్టీ



మత్తుపదార్థాల అక్రమ వ్యాపారులు, బాధితులపై ఉక్కుపాదం మోపి అనేకమందిని హత్యచేయించారు డ్యుటర్టీ. ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నా ఫిలిప్పీన్స్ ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. దక్షిణ చైనా సముద్రం విషయంలో చైనాను మధ్యవర్తిత్వ కోర్టుకు ఈడ్చి, ఆ కేసులో డ్యుటర్టీ నేతృత్వంలోని ఫిలిప్పీన్స్ విజయం సాధించింది.

థాయ్‌లాండ్ ప్రధాని ప్రయూత్ చాన్ ఓచా



2014 సైనిక తిరుగుబాటుకు నేతృత్వం వహించిన ఓచా తరువాత థాయ్‌లాండ్‌లో అధికారాన్ని చేపట్టారు. ఎన్నికలు నిర్వహిస్తానన్న తన వాగ్దానాన్ని నిలబెట్టుకోకపోవడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల మీడియా సమావేశం నుంచి వాకౌట్ చేసిన ఓచా తనకు బదులుగా తన కార్డ్‌బోర్డు బొమ్మను నిలబెట్టి, దానినే ప్రశ్నలు అడుగాలని విలేకరులకు చెప్పారు.

బ్రూనై సుల్తాన్ హసన్‌లాల్ బోల్కియా



బోల్కియా ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు. ఆయన ఆదాయం అంతా దేశంలోని చమురు, గ్యాస్ నిక్షేపాల నుండే వస్తున్నది. ఆగ్నేయాసియాలో అతిచిన్న దేశమైన బ్రూనైలో భారత్‌కు అనేక వ్యాపార ప్రయోజనాలున్నాయి. భారత వస్త్ర పరిశ్రమలకు అక్కడ వాటాలున్నాయి.

లావోస్ ప్రధాని తోంగియన్ సిసోలిత్



డిప్యూటీ ప్రధానిగా ఉన్న తోంగియన్ 2016లో ప్రధాని అయ్యారు. చైనా నుంచి 520 కోట్ల యువాన్లను లావోస్ సహాయంగా పొందింది. దక్షిణ చైనా సముద్రంలో ఏర్పడిన వివాదాల పరిష్కారానికి లావోస్ చైనా వైపే తన దృష్టిని సారించింది. ఈ పరిణామం భారత్, లావోస్ మధ్య సంబంధాలపై ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు.

గణతంత్ర దినోత్సవాన అప్రమత్తంగా ఉండండి

■ రాష్ట్ర పోలీసులకు కేంద్ర నిఘావర్గాల హెచ్చరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా వేడుకలు నిర్వహించే ప్రదేశాల్లో బాంబు, డాగ్‌స్క్వాడ్ బృందాలతో తనిఖీలు ముమ్మరంచేశారు. అన్ని జిల్లాల పోలీసులను అలర్ట్ చేశారు. దేశవ్యాప్తంగా బాంబుదాడులతో విధ్వంసాలు సృష్టించిన ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషీని నాలుగురోజుల కిందట ఢిల్లీ పోలీసులు అరెస్టుచేసిన విషయం తెలిసిందే. ఖురేషీకి హైదరాబాద్‌తో కూడా సంబంధాలు ఉన్నట్టు నిఘావర్గాలు గుర్తించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు మరింత అప్రమత్తంగా ఉన్నారు.

ఆరు నగరాల్లో స్మార్ట్‌సిటీ హ్యాకథాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆరునగరాల్లో ప్రత్యేకంగా 'తెలంగాణ స్మార్ట్‌సిటీ హ్యాకథాన్-2018' నిర్వహించనున్నట్టు ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విభాగాల్లో ఎదురవుతున్న పలు కీలక సమస్యలకు ఈ హ్యాకథాన్ పరిష్కారం చూపెడుతుందని చెప్పారు. ఆరువేల మంది విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్ మొదటివారంలో జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఫైనల్ పోటీలు జరుగుతాయని తెలిపారు.



తిరుమలలో రథసప్తమి ఉత్సవాలను టీటీడీ అంగరంగవైభవంగా నిర్వహించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రివరకు మలయప్ప స్వామి వారు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఏటా మాఘశుద్ధ సప్తమినాడు నిర్వహించే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో తిరుమల కిక్కిరిసింది.
-తిరుమల, నమస్తే తెలంగాణ

గాండ్రింపులు వినిపిస్తున్నయ్

కాగజ్‌నగర్ అడవుల్లో పులుల అడుగుజాడలు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పెద్దపులుల కోసం అన్వేషణ ఫలిస్తున్నది. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ సర్వే సందర్భంగా రాష్ట్రంలోని అటవీప్రాంతాల్లో పెద్దపులుల అడుగుజాడలు ఆశించిన స్థాయిలో కనిపిస్తున్నాయి. గాండ్రింపులు వినిపిస్తున్నాయి. మూడు చోట్ల పెద్దపులులను ప్రత్యక్షంగా చూశారు. కాగజ్‌నగర్ అటవీ ప్రాం తంలోని బెజ్జూరు, పెంచికల్‌పేట, బొంబాయిగూడ బీట్లలో పలు చోట్ల పెద్దపులి అడుగుజాడలు కనిపించాయి. సిర్పూరు, కదంబ అటవీ ప్రాంతాలలో పెద్దపులి ప్రత్యక్షంగా కనిపించినట్లు స్థానికులు సర్వేలో పాల్గొన్న వారికి తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతం మల్లయ్యలొద్ది వద్ద సర్వేలో పాల్గొన్న వాలంటీర్లకు పులి కనిపించింది. దాదాపు అన్ని అటవీ ప్రాంతాలలో పెద్దపులుల అడుగు జాడలను గుర్తించడానికి సోమవారం సర్వే మొదలైంది. ఇది రాష్ట్రంలో ఈ నెల 29వరకు కొనసాగుతుంది.



కాగజ్‌నగర్ అడవుల్లో కన్పించిన పెద్దపులి అడుగుజాడ

కస్టమర్‌ను కొట్టి చంపారు

సంగారెడ్డిలోని దాబాలో దారుణం

సంగారెడ్డి టౌన్: బిల్లు చెల్లించలేదంటూ ఓ దాబా యజమాని కస్టమర్ ను కొట్టిచంపిన సంఘటన సంగారెడ్డిలో జరి గింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలం తేర్పోల్ గ్రామానికి చెంది న ఎండీ షాకీర్‌మియా (38) అదే గ్రామానికి చెందిన చాకలి రాములు, నర్సింహులుతో కలిసి 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రిన్స్ దాబాకు భోజనానికి వెళ్లాడు. భోజనం చేసిన తర్వాత బిల్లు చెల్లించే సందర్భంగా కొన్ని డబ్బులు తక్కువగా ఉండడంతో తాను వచ్చిన ఆటోవద్ద డబ్బులు ఉన్నాయని తీసుకొచ్చి చెల్లిస్తానని దాబా యజమానికి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన యజమాని అశోక్ చౌహాన్ మరో ముగ్గురితో కలిసి షాకీర్‌మియాపై మూకుమ్మడి దాడిచేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



అమెరికన్ కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డా బుధవారం మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. భేటీ అనంతరం క్యాథరిన్ ఈమేరకు ట్వీట్ చేశారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

గ్రంథాలయాలకు కొత్తరూపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గ్రంథాలయాలు కొత్తరూపును సంతరించుకుంటున్నాయని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్ తెలిపారు. ఢిల్లీలో మంగళ, బుధవారాల్లో ఇండియన్ పబ్లిక్ లైబ్రరీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పౌరగ్రంథాలయ సదస్సులో పాల్గొని వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. తెలంగాణలో వందేండ్లకు పైగా చరిత్ర కలిగిన గ్రంథాలయాలు ఉన్నాయని ఆయన వివరించారు. వీటిలో అరుదైన, ప్రాచీన పుస్తక సంపద ఉందన్నారు. గ్రంథాలయశాఖ డిప్యూటీ డైరెక్టర్ అలివేలు, లైబ్రేరియన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

జోరుగా కరంటు పనులు

కాళేశ్వరంలో 6,8 ప్యాకేజీల్లో జూన్‌కల్లా ఎనిమిది పంపులు సిద్ధమంటున్న అధికారులు

అందుకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ లైన్ల పూర్తికి మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్యాకేజీ-8 (రామడుగు పంపుహౌజ్) వద్ద విద్యుత్‌కు సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపరితల, లోపలి మోటర్లు నడిచేందుకు కావాల్సిన విద్యుత్‌ను పంపిణీ చేసేందుకు ఎగువన 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణమవుతున్నది. ఇక్కడే ఒక్కో మోటరు నడిచేందుకుగాను 160 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో సివిల్, మెకానికల్ పను లు ఎంత వేగంగా జరుగుతున్నాయో.. అంతకన్నా ఒకింత ముందుగానే విద్యుత్ పంపిణీ వ్యవస్థ పనులు ముగించేందుకు కసరత్తు జరుగుతున్నది. మోటర్లు నడవాలంటే కరంటు కావాలి. మరి ఆ మోటర్లను బిగించిన తర్వాత సాంకేతికంగా అవి సరిగ్గా నడుస్తున్నా యో.. లేదో తెలుసుకునేందుకు నిర్వహించే డ్రైరన్‌కు కూడా విద్యుత్ సరఫరా అవసరం. అందుకే మోటర్ల పనులు వేగం అందుకోవడంతో ట్రాన్స్‌కో, జెన్‌కో యంత్రాంగం కూడా విద్యుత్ పంపిణీ పనులను మరింత ముమ్మరం చేశారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ పర్యటించడం.. ఆపై నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు రెండు విడుతలు పర్యవేక్షించడంతో ఈ పనులు మరింత వేగాన్ని పుంజుకున్నాయి. రామడుగులో ఇప్పటికే ఒక మోటరు బిగింపు పూర్తయింది. రెండో మోటరు పనులు ముందుకు సాగుతున్నాయి. నంది మేడారంలోనూ బిగింపు పనులు మొదలయ్యాయి. ఇలా రెండు నెలలకు ఒక మోటారు చొప్పున సిద్ధం కానున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికే రామడుగు, నంది మేడారం పంపుహౌజుల్లో ఎనిమిది పంపులను సిద్ధం చేస్తామని తెలంగాణ ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన, షెడ్యూల్ ప్రకారం పూర్తవాలంటే కచ్చితంగా విద్యుత్ సంస్థల సహకారం, తోడ్పాటు అవసరమని మంత్రి వారిని కోరారు.



రామడుగు పంప్‌హౌజ్‌లో మోటర్ డ్రైరన్ కోసం తాత్కాలికంగా తీసుకొచ్చిన 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్

యుద్ధప్రాతిపదికన పనులు

రామడుగు పంపుహౌజ్‌లో ఇప్పటికే ఒక మోటారు డ్రైరన్ పూర్తిచేశారు. రామడుగు పంపుహౌజ్‌పై 400 కేవీ సబ్‌స్టేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే మోటరుకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఇంకా పూర్తి కాలేదు. కానీ ఈ పంపుహౌజ్ ఉపరితలం నుంచి భారీ విద్యుత్ డక్టులు (వైర్లు) లోపలికి వెళ్లేందుకు వెసులుబాటు ఉండటంతో డ్రైరన్ కోసం తాత్కాలికంగా 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చి డ్రైరన్ పూర్తి చేశారు. కానీ మిగతా పంపుహౌజ్‌ల వద్ద ఈ తాత్కాలిక వ్యవస్థకు అవకాశం లేదు. అందుకే వీటి విద్యుత్ టవర్లు, హెచ్‌టీ లైన్లు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. తాజా షెడ్యూల్ ప్రకారం ఆరు 400 కేవీ, మూడు 220 కేవీ, రెండు 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ప్రయత్నిస్తున్నది. మరోవైపు మేడారం, అన్నారం, సుందిల్ల పంపుహౌజుల్లోనూ మార్చి నుంచి మోటర్లు అందుబాటులోకి రావడం మొదలవుతుంది. ఆ మేరకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



అమీనుద్దీన్ కుటుంబసభ్యులకు ఉత్తమ డ్రైవర్ అవార్డును అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ జీవీ రమణరావు

ప్రమాదరహిత డ్రైవింగ్‌లో ఆర్టీసీ టాప్

జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు ■ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో మంత్రి మహేందర్‌రెడ్డి

రాష్ట్ర, జోన్‌స్థాయి ఉత్తమ డ్రైవర్లకు సన్మానం, నగదు పురస్కారాలు అందజేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అతి తక్కువ రోడ్డు ప్రమాదాల శాతాన్ని నమోదుచేసి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డును సొంతం చేసుకున్నదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదాలను జీరో శాతానికి తీసుకురావాలని, ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం అనే నమ్మకాన్ని ఇంకా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. బుధవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో జరిగిన 29వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఉత్తమ డ్రైవర్లు, డిపో మేనేజర్లకు నగదు పురస్కారాలు, అవార్డులు అందజేశారు. ఉత్తమ డ్రైవర్ అమీనుద్దీన్ ఇటీవల మృతిచెందడంతో ఆయన తరపున కుటుంబసభ్యులు అవార్డు స్వీకరించారు. టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రమాదాల సంఖ్యను జీరో శాతానికి తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు, రవాణాశాఖ జాయింట్ కమిషనర్ పాండునాయక్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేణు, సీటీఎం రవీందర్ పాల్గొన్నారు.

ఉద్యానశాఖలో కారుణ్య నియామకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఉద్యానశాఖలో కారుణ్య నియామకాల కింద ఏడుగురికి తోటమాలి ఉద్యోగాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉద్యోగాలు పొందిన వారికి సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా బుధవారం సచివాలయంలో నియామక ఉత్తర్వులను అందజేశారు.



రవాణాశాఖ కార్యాలయంలో దగ్ధమైన ఫైళ్లను పరిశీలిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌లో మళ్లీ మంటలు

■ వారంలో రెండోసారి అగ్నిప్రమాదం

హైదరాబాద్/సిటీబ్యూరో/ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కార్యాలయంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా భవనంలోని మొదటి అంతస్థులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో రవాణాశాఖ పత్రాలు దగ్ధమయ్యాయి. రెండురోజుల క్రితమే ఈ కార్యాలయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఫైళ్లన్నీ కాలిపోయాయి. వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మరమ్మతులకు రూ.10లక్షలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. 30 మంది అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలకుపైగా కష్టపడి మంటలనుఅదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో 1969 నుంచి భద్రపరిచిన ఫైళ్లు, కిటికీలు, వెంటిలేటర్లు కాలిపోయాయి. రికార్డులన్నీ కంప్యూటర్లలో నిక్షిప్తం చేసినందున పాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టాలని ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ ఆదేశించారు.

'డబుల్ బెడ్రూం' ధరలు సవరించాలి: బిల్డర్లు

హైదరాబాద్/ మాదాపూర్, నమస్తే తెలంగాణ: పెరిగిన ఉక్కు, సిమెంటు ధరలకు అనుగుణంగా డబుల్ బెడ్రూం ఇండ్ల కాంట్రాక్ట్ రేట్లను సవరించాలని తెలంగాణ కాంట్రాక్టర్ల సంఘం చైర్మన్ సుగుణాకర్‌రావు, జాతీయ బిల్డర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. హైటెక్స్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టర్లను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని అభిప్రాయపడ్డారు. వచ్చేనెల 5వ తేదీలోగా ఈ సమస్య పరిష్కారం కాకపోతే పనులు నిలిపివేస్తామని తెలిపారు.

రవాణాశాఖకు ముగ్గురు కొత్త ఆర్టీవోలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రూపు-1 పరీక్షల్లో పాసైన అభ్యర్థుల్లో ముగ్గురు అధికారులను ప్రభుత్వం రవాణాశాఖకు అప్పగించింది. ఇంచార్జిల పాలనలో నడుస్తున్న ఆర్టీవో కార్యాలయాలకు చాలాకాలం తర్వాత క్యాడర్ ఆఫీసర్లు అధికారులుగా నియమితులయ్యారు. పెద్దపల్లి దుర్గాప్రసాద్‌కు ఖైరతాబాద్-2 ఆర్టీవోగా, ఎస్ వాణికి వికారాబాద్ జిల్లా ఆర్టీవోగా, ఆఫ్రిన్ సిద్దిఖీకి పెద్దపల్లి జిల్లా ఆర్టీవోగా బాధ్యతలు అప్పగించారు. కాగా ఈ ముగ్గురికి ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే నేరుగా బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది.



ఏపీ సీఎం చంద్రబాబు కుర్చీలో కూర్చుని సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ఏపీ సీఎం కుర్చీలో ఎమ్మెల్యే బాలయ్య

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: బావ తర్వాత తానే ఏపీ సీఎం అనుకున్నారో ఏమో? టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ సాక్షాత్తు సీఎం కుర్చీలో ఆశీనులై మంత్రి దేవినేని ఉమ, అధికారులతో సమీక్షించారు. బుధవారం విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయంలో హిందూపురం, లేపాక్షి పుస్తకాలు, ఉత్సవాలపై బాలకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలకృష్ణను సీఎం కుర్చీలో చూసి అక్కడకొచ్చిన ఐఏఎస్ అధికారులు, నేతలు విస్తుపోయారు.

యువత ఉద్యోగాలు సృష్టించాలి

విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి

శేరిలింగంపల్లి: యువత ఉద్యోగాల వెంటపడటం కాకుండా ఉద్యోగ అవకాశాలను సృష్టించేలా మేధోసంపత్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. బుధవారం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో రాష్ట్ర ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో ఏర్పాటైన వృత్తి నైపుణ్య శిక్షణ కోర్సుల ప్రారంభోత్సవానికి మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎయిర్‌హోస్టెస్, స్టీవర్డ్, పంచకర్మ శిక్షణ కోసం ఏర్పాటుచేసిన ప్రాంగణాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ సహకారం, ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో ఎస్సీ నిరుద్యోగ యువతకు ఆరు కోర్సులను అందిస్తామని నిథిమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిథిమ్.. ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, శాంతగిరి ఆశ్రమాలతో కోర్సుల నిర్వహణకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి సంస్థ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, శాంతగిరి ఆశ్రమ ఇంచార్జి ప్రణవశుధన్ జ్ఞానతపస్వీ, టీఎస్‌సీసీడీసీ ఎండీ లచ్చీరామ్ బుకియా, గచ్చిబౌలి కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నిథిమ్ ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



గచ్చిబౌలిలో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నిథిమ్, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారులు

బాధిత జర్నలిస్టులకు ఫిబ్రవరిలో చెక్కులు

జర్నలిస్టు సంక్షేమనిధి ద్వారా ఆర్థికసాయం ■ తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రోత్సాహంతో ఏర్పాటుచేసిన జర్నలిస్టుల సంక్షేమ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఫిబ్రవరిలో చెక్కులు అందజేస్తామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. బుధవారం తెలుగు విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో అల్లం నారాయణ అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్నవారిలో 41 మందికి ఆర్థికసాయం అందించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సీఎం కేసీఆర్ జర్నలిస్టుల కోసం సంక్షేమనిధిని ఏర్పాటుచేశారని చెప్పారు. ఇప్పటివరకు రూ.30 కోట్లు ఉన్నాయని, మరో రూ.30 కోట్లు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, మొత్తం కలిపి జర్నలిస్టుల సంక్షేమనిధి రూ.60 కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రధాన స్రవంతి పత్రికలన్నింటిలో తెలంగాణ వారే సంపాదకులుగా ఉన్నందున వారి జీవన విశేషాలు, ఇంటర్వ్యూలతో ఒక పుస్తకం తేవాలని నిర్ణయించారు. మీడియా అకాడమీ కోసం రూ.15 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, టీ న్యూస్ సీఈవో ఎం నారాయణరెడ్డి, దక్కన్ క్రానికల్ పొలిటికల్ ఎడిటర్ సీఆర్ గౌరీశంకర్, సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్య, ఓయూ జర్నలిజంశాఖ హెచ్‌వోడీ స్టీవెన్‌సన్, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ టంకశాల అశోక్, ఆల్ ఇండియా రేడియో ఉపసంచాలకుడు ఉదయ్‌శంకర్, దూరదర్శన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ మీడియా అకాడమీ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ అల్లం నారాయణ, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, తెలంగాణ టుడే ఎడిటర్లు కట్టా శేఖర్‌రెడ్డి, కే శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, టీ న్యూస్ సీఈవో ఎం నారాయణరెడ్డి, దక్కన్ క్రానికల్ పొలిటికల్ ఎడిటర్ సీఆర్ గౌరీశంకర్, టంకశాల అశోక్ తదితరులు

ప్రైవేటు స్కూళ్ల సమస్యలు పరిష్కరిస్తాం: ఎంపీ వినోద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ చెప్పారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల సంఘం (ట్రస్మా) నాయకులు బుధవారం ఎంపీ వినోద్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు శ్రీనివాసరెడ్డి, వై శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయోటిక్స్ వినియోగాన్ని తగ్గించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మానవులకు పౌష్టికాహారాన్ని అందించడంలో పశుఉత్పత్తులు అధిక ప్రాధాన్యత కలిగిఉన్నాయని పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా పేర్కొన్నారు. యాంటీబయోటిక్స్ వినియోగాన్ని తగ్గించాలని, వీలైనంతవరకు హెర్బల్ మందులు వాడాలని వైద్యులకు సూచించారు. 'పశువుల్లో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' అనే అంశంపై హైదరాబాద్‌లోని పశువైద్య, పశు పశుసంవర్ధకశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ డీ వెంకటేశ్వర్లు, పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి, పశువైద్య విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ వీరోజీరావు, డాక్టర్ వై నర్సింహారెడ్డి, ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్, అదనపు సంచాలకుడు డాక్టర్ రాంచందర్ పాల్గొన్నారు.

పంట రుణాలు సకాలంలో అందించండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులకు సకాలంలో పంట రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి అసహనం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్లకు లేఖలు రాశారు. కొన్ని జిల్లాల్లో పంట రుణాలు లక్ష్యానికి మించి ఇస్తుంటే మరికొన్ని జిల్లాల్లో పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. 2017-18 వానకాలంలో పెద్దపల్లి జిల్లాలో అత్యల్పంగా 48శాతమే రుణాల పంపిణీ జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో 75శాతంలోపే రుణాలు అందాయని తెలిపారు. యాసంగిలో రైతులకు రుణాలందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫార్మాసిటీ పర్యావరణ అనుమతులపై ఈఏవో భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులపై ఢిల్లీలో బుధవారం ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ (ఈఏవో) సమావేశం జరిగింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిశ్రమలశాఖ ఇంచార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయసేకరణ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందించింది. పర్యావరణానికి ముప్పులేకుండా తీసుకోనున్న చర్యలను రాష్ట్ర అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. దీనిపై పర్యావరణ మంత్రిత్వశాఖ సంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. అనుమతుల కోసం త్వరలో పర్యటనకు వస్తామని వారు వివరించినట్టు తెలిసింది.

దేశ ప్రగతికి వరం కాళేశ్వరం

మొదటిపేజీ తరువాయి...

చూడలేదన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. అనుకున్నదానికంటే ఎక్కువ ప్రయోజనాలు అందుతాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అద్భుతం సృష్టిస్తుందని, దేశ ప్రగతిలో రాబోయే రోజుల్లో ప్రధాన భూమిక పోషిస్తుందని సంతోషం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో అన్ని రాష్ట్రాల్లోనూ సాగు, తాగునీటి పథకాలు పెద్ద ఎత్తున చేపట్టాలని మిశ్రా అభిప్రాయపడ్డారు. మిషన్ భగీరథ కార్యక్రమాన్ని అభినందించిన మిశ్రా.. హరితహారం వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అటవీప్రాంతాల్లో కొనసాగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులను స్వయంగా పరిశీలించేందుకు వచ్చిన మిశ్రా.. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనచేశారు. తొలుత మిషన్ భగీరథ ప్రాజెక్ట్ కింద గజ్వేల్ సెగ్మెంట్ కోమటిబండలో నిర్మించిన ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అన్నారం బరాజ్‌ను సందర్శించారు. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని సుందిళ్ల బరాజ్ పనులను విహంగవీక్షణ చేశారు. అన్నారం బరాజ్ వద్ద సాగునీటి శాఖ ఇంజినీర్లు ఏర్పాటుచేసిన కాళేశ్వరం ప్రాజెక్టు ఛాయా చిత్రాలను తిలకించారు. మహాదేవ్‌పూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్ వరకు చేపట్టిన 13.2 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. గ్రావిటీ కెనాల్ నిర్మాణంవల్ల తొలిగించిన చెట్లు, ప్రత్యామ్నాయంగా అడవుల పెంపకంపై తన వెంట ఉన్న అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) పీకే ఝాను అడిగి తెలుసుకున్నారు. అన్నారం అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన భూములలో అడవుల పెంపకం ప్రణాళికను ఝా ఆయనకు వివరించారు. అడవుల పెంపకం, అటవీ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మిశ్రా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల తీరు పట్ల కేంద్రం సంతృప్తిగా ఉందని చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా ఏ విధమైన సహకారం, ప్రోత్సాహం అవసరమనే అంశంపై అధ్యయనం చేయడానికి వచ్చినట్టు తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను మైక్రో లెవల్‌లో పరిశీలించిన తాను ఈ ప్రాజెక్టు సాగు, తాగునీరు కోసం ఎంతో ఉపయోగపడనుందని గుర్తించానని చెప్పారు. ఇలాంటి ప్రాజెక్టుల వల్ల పచ్చదనం, భూగర్భ జలాల నీటి మట్టం పెరుగుతుందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో వాడుతున్న టెక్నాలజీ ప్రభావం పర్యావరణంపై లేకుండా చూడాల్సి ఉందని మిశ్రా అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం అడవులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న హరితహారం కార్యక్రమం దేశానికే ఆదర్శమని అన్నారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషి, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ హరిరాం, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, పీసీసీఎఫ్ పీకే ఝా, అటవీ శాఖ వరంగల్ కన్జర్వేటర్ అక్బర్, జిల్లా అటవీ అధికారి రవికిరణ్, ట్రైనీ ఐఏఎస్‌లు తదితరులు మిశ్రా పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిశ్రాను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

కోమటిబండ సంప్‌హౌజ్ పరిశీలించిన మిశ్రా

ఇంటింటికి నీరందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం అభినందనీయమని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ సంప్‌హౌజ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా నెంటూరుకు వచ్చిన మిశ్రా, అధికారులతో కలిసి కోమటిబండ సంప్‌హౌజ్‌కు చేరుకున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు గురించి మిశ్రాకు ఈఎన్సీ సురేందర్‌రెడ్డి క్షుణ్ణంగా వివరించారు. ప్రాజెక్టును, కోమటిబండ అటవీప్రాంతాన్ని పరిశీలించిన మిశ్రా.. సంప్‌హౌజ్‌లోకి దిగి స్వయంగా నీటి శుద్ధీకరణ విధానాన్ని చూశారు. రాజస్థాన్ ఇంజినీర్లు ఇలాంటి ప్రాజెక్టును రూపొందించడానికి సంవత్సరం పట్టిందని, తమ ఇంజినీర్లు మూడు నెలల్లోనే ప్లాన్‌ను రూపొందించారని ఈఎన్‌సీ వివరించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం చాలా బాగుందన్నారు. హరితహారం కార్యక్రమం కింద పెద్దఎత్తున చేపట్టిన మొక్కల పెంపకం, రోడ్లకు ఇరువైపులా నాలుగు వరుసలుగా నాటిన చెట్లను పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్‌శాఖ కార్యదర్శి ఎస్కే జోషి ఉన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పద్మాకర్, గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఓఎస్డీ హన్మంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మిషన్‌భగీరథ నమూనాను కేంద్ర పర్యావరణ కార్యదర్శి సీకే మిశ్రాకు వివరిస్తున్న ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

88,139 కోట్లు

ప్రభుత్వ రంగ బ్యాంకులకు మార్చి 31లోగా అందిస్తామన్న జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 24: రాబోయే రెండు నెలల్లో 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,000 కోట్లకుపైగా నిధులను అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. మార్చి 31లోగా రూ.88,139 కోట్ల మూలధనాన్ని సమకూర్చనున్నట్లు ఆయన బుధవారం ఇక్కడ ప్రకటించారు. మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) సమస్యతో సతమతమవుతున్న బ్యాంకింగ్ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేలా, ఖాతాదారులకు మరింత రుణ సదుపాయాన్ని కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఎన్‌పీఏల విలువ రూ.8 లక్షల కోట్లకుపైగా ఉండగా, త్వరలోనే ఇది రూ.9.50 లక్షల కోట్లకు చేరవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే రీక్యాపిటలైజేషన్ ప్రణాళికను జైట్లీ ప్రకటించగా, వచ్చే నిధుల్లో ఐడీబీఐ బ్యాంకుకు అత్యధికంగా రూ.10,000 కోట్లపైనే నిధులు అందనున్నాయి. ఇక మొత్తం రూ.88,139 కోట్ల నిధుల్లో రూ.80,000 కోట్లు రీక్యాపిటలైజేషన్ బాండ్ల ద్వారా, మిగతా రూ.8,139 కోట్లు బడ్జెట్ కేటాయింపుల్లో నుంచి బ్యాంకులకు అందుతాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) బ్యాంకులకు చేసిన ఆర్థిక సాయం రూ.లక్ష కోట్లను దాటనుందని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే రూ.10,312 కోట్ల నిధులను క్యాపిటల్ మార్కెట్ల ద్వారా బ్యాంకులు అందుకున్నాయని, ఈ రెండు నెలల్లో ఇంకొన్ని నిధులను సమీకరించనున్నాయని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంతోపాటు వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో ప్రభుత్వ బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల ఆర్థిక సాయం చేస్తామని గతేడాది అక్టోబర్‌లో జైట్లీ ప్రకటించిన సంగతి విదితమే. ఇందులో రూ.1.35 లక్షల కోట్లు బాండ్ల విక్రయం ద్వారా, రూ.76,000 కోట్లు బడ్జెట్ కేటాయింపులు, క్యాపిటల్ మార్కెట్లలో నిధుల సమీకరణ ద్వారా అందుతాయని నాడు జైట్లీ స్పష్టం చేశారు. ఇదిలావుంటే బ్యాంకింగ్ రంగ సంస్కరణల్లో భాగంగా అధిక విలువ కలిగిన రుణాల మంజూరు కోసం కఠిన నిబంధనలను రూపొందిస్తున్నట్లు జైట్లీ తెలిపారు. అలాగే భారీ రుణ ఎగవేతదారులపై గట్టి నిఘా పెడుతున్నామని, రూ.250 కోట్లకుపైగా బకాయిపడిన వారి సమాచారం తప్పక ప్రభుత్వానికి సమర్పించాలని బ్యాంకులకు చెబుతున్నామన్నారు. కాగా, రీక్యాపిటలైజేషన్ బాండ్ల ద్వారా అందిస్తున్న రూ.80,000 కోట్ల సాయం ద్రవ్యలోటుపై ప్రభావం చూపబోదని జైట్లీ చెప్పారు.

ఏయే బ్యాంకులకు ఎన్ని నిధులు?

బ్యాంకు	నిధులు (రూ. కోట్లలో)
ఐడీబీఐ	10,610
బ్యాంక్ ఆఫ్ ఇండియా	9,232
ఎస్‌బీఐ	8,800
యూకో	6,507
పంజాబ్ నేషనల్	5,473
బ్యాంక్ ఆఫ్ బరోడా	5,375
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	5,158
కెనరా	4,865
ఇండియన్ ఓవర్సీస్	4,694
యూనియన్ బ్యాంక్	4,524
ఓబీసీ	3,571
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	3,173
దేనా	3,045
సిండికేట్	2,839
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	2,634
కార్పొరేషన్ బ్యాంక్	2,187
ఆంధ్రా బ్యాంక్	1,890
అలహాబాద్ బ్యాంక్	1,500
పంజాబ్-సింధ్	785

అంచనాలేమిటి?



న్యూఢిల్లీ, జనవరి 24: సరిగ్గా మరో వారం రోజుల్లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కొత్త బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఫిబ్రవరి 1న ప్రకటించబోయే ఈ బడ్జెట్ ఎలా ఉండబోతున్నది?.. నిపుణుల అంచనాలేమిటి?.. వివిధ పరిశ్రమ వర్గాలు ఏం కోరుకుంటున్నాయి?.. ఏ రంగానికి ఎన్ని నిధులు దక్కుతాయి?.. ఎలాంటి మేలు జరుగుతుంది?.. ముఖ్యంగా వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న క్రమంలో నరేంద్ర మోదీ సర్కారు ఐదేండ్ల పాలనలో ఈ చివరి పూర్తికాల బడ్జెట్ ఎవరికి ఏమివ్వనున్నది?.. ఎవరి నుంచి ఏం తీసుకోనున్నది?.. దేశ ఆర్థిక వ్యవస్థను పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావితం చేసిన నేపథ్యంలో అసలు జైట్లీ 'బ్రీఫ్‌కేస్'లో ఏం తెస్తున్నారు?..

- 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా దేశీయ ఉత్పాదక రంగానికి ఊతమిచ్చే నిర్ణయాలుండవచ్చు. స్థానిక విద్యుత్, క్యాపిటల్ గూడ్స్, కెమికల్స్ కంపెనీల కోసం విదేశీ దిగుమతులపై సుంకాన్ని పెంచవచ్చు. తద్వారా భారతీయ కంపెనీల్లో మరింత ఉత్పత్తి, ఉద్యోగావకాశాలకు వీలుంటుంది.
- హెల్త్‌కేర్ పరిశ్రమలో నిర్మాణాత్మక పన్ను ప్రయోజనాలు, డయాగ్నస్టిక్స్ రంగంలో అధిక పెట్టుబడులకు ఆస్కారమున్నది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం మరిన్ని నిధులు కేటాయించవచ్చు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పెరుగవచ్చు. ఆరోగ్య బీమా పరిధి విస్తృతం కావచ్చు.
- వ్యవసాయ రంగంలో రుణ పరపతిని మెరుగుపరిచే అవకాశాలున్నాయి. ఇందులో భాగంగానే వ్యవసాయ రుణాల లక్ష్యాన్ని రూ.లక్ష కోట్లు పెంచి రికార్డు స్థాయిలో రూ.11 లక్షల కోట్లకు చేర్చే వీలున్నది. ఉద్దీపనలతోపాటు నీటి పారుదల, పంటల బీమాకు పెద్దపీట వేయాలని ఇక్రా సూచిస్తున్నది.
- ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను పెంచాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి. గిడ్డంగుల నిర్మాణానికి ప్రోత్సాహకాలుండాలని ఆశిస్తున్నాయి. గ్రామీణ ఆదాయ వనరులను పెంచి, ఆకర్షణీయ మార్కెట్‌కు మెరుగైన బాటలు వేయాలంటున్నాయి.
- పరిశ్రమ హోదాను డిమాండ్ చేస్తున్న నిర్మాణ రంగం.. సింగిల్ విండో అనుమతులు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఆర్ఈఐటీ లేదా రీట్)లపై పన్నుల హేతుబద్ధీకరణ, జీఎస్టీ రేట్లలో తగ్గింపు, పర్యావరణహిత భవనాల కోసం అధిక ప్రోత్సాహకాలను కోరుతున్నది.
- చక్కెర పరిశ్రమ కోసం షుగర్ డెవలప్‌మెంట్ కార్పస్ ఫండ్‌ను రూ.500 కోట్లకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నిధి ద్వారా తక్కువ వడ్డీరేటుకే చక్కెర మిల్లులకు కేంద్రం రుణాలను అందిస్తుందన్న విషయం తెలిసిందే.

40 వేల కోట్లపై ఫ్యూచర్ గ్రూపు గురి

హైదరాబాద్, జనవరి 24: ప్రముఖ రిటైల్ దిగ్గజం ఫ్యూచర్ కన్జ్యూమర్ లిమిటెడ్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి గ్రూపు టర్నోవర్ రూ.40 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫ్యూచర్ గ్రూపు సీఈవో కిశోర్ బియానీ తెలిపారు. గతేడాది నమోదైన రూ.28,600 కోట్లతో పోలిస్తే 33 శాతం పెరుగనున్నదని దక్షిణాది మార్కెట్లోకి గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరి బియ్యాన్ని విడుదల చేసిన అనంతరం ఆయన విలేకరులతో చెప్పారు. మొత్తం వ్యాపారంలో ప్రస్తుతం రూ.2,500 కోట్లుగా ఉన్న హైదరాబాద్ వాటా వచ్చే ఏడాదికిగాను రూ.4,000 కోట్లకు చేరుకోనున్నదని ఆయన పేర్కొన్నారు. దక్షిణాదిన ఈ బియ్యాన్ని మరింత ప్రమోట్ చేయడానికి సురేశ్ ప్రొడక్షన్, అన్నపూర్ణ స్టూడియోలతో సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది.



రైస్‌బ్రాండ్‌ను విడుదల చేస్తున్న సినీ నటుడు రానా, ఫ్యూచర్ గ్రూపు సీఈవో కిశోర్ బియానీ

రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమ!

రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ ఏర్పాటు చేసే ఆలోచనలో ఫ్యూచర్ గ్రూపు ఉన్నట్లు కిశోర్ బియానీ సంకేతాలిచ్చారు. ఇప్పటికే నాగ్‌పూర్ వద్ద పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు చెప్పిన ఆయన.. వరంగల్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన టెక్స్‌టైల్ పరిశ్రమపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

నేటి నుంచి గృహాలపై తగ్గనున్న జీఎస్టీ


ఇండ్లపై తగ్గించిన జీఎస్టీ.. గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం (సీఎల్ఎస్ఎస్) కింద నిర్మాణంలో ఉన్న గృహాలను కొనుగోలు చేసే వారికి 12 శాతంగా ఉన్న జీఎస్టీని 8 శాతానికి తగ్గిస్తూ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆర్థికంగా బలహీన వర్గాల కోసం, అల్పాదాయ, మధ్యతరగతి (మిడిల్ ఇన్‌కం గ్రూప్-1, 2) వారి కోసం ఈ నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకున్నది. అందరికీ ఇండ్లు లక్ష్యం కింద, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-పట్టణం) కింద గృహాలను కొనుగోలు చేసేవారికీ వడ్డీ రాయితీ లభించనున్నది.

ద్రవ్యలోటును అదుపులో ఉంచాలి: రాజన్

రాబోయే బడ్జెట్‌లో ద్రవ్యోలోటును అదుపులో ఉంచాల్సిన అవసరం చాలా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. బడ్జెట్ కూర్పులో జైట్లీ దీనిపై తగిన జాగ్రత్తలు తీసుకునే ఉంటారన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్‌లో పాల్గొన్న రాజన్.. 'ఈటీ నౌ'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆధార్ వివరాల గోప్యతపై స్పందిస్తూ ఎక్కడ ఆధార్‌ను ఉపయోగించాలి?.. ఎక్కడ ఉపయోగించకూడదన్న అవగాహన ఉంటే ఆధార్ వివరాలు చాలావరకు భద్రంగానే ఉంటాయన్నారు.

సలహా

వెన్నెముక చికిత్సలో ఆధునిక సర్జరీలు



లాంబార్ డిస్క్ డిసీజ్ చాలా నొప్పి కలిగించి బలహీన పరిచే వెన్నెముకకు సంబంధించిన సమస్య. అప్పుడే పుట్టిన పిల్లల్లో డిస్క్‌లు చాలా మృదువుగా 88 శాతం నీటితోనే ఉంటాయి. క్రమంగా నీటి శాతం తగ్గుతూ వస్తుంది. నెమ్మదిగా 40 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి డిస్క్‌ల్లోని నీటి పరిమాణం 50-60 శాతానికి తగ్గిపోతుంది. అందువల్ల డిస్క్ బయటి భాగం గట్టిపడుతుంది. ఫలితంగా డిస్క్ వెలుపలి వైపు సన్నని పగుళ్లు ఏర్పడుతాయి. ఈ పగుళ్లను అన్యూలార్ టేర్స్ అంటారు. ఇవి చాలా సన్నగా ఉన్నప్పుడు వాటంతటవే తిరిగి కోలుకుంటాయి. కానీ ఒక్కోసారి ఈ పగుళ్లు కాస్త పెద్దగా ఉంటాయి. ఫలితంగా లోపలి వైపు ఉన్న మృదువైన భాగం ఈ పగుళ్ల ద్వారా బయటకు వస్తుంది. దీన్ని డిస్క్ ప్రొలాప్స్ అంటారు. అయితే డిస్క్‌లోపలి భాగానికి పెద్దగా నొప్పి ఉండదు కానీ దాని పరిసరాల్లో ఉండే భాగంలో వాపు ఏర్పడడం వల్ల ఆ భాగంలోని నాడుల మీద ఒత్తిడి పెరుగుతుంది.

లక్షణాలు

- లాంబగో - డిస్క్ పై భాగంలో ఏర్పడిన పగుళ్ల వల్ల కేవలం ఆభాగంలోని వెన్నులో నొప్పి రావడం
- సయాటికా- డిస్క్ ప్రొలాప్స్ వల్ల సయాటికా నాడి మీద ఒత్తిడి పడడం వల్ల ఆ నాడి సాగినంత దూరం నొప్పిగా ఉంటుంది. సాధారణంగా నడుము నుంచి కాళ్లకు నొప్పి పాకుతున్నట్టుగా ఉంటుంది.
- కాడా ఎక్వినా - నాడి మీద ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆ నాడి సాగినంత దూరం చర్మం స్పర్శ కోల్పోతుంది. ఒక్కోసారి కండరాల్లో కూడా బలహీనత రావచ్చు. సమస్య మరీ తీవ్రంగా ఉన్నప్పుడు మల మూత్ర విసర్జన మీద కూడా అదుపు కోల్పోతారు. ఇలాంటి వారికి వెంటనే సర్జరీ అవసరమవుతుంది.

డిస్క్ సమస్యల నిర్ధారణ

- డిస్క్ సమస్యలను నిర్ధారించడానికి ఎంఆర్ఐ ఇమేజింగ్ అన్నింటికంటే ముఖ్యమైన పరీక్ష. ఈ పరీక్ష ద్వారా కేవలం ఆకారంలో వచ్చిన మార్పులు మాత్రమే కాదు అంతర్గత మార్పులను కూడా గుర్తిండం సాధ్యపడుతుంది. అంతేకాదు వెన్నెముకలోని లోపాలు, ట్యూమర్ల వంటి వాటిని కూడా నిర్ధారించడం సాధ్యపడుతుంది.

చికిత్స

- డిస్క్ ప్రొలాప్స్ సమస్యకు చికిత్సగా రెండు రకాల సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ ఓపెన్ మైక్రోసర్జరీ, ఎండోస్కోపిక్ డిసెక్టమీ. రెండో సర్జరీ విధానం అత్యాధునికమైంది. ఇది చిన్న కోతతో చేసేది కాబట్టి దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయి.
- సంప్రదాయ సర్జరీ విధానంలో వెన్నెముక భాగంలో పెద్ద కోత పెట్టాల్సి వస్తుంది. ఫలితంగా పరిసరాల్లోని కండరాలు, నాడులకు నష్టం వాటిల్లవచ్చు. ఎండోస్కోపిక్ డిసెక్టమీ విధానంలో కేవలం లోకల్ ఎనస్థీషియా సరిపోతుంది. చర్మం మీద పెద్దగా కోత అవసరం లేదు కాబట్టి కండరాలకు కూడా పెద్దగా నష్టం జరగదు. ఎముకలు తొలగించాల్సిన అవసరం ఉండదు. నాడులకు కూడా ఎలాంటి నష్టం జరుగదు. సర్జరీ తర్వాత ఎలాంటి అనిశ్చితి ఉండదు. సర్జరీ తర్వాత వెన్ను నొప్పి కూడా ఉండదు. సర్జరీ జరుగుతున్న సమయంలో కూడా పేషెంట్ పూర్తి స్థాయిలో మెలుకువగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాదు హాస్పిటల్‌లో ఉండాల్సిన అవసరం కూడా లేదు. అదే రోజు ఇంటికి వెళ్లిపోవచ్చు. అందుకే దీన్ని బ్యాండ్ - ఎయిడ్ సర్జరీ అని కూడా అంటారు.



డాక్టర్ సుకుమార్ సూర
ఎండోస్కోపిక్ అండ్ మినిమల్లీ ఇన్వేసివ్ న్యూరోసర్జన్
స్టార్ హాస్పిటల్స్
హైదరాబాద్
7097060006

మోకాళ్లు మొరాయిస్తుంటే.. గుళ్లూ..గోపురాలా?

ఎంత సేపూ ఇంటి నుంచి ఆఫీసుకు, ఆఫీసు నుంచి ఇంటికి జీవన గమనం అంటే ఇదేనా ? ఎప్పుడో ఇప్పుడో ఎత్తైన కొండల మీదికి వెళ్లాలనిపిస్తుంది. ఆ కొండల మీదున్న గుడికి వెళ్లి, ఆ దివ్యదర్శనం చేసుకోవాలనిపిస్తుంది. ఎన్ని బైకులున్నా, ఎన్ని కార్లున్నా, అన్నీ గుట్టకింద ఆగిపోయేవే కదా! ఆ తర్వాత మాటేమిటి? ఏ ప్రత్యేక వసతులు ఉన్న చోట తప్ప మిగతా చోట్లంతా కాలి నడకే కదా శరణ్యం. అయితేనేమిటి? కొందరు అవలీలగా మెట్లెక్కి దిగేస్తుంటారు. కానీ, మోకాళ్ల నొప్పులు ఉన్న వారి మాటేమిటి? గుట్టదాకా వెళ్లి మాత్రం ఫలమేముంది అనుకుని, అసలు ప్రయాణం విరమించుకోవడమే కదా పరిష్కారం. ఎవరికైనా గుళ్లూ గోపురాలు సందర్శించాలన్న కోరిక ఉంటే సరిపోదు కదా! అందుకు అనుగుణంగా శరీరాన్ని నిలబెట్టుకోవాలి. పుట్టినప్పుడు దాదాపు అందరూ ఆరోగ్యంగానే ఉంటారు. అయితే పోనుపోను పరిస్థితి మారిపోతుంది. తీసుకునే ఆహార పానీయాల్లోని లోపాలు, వ్యాయామ లోపాలు, లేదా శారీరక మానసిక ఒత్తిళ్లు, నాడీ వ్యవస్థను, ఆ తర్వాత కండరాల్నీ, ఎముకల్నీ దెబ్బతీస్తాయి. అందులో భాగంగానే కీలు కీలూ దెబ్బ తినిపోతుంది. మిగతా కీళ్ల మాట ఎలా ఉన్నా, మోకాళ్ల కీళ్లు దెబ్బ తింటే జీవితాన్ని ఎవరో కూలదోసినట్లు అనిపిస్తుంది. లేచినా కూర్చున్నా భరించరాని నొప్పి బాధిస్తుంది. అయితే దీర్ఘకాలికమైన నొప్పి వాతాన్ని పెంచుతుంది. ఆ పెరిగిన వాతం నొప్పిని పెంచుతుంది. ఇదొక విషవలయం. అయితే ఈ వాతం పలురకాల వ్యాధులకు మూలమవుతుంది.

ఎందుకిలా?

ఒకటో రెండో కాదు, మోకాళ్లనొప్పులకు దారి తీసే కారణాలు అనేకం. కారణమేదైనా ప్రమాదాల్లో గాయపడే విషయాల్ని వదిలేస్తే మిగతా అన్నింటికీ మౌలికంగా వాతరోగాలే కారణం. కాకపోతే...



వాతాలు అనేకం. అందువల్ల మోకాళ్లనొప్పుల వెనుక ఏ వాతం ఉందో తెలుసుకోవాలి. ఎన్ని రకాల వ్యాధులు కలిసి ఈ సమస్యకు కారణమయ్యాయో, సమస్య తీవ్రత ఎంతో.., రోగి స్థితి ఏమిటో ఇవన్నీ తెలుసుకుని వైద్య చికిత్సలు చేయాలి. వాటి గురించి అవసరమే లేదనుకునే ఆధునిక వైద్యుల వద్దకు వెళితే ఏమవుతుంది? ముందు పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ అంటూ కొంత కాలం గడిపి ఆధునిక వైద్యులు చివరికి సర్జరీకే సిద్ధం చేస్తారు. ప్రమాదాలు జరిగి ఎముకలు విరిగినప్పటి మాట వేరు. మిగతా అన్ని పరిస్థితుల్లో ఆయుర్వేద వైద్య చికిత్సలతో తగ్గే అవకాశం ఉంది. ఎలాంటప్పుడు సర్జరీలు ఎందుకు? వాస్తవానికి అరిగిన కీళ్లకు పునరుత్తేజాన్నిచ్చే ఆయుర్వేద ఔషధాలెన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అసలు దోషాన్ని స్పష్టంగా గుర్తించి తగిన ఔషధాలు ఇస్తే సర్జరీ లేకుండానే కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

ఆయుర్వేద వైద్య విశిష్టత

మోకాళ్ల నొప్పులు అనగానే అది కేవలం ఎముకలకు సంబంధించిన అస్థి ధాతు సమస్యగానే అందరూ అనుకుంటారు. ప్రత్యక్షంగా కనిపించే కారణం అదే అయినా, మోకాళ్ల నొప్పులు రావడం వెనుక మొత్తం సప్తధాతువుల సమస్యలు ఉంటాయి. అందుకే విడిగా ఒక్క అస్థిదాతువుకు చికిత్స చేయడం దగ్గరే ఆగిపోకుండా ఆయుర్వేదం సప్తధాతువులనూ, మొత్తం శరీర వ్యవస్థనూ జీవద్వంతంగా, పరిపూరణ చైతన్యవంతంగా మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. తాత్కాలిక ఉపశమన చికిత్సల జోలికి వెళ్లకుండా, శాశ్వత చికిత్సలే పరమావధిగా నడుస్తుంది. అందుకే ఒక వ్యక్తి మోకాళ్ల నొప్పుల కోసమే వచ్చినా, మోకాళ్లనొప్పులతో పాటు అతన్ని ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న మరెన్నో ఇతర రుగ్మతలు కూడా ఈ ఆయుర్వేద చికిత్సలో నయమవుతాయి. ఎవరికైనా శరీరంలోని అవయవాలన్నీ సఖ్యంగా పనిచేస్తున్నప్పుడు దాని విలువ బోధపడదు. ఆ అవయవాల్లో ఏదో ఒకటి కుంటుపడినప్పుడు ఎంత నష్టపోయామో తెలుస్తుంది. ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే, మోకాళ్ల నొప్పులు వచ్చాయిూ అంటే సమస్య మోకాళ్లలో మాత్రమే ఉందని కాదు. మోకాళ్ల నొప్పులకు కారణమైన వాతం మునుముందు మరెన్నో వ్యాధులకు బీజం వేస్తుంది. అందుకే ఆయుర్వేదం అన్ని రోగాలకూ మూలభూతంగా ఉండే వాతాన్ని నియంత్రిస్తుంది. ఆ క్రమంలో త్రిదోషాల్లోని మిగతా రెండు అంటే పిత్తం, కఫం కూడా దారికొస్తాయి. ఈ సమస్థితి మోకాళ్ల బాధలనుంచే కాదు జీవన బాధలనుంచే విముక్తి చేస్తుంది.



డా॥ టి.ఎల్. శ్రీనివాస్
సహజ ఆయుర్వేదిక్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్
9160 994 455
9160 994 456
హైదరాబాద్, హన్మకొండ, రాజమండ్రి, నెల్లూరు, విజయవాడ, అనంతపురం, జోగిపేట

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.6	11.9
సంగారెడ్డి	32.4	12.1
వికారాబాద్	34.6	12.4
నాగర్‌కర్నూల్	34.6	12.4
కామారెడ్డి	31.0	12.7
మహబూబ్‌నగర్	35.5	12.7
మేడ్చల్	34.9	13.2
యాదాద్రి భువనగిరి	34.6	13.4
మంచిర్యాల	34.7	13.5
రాజన్న సిరిసిల్ల	34.6	13.6
రంగారెడ్డి	34.6	13.6
సిద్దిపేట	35.7	13.7
భద్రాద్రి కొత్తగూడెం	34.9	13.8
నిర్మల్	34.8	14.1
ఆదిలాబాద్	32.6	14.2
మెదక్	32.7	14.2
జయశంకర్ భూపాలపల్లి	34.6	14.3
నిజామాబాద్	34.4	14.6
వరంగల్ రూరల్	33.3	14.7
జగిత్యాల	34.6	14.7
నల్లగొండ	34.9	14.7
జనగామ	34.4	14.9
మహబూబాబాద్	35.2	14.9
హైదరాబాద్	35.3	15.3
జోగుళాంబ గద్వాల	35.4	15.5
వరంగల్ అర్బన్	34.6	15.6
పెద్దపల్లి	34.6	15.6
ఖమ్మం	34.8	15.7
కరీంనగర్	34.9	15.9
సూర్యాపేట	35.6	16.4
వనపర్తి	33.5	16.4

మమ్మేలు ఏలికా.. ఎములాడ రాజన్నా!



మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్నందున వేములవాడ శ్రీ పార్వతీ రాజ రాజేశ్వర స్వామివారి సన్నిధి బుధవారం భక్తులతో రద్దీగా కనిపించింది. ఆలయ ధర్మగుండంలో భక్తులు స్నానాలాచరించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆర్జిత సేవలను రద్దు చేశారు. సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.
- వేములవాడ కల్చరల్

ప్రగతి నిరోధకులకు బుద్ధి చెప్పాలి

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- అన్ని వర్గాల అభ్యున్నతితోనే బంగారు తెలంగాణ : స్పీకర్ సిరికొండ
- సంస్కరణల్లో తెలంగాణ ఆదర్శం: ఈటల
- పేదల అవసరాలు తీర్చుతున్న ప్రభుత్వం : తుమ్మల
- వరంగల్ అర్బన్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు భూమిపూజ



వరంగల్ అర్బన్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు భూమి పూజ చేసిన అనంతరం సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, చిత్రంలో స్పీకర్ మధుసూదనాచారి, మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, చల్లధర్మారెడ్డి, అరూరి రమేశ్, మేయర్ నరేందర్

వరంగల్ ప్రధాన ప్రతినిధి/నమస్తే తెలంగాణ : ఆనాడు తెలంగాణను రాకుండా అడ్డుపడ్డ శక్తులే ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధినీ అడ్డుకుంటున్నాయని, వాటికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. అభివృద్ధిని ఓర్వలేక ప్రతి పనినీ రాజకీయ కోణంలో చూస్తూ అడ్డుపడుతున్నాయని విపక్షాలపై ధ్వజమెత్తారు. రూ.30 కోట్లతో నిర్మించనున్న వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. సీఎం కేసీఆర్ తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తూ కాళేశ్వరం, దేవాదుల, పాలమూరు ఎత్తిపోతల పథకం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. చరిత్రను తిరగరాస్తున్న పాలనాదక్షుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఒకవైపు దీర్ఘకాలిక దృష్టితో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే మరోవైపు విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తోన్న ఏకైక సీఎం కేసీఆరేనని చెప్పారు. మరో ఆర్నెళ్లలో మిషన్ భగీరథ పనులు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు.ఇప్పటి వరకు మనం కాకతీయుల పాలనావైభవాన్ని గురించి చెప్పుకున్నామని, మన తర్వాత తరం వెయ్యి ఏండ్లు అయినా తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ పాలనా వైభవాన్ని గొప్పగా చెప్పుకుంటుందని అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సంస్కరణల్లో దేశానికే ఆదర్శవంతమైన పాలన సాగుతున్నది తెలంగాణలో మాత్రమేని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభు త్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 200 పైచిలుకు సంస్కరణలు ప్రవేశపెట్టి, వాటిని అమలు చేస్తూ ప్రజల కష్టసుఖాల్లో ఉద్యమ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటి దాకా చరిత్ర గురించి చెప్పుకున్నాం. ఇప్పుడు చరిత్రలో మన గురించి గొప్పగా చెప్పుకునే విధంగా సీఎం కేసీఆర్ పాలిస్తున్నారని చెప్పారు. ఊహకు అందని ఆచరణ చేస్తున్న గొప్ప దార్శనికుడు సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలోని పాత జిల్లా కేంద్రాలు, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ప్రస్తుతం 26 జిల్లాల్లో కలెక్టరేట్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మ, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండా సురేఖ, చల్లా ధర్మారెడ్డి, వొడితల సతీశ్‌కుమార్, మేయర్ నన్నపునేని నరేందర్, కలెక్టర్ ఆమ్రపాలి కాట, సీపీ సుధీర్‌బాబు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ శృతి ఓఝా తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో తల్లుల దర్శనానికి తరలివచ్చిన భక్తులజనం

మేడారంలో మండమెలిగె పండుగ

- సిద్ధబోయిన, చందా, కాక వంశీయుల పూజలు
- మహాజాతర ప్రారంభమైనట్టు ప్రకటన
- తల్లుల సన్నిధిలో ఎనిమిది లక్షల మంది

జయశంకర్ జిల్లా ప్రతినిధి/ నమస్తే తెలంగాణ : మహాజాతర సందర్భంగా మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరాల్లో సిద్ధబోయిన, చందా, కాక వంశీయులు బుధవారం మండమెలిగె పండుగను ఘనంగా నిర్వహించారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను, కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకురావడం మినహా మిగతా పూజాకార్యక్రమాలు పూర్తికావడంతో వనదేవతల మహాజాతర ప్రారంభమైనట్టు పూజారులు ప్రకటించారు. తొలుత పూజారులు సమ్మక్క, సారలమ్మ మందిరాలకు చేరుకొని నీటితో శుభ్రం చేశారు. సమ్మక్క తల్లి గుడిలోని గద్దె కు అలుకు పూసి కుంకుమ, పసుపు, పిండితో ముగ్గులు వేసి అలంకరించారు. సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య, సారలమ్మ పూజారి కాక సారయ్య నియమనిష్ఠలతో అమ్మవార్ల పూజామందిరాలకు చేరుకుని పూజాసామగ్రిని శుద్ధి చేశారు. అనంతరం పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంట్లోని అడేరాలను డోలువాయిద్యాలతో తీసుకొని సమ్మక్క పూజా మందిరానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి నుంచి పసుపు, కుంకుమ, పాలు, కల్లు, నీళ్లను తీసుకుని డోలువాయిద్యాలతో పోచమ్మ ఆలయానికి చేరుకొని, అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించి, కల్లు సాకతో పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి వద్ద పూజలు జరిపారు. అంతకుముందు యువకులు అడవికి వెళ్లి బూర్క చెట్టుకు చెందిన ధ్వజస్తంభాలు తెచ్చారు. డోలు వాయిద్యాల నడుమ మునీందర్ ఇంటి నుంచి మామిడి ఆకులు, ఎండు మిరపకాయలు, జీడిగింజలతో ఏర్పాటు చేసిన తోరణాలను తెచ్చి గద్దెల ముఖ ద్వారానికి కట్టారు. గ్రామానికి దుష్టశక్తులు రాకుండా పూజారులు మునీందర్, కృష్ణ య్య, లక్ష్మణ్‌రావు కల్లు, పాలు, నీళ్లతో పొలి పోసి మండమెలిగె పండుగను నిర్వహించారు. రాత్రి ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణ య్య, కాక సార య్య అమ్మవార్ల గద్దె ల వద్దకు చేరుకుని పూజలు చేశారు. రాత్రంతా పూజారులు జాగారం చేసి గురువారం ఉదయం గ్రామ పెద్దలు, అమ్మవార్ల పూజారులు ఒకరికొకరు సాకను ఇచ్చి పుచ్చుకుంటారు. బుధవారం 8 లక్షల మంది తల్లులను దర్శించుకున్నారు.





మండమెలిగె పండుగ సందర్భంగా బుధవారం మేడారంలో పొలిపోస్తున్న పూజారులు

చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి

మంత్రి ఈటల రాజేందర్



కరీంనగర్ జిల్లా పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులో డీబీఎం-17 ఉపకాలువను పరిశీలిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్ రూరల్: చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సారెస్పీ అధికారులను ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులో కాకతీయ ప్రధాన కాలువ ఉప కాలువ డీబీఎం-17 షట్టర్లను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 గంటల విద్యుత్ వస్తున్నదనీ అవసరం లేకున్నా మోటర్లను నడుపవద్దని రైతులకు సూచించారు.




వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంటలో పల్లె ప్రగతి యాత్రలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీఎం కేసీఆర్‌తోనే సుపరిపాలన

'పల్లె ప్రగతి' అభినందనీయం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నెక్కొండ : సీఎం కేసీఆర్ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ, పత్తిపాక, దీక్షకుంట, ముదిగొండ, నెక్కొండ గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షకుంట గ్రామంలో జరిగిన గ్రామసభకు తుమ్మల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయని రెండు, మూడునెలల్లో ఇంటింటికీ శుద్ధి జలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, నెక్కొండ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి

పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు

పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్ : పేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని కొండాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఇండ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాలకుర్తి నియోజక వర్గానికి సీఎం కేసీఆర్ సహకారంతో 2900 డబుల్‌బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయించినట్టు చెప్పారు. ఇండ్ల నిర్మాణాల కోసం ఇసుక సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని 10గ్రామాల్లో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం

కామారెడ్డి, బాన్సువాడ/నమస్తే తెలంగాణ : ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ వివిధ పథకాలు ప్రవేశ పెడుతున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన కామారెడ్డి జిల్లా దేవునిపల్లిలో 50 పడకల ప్రసూతి ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ చేశారు. జిల్లా ఏరియా దవాఖానలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. బాన్సువాడలో సుమారు కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. రూ. 17 కోట్లతో నిర్మించనున్న వంద పడకల ప్రసూతి వైద్యశాల భవనం, రూ.80 లక్షలతో నిర్మించే బ్లడ్ బ్యాంకు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. దేవునిపల్లిలోని పడకల ప్రసూతి దవాఖానను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. ఇప్పటికే సిద్దిపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో స్కానింగ్ సెంటర్లను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ దవాఖానల్లో డయాగ్నోస్టిక్స్ సేవలను ప్రారంభిస్తామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గవర్నర్ అభినందిస్తే ప్రతిపక్షాలు చివరకు గవర్నర్ కూడా విమర్శించే స్థాయికి దిగజారడం దురదృష్టకరమన్నారు. ఆశ వర్కర్లకు వచ్చే నెల నుంచి ఆన్‌లైన్ ద్వారా 6 వేల రూపాయలను ఖాతాల్లో జమ చేస్తామని త్వరలోనే శుభవార్త వింటారన్నారు.



బాన్సువాడలో ప్రసూతి దవాఖానకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు లక్ష్మారెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి

300 పడకలుగా పెంచాలి : మంత్రి పోచారం

కామారెడ్డి ఏరియా దవాఖానను 300 పడకలుగా మార్చాలని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కోరారు. లక్ష్మారెడ్డి వైద్యశాఖ మంత్రిగా బాగా రాణిస్తున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ పదే పదే మంత్రివర్గ సమావేశాల్లో గుర్తు చేస్తారని అన్నారు. అమ్మ ఒడి ద్వారా జిల్లాకు 8 వాహనాలు వచ్చాయన్నారు. ప్రభుత్వ పథకాలు బాగున్నాయని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు.



నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న జీఎం వినోద్‌కుమార్ యాదవ్

మన్మాడ్ నుంచి డోన్ వరకు డబుల్ లైన్

దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్

ఎల్లమ్మగుట్ట/నవీపేట్/కామారెడ్డి/బాసర: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మరో నాలుగేళ్లలో ప్రధాన మార్గాలను డబుల్ లైన్లుగా మార్చడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లుగా మార్చే పనులు పూర్తి చేస్తామని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. నిజామాబాద్, నవీపేట్,కామారెడ్డి, బాసర స్టేషన్లను బుధవారం ఆయన సందర్శించారు. ఇందూరు రైల్వేస్టేషన్‌లో రన్నింగ్‌రూమ్, రైల్వే పోలీస్ ఫోర్స్ నూతన వంటగదిని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మన్మాడ్ నుంచి కర్నూల్ జిల్లాలోని డోన్ వరకు ఎలక్ట్రికల్ లైన్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నట్టు చెప్పారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం త్వరలో ఉచిత వైఫై సేవలు ప్రారంభిస్తామన్నారు. ఇందూరు రైల్వేస్టేషన్‌లో ఫ్లైఓవర్‌లతో పాటు నాలుగు ఎస్కలేటర్లను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌ను నిజామాబాద్ వరకు పొడిగిస్తామన్నారు. బాసరలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపే విషయమై సమయపాలన చూసి నిర్ణయిస్తామని చెప్పారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతున్నట్టు టీఎస్‌డీపీఎస్ (తెలంగాణ స్టేట్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సొసైటీ) నివేదిక వెల్లడించింది. చలిగాలుల తీవ్రత తగ్గడం, పొడి వాతావరణం ఉండటంతో ఉష్ణోగ్రతలు పెరిగినట్టు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. రానున్న మూడు రోజులు ఇదే వాతావరణ పరిస్థితుల ఉంటాయని తెలిపారు. చాలా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో చలి తీవ్రత కొనసాగుతున్నది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే..అత్యల్పంగా కొమురంభీం-ఆసిఫాబాద్‌లో 11.9 డిగ్రీలు నమోదైంది. ఆదిలాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 14.2 డిగ్రీలకు చేరినట్టు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా సిద్దిపేటలో 35.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

'ఖని' శివారులో ఆదిమానవుని అవశేషాలు



రాతి అవశేషాలు

ఫెర్టిలైజర్‌సిటీ : పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గౌతమినగర్ శివారులో ఆది మానవుడు ఉపయోగించిన రాతి మూలాలు, వాటి అవశేషాలు లభ్యమయ్యాయి. రామగిరి మండలం బేగంపేటకు చెందిన సముద్రాల సునిల్ చారిత్రాక కట్టడాలు, వాటి అవశేషాలు, ఆది మానవుని అవశేషాలపై రెండేండ్లుగా పరిశోధన చేస్తున్నారు. పెద్దపల్లికి చెందిన ప్రముఖ చరిత్రకారుడు ఠాకూర్ రాజారాం సింగ్ రాసిన పలు గ్రంథాలను ఆధారంగా చేసుకొని మాతంగి కాలనీ, గౌతమినగర్ శివారులో ఈ అవశేషాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు సుమారు 15వేల ఏండ్లకు పూర్వం పాత రాతి యుగం, కొత్త రాతి యుగం మధ్యలో జంతువుల తోలు వలచడానికి, వాటి మాంసాన్ని కోయడానికి, జంతువులను చంపడానికి వాడే రాతి ఆయుధాల అవశేషాలు, వాడే ముడి రాతి ఆయుధాలను ఆయన వెలుగులోకి తెచ్చారు. తన పరిశోధనల ఫలితంగా మహారాష్ట్రలోని డెక్కన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు రీసెర్చ్ స్కాలర్లు ఇక్కడకు వచ్చి, వాటిని తీసుకెళ్లి పరిశోధనలు నిర్వహిస్తూ పాతరాతి యుగం నాటివని తేల్చారని చెప్పారు. ఇక్కడ శివారులో నాలుగున్నర ఎకరాల్లో ఇవి ఉన్నాయన్నారు. ఈ అవశేషాలు రాముని గుండాలు, గోలివాడ, లింగాపూర్, బ్రాహ్మణపల్లి పరిసరాల్లో ఉన్నట్టు తమ పరిశోధనలో తేలిందన్నారు.

గుండెపోటుతో నమస్తే తెలంగాణ విలేకరి మృతి



కడెం గణేశ్ (ఫైల్)

నకిరేకల్ : నల్లగొండ జిల్లా నకిరేకల్ రూరల్ నమస్తే తెలంగాణ విలేకరి కడెం గణేశ్ (28) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం 8 గంటల సమయంలో ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు అతడిని నకిరేకల్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించాడు. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన గణేశ్ కుటుంబం కొన్నేళ్లుగా నకిరేకల్‌లో నివాసముంటుంది. వారం రోజుల క్రితమే అతను నమస్తే తెలంగాణ దినపత్రికలో రూరల్ విలేకరిగా నియమితులయ్యారు.

నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

పాలకవీడు : తెలంగాణలోని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం నుంచి ప్రారంభంకాన్నది. 25, 26, 27 తేదీల్లో సైదన్న దర్గా ఉర్సును నిర్వహిస్తారు. 25న ఉదయం సైదులు బాబా సమాధుల చుట్టూ కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభిస్తారు. 26న గంధోత్సవం నిర్వహించనున్నారు. 27న ఉదయం ప్రత్యేక దర్శనాల అనంతరం శనివారం సాయంత్రం దీపారాధనతో దర్గా ఉత్సవాలను ముగిస్తారు.



పంచ నారసింహ క్షేత్రమైన యాదాద్రి విస్తరణ పనులు వేగం పుంజుకున్నాయి. గర్భాలయ సెంట్రింగ్ పనులు చురుకుగా సాగుతున్నాయి..

జనసేన సమావేశంలో తొక్కిసలాట

రోడ్‌షో బందోబస్తులో విరిగిన ఎస్సై కాలు



ఖమ్మం సిటీ: జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీహీరో పవన్‌కళ్యాణ్ బుధవారం ఖమ్మంజిల్లా కేంద్రంలో నిర్వహించిన మూడుజిల్లాల కార్యకర్తల సమావేశంలో తొక్కిసలాట చోటుచేసుకున్నది. కుర్చీలు, టేబుళ్లు విరిగాయి. భారీకేడ్లను తోసుకుంటూ అభిమానులు, జనసేన కార్యకర్తలు ముందుకెళ్లారు. మీడియా కవరేజ్‌కు వెళ్లిన పలువురు జర్నలిస్టులూ కిందపడిపోయారు. అప్రమత్తమైన పోలీసులు పవన్‌కల్యాణ్‌కు ఇబ్బందులు కలుగకుండా అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ జనసందోహంలో దొంగలు తమ చేతికి పనిచెప్పడంతో పలువురి జేబులకు చిల్లుపడింది. అంతకుముందు జరిగిన రోడ్‌షోలో బందోబస్తు నిర్వహిస్తున్న ఖమ్మం రూరల్ ఎస్సై చిరంజీవి కాలుపై నుంచి పవన్‌కల్యాణ్ కారు ఎక్కిపోవడంతో మడమ వద్ద విరిగింది. విషయం తెలుసుకున్న పవన్‌కళ్యాణ్ ఎస్సైని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రావాలని సూచించారు. ఈ రోడ్‌షోలో తల్లాడ వద్ద పవన్ కారుపై ఓ గుర్తుతెలియని వ్యక్తి చెప్పు విసరడం చర్చనీయాంశమైంది.

కొత్తగూడెంలో పవన్‌కల్యాణ్ రోడ్‌షో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోకు అభిమానులు భారీగా హాజరయ్యారు.

వృద్ధురాలి నిరసన దీక్ష



పెద్దపల్లిలో దీక్ష చేస్తున్న వృద్ధురాలు రాజమ్మ

పెద్దపల్లి, నమస్తే తెలంగాణ: దత్తత కుమారుడు ఆదరించడం లేదంటూ ఓ వృద్ధురాలు ఆందోళనకు దిగిన సంఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం చోటుచేసుకున్నది. వివరాలు.. పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన మామిడి రాజమ్మ-భూమయ్యకు సంతానం లేకపోవడంతో పదమూడు ఏండ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఈదునూరి కిరణ్‌ను దత్తత తీసుకున్నారు. 16 నెలల క్రితం రాజమ్మ భర్త భూమయ్య మృతి చెందాడు. అదే అదునుకు భావించిన కిరణ్ వృద్ధురాలి పేరుమీద ఉన్న 2.15 ఎకరాల భూమిని బలవంతంగా తనపేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇప్పుడు వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుండగా కిరణ్ తల్లిని పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై పెద్దమనుషులను కలిసినా న్యాయం జరుగడం లేదని రాజమ్మ వాపోయింది. తన దత్తత కుమారుడు కిరణ్ ఆదరించి న్యాయం చేసే దాకా దీక్ష కొనసాగిస్తానని ఆమె మీడియాముందు విలపించింది.

14వసారి..

ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఫెదరర్

స్విస్ దిగ్గజంతో చుంగ్ పోరు

మహిళల సెమీస్‌లో కెర్బర్, హలెప్



36 ఏండ్ల వయసులోనూ వన్నెతగ్గని జోరు...అగ్రశ్రేణి ఆటగాళ్లంతా ఇంటిదారి పడుతున్నా..తనదైన ఆటతీరుతో ఆస్ట్రేలియా ఓపెన్‌లో రోజర్ ఫెదరర్ అదురగొడుతున్నాడు..క్వార్టర్స్‌లో సునాయాస విజయంతో సెమీస్‌లో అడుగుపెట్టాడు.. తొలి రౌండ్ నుంచి సెమీస్ వరకు ఒక్క సెట్ కూడా ఓడిపోలేదంటే ఈ స్విస్ దిగ్గజం ఆటతీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తనకు కలిసొచ్చిన హార్డ్ కోర్టులో 20వ టైటిల్ దిశగా కదులుతున్నాడు..

మెల్‌బోర్న్: డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ రికార్డు స్థాయిలో ఆస్ట్రేలియా ఓపెన్ సెమీఫైనల్ చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో 7-6 (7/1), 6-3, 6-4తో బెర్డిచ్‌పై విజయం సాధించి 14వ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌కు చేరుకున్నాడు. గ్రాండ్‌స్లామ్స్‌లో సెమీస్‌కు చేరడం ఈ స్విట్జర్లాండ్ దిగ్గజానికి ఇది 43వ సారి, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఓవరాల్‌గా ఇప్పటి వరకు 105 మ్యాచ్‌లు ఆడితే 92సార్లు గెలిచాడు. శుక్రవారం జరుగనున్న సెమీఫైనల్లో ఫెదరర్, కొరియన్ కుర్రాడు చుంగ్‌తో తలపడుతాడు. బెర్డిచ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఫెదరర్ ఆద్యంతం ఆకట్టుకున్నాడు. తొలి సెట్‌లో ఒకదశలో 2-5తో వెనుకబడిన ఈ రెండో సీడ్ దిగ్గజం..అద్భుతమైన బ్యాక్ హ్యాండ్ షాట్లతో తిరిగి పుంజుకున్నాడు. అయితే ఫెదరర్ చేసిన డబుల్ ఫాల్ట్‌ను సొమ్ము చేసుకోవడంలో బెర్డిచ్ విఫలమయ్యాడు. ఈక్రమంలో తొలి సెట్ టై బ్రేకర్‌కు దారి తీయగా..పదునైన డ్రాప్ షాట్లతో ఫెదరర్ సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో సెట్ ఆరంభంలోనూ బెర్డిచ్ ఆధిక్యం పొందగా..ఫెదరర్ తిరుగులేని బ్యాక్ హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థిని ఖంగుతినిపించాడు. మూడో సెట్‌లోనూ బెర్డిచ్ సర్వీస్‌లను వరుసగా మూడు సార్లు బ్రేక్ చేసి విజయం సొంతం చేసుకున్నాడు.



హలెప్

ఇక మరో పురుషుల క్వార్టర్ ఫైనల్లో కొరియా సంచలనం చుంగ్ 6-4, 7-6 (7/5), 6-3తో సాండ్‌గ్రెన్‌పై గెలిచి సెమీస్‌లో ఫెదరర్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ హలెప్ (రొమేనియా) 6-3, 6-2తో ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్)పై... కెర్బర్(జర్మనీ) 6-1, 6-2తో కీస్(యూఎస్)పై గెలిచి సెమీ ఫైనల్లో అడుగుపెట్టారు. నేడు జరుగనున్న మహిళల సెమీఫైనల్స్‌లో వోజ్నియాకి, మెర్టెన్స్‌తో...హలెప్, కెర్బర్‌తో తలపడుతుంది.

సెమీస్‌లో బోపన్న జోడి

భారత ఆటగాడు రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీఫైనల్‌కు చేరాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బోపన్న, బబోస్ (ఇండో-హంగేరి) జోడి 6-4, 7-6 (7/5)తో కబల్, స్పియర్స్ (కొలంబియా-యూఎస్)జోడీపై విజయం సాధించారు. గంటా 15 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో బోపన్న జోడి చమటోడ్చి నెగ్గింది. రెండు సెట్లలోనూ ఈ జోడి విన్నర్ పాయింట్లను అధికంగా సాధించి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నది. ఇక నేడు జరుగనున్న సాండర్స్,పోల్‌మన్ జోడి...మార్టినెజ్, మార్సెలో జోడీ మధ్య జరుగనున్న క్వార్టర్స్ విజేతతోబోపన్న జోడీ సెమీస్‌లో తలపడుతుంది.

మెదక్ జట్టును విజేతగా నిలుపుతాం

- ఫ్రాంచైజీ ఓనర్ జగన్మోహన్‌రావు

మెదక్: వచ్చే నెలలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరుగనున్న జీ వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ20 లీగ్ రెండోదశ పోటీలలో సత్తా చాటేందుకు పూర్తిగా సిద్ధమవుతున్నామని మెదక్ మావెరిక్స్ ఫ్రాంచైజీ యజమాని జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొంటున్న జట్టుకు స్పాన్సర్‌గా అక్షర ఇంటర్నేషనల్ సూల్ వ్యవహరిస్తుందన్నారు. కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ నోయల్ డేవిడ్‌ను ఎంపిక చేసినట్టు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల జట్టు పాల్గొంటున్న ఈ టోర్నీలో మెదక్ జట్టు విజేతగా నిలుస్తుందని జగన్మోహన్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

జట్టు నగేశ్, సురేశ్ , పండిత్ నాయక్, అబ్రార్, అర్బాజ్, మహేందర్, అజామ్, వినయ్, అఖిల్, బిల్లాల్ హుస్సేన్, గణేశ్, సయ్యద్ అజీజ్, మధు, సాహిర్ పాషా, సందీప్, ప్రణీత్‌రాజ్, అభిరత్‌రెడ్డి, సమిత్ రెడ్డి, సంతోష్‌గౌడ్, జయసూర్య, భగత్ వర్మ, హెచ్‌కే సింహ, యాష్ కపాడియా, మికిల్ జైస్వల్, మల్లికార్జున్.

భారత్.. అదే తీరు



కోహ్లీ (54)

తొలి ఇన్నింగ్స్‌లో 187 ఆలౌట్ ■ కోహ్లీ, పుజార అర్ధసెంచరీలు

■ దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6/1

వేదికలు మారుతున్నా.. విమర్శలు పెరుగుతున్నా.. భారత్ జట్టు ఆటతీరులో మాత్రం మార్పురావడంలేదు. పరిస్థితులు కఠినమని తెలిసినా.. వాటిని ఎదుర్కొనే సత్తా, సామర్థ్యం ఉన్నా.. ఆచరించడంలో మరోసారి ఘోరంగా విఫలమైంది. పచ్చని పచ్చిక వికెట్‌పై బుల్లెట్లలా దూసుకొచ్చే బంతులకు ఎదురొడ్డాల్సిందిపోయి.. వెన్ను చూపి వెనకడుగు వేసింది. ఫలితంగా వాండరర్స్‌లోనూ పాత కథనే పునరావృతం చేస్తూ తక్కువ స్కోరుకే చేతులెత్తేసింది.

జొహన్నెస్‌బర్గ్: ఎనిమిది మంది సింగిల్ డిజిట్.. ముగ్గురు డబుల్ డిజిట్... ఇందులో కెప్టెన్ కోహ్లీ (106 బంతుల్లో 54; 9 ఫోర్లు), పుజార (179 బంతుల్లో 50; 8 ఫోర్లు) అర్ధసెంచరీలు.. చివర్లో భువనేశ్వర్ (49 బంతుల్లో 30; 4 ఫోర్లు) స్ఫూర్తిదాయక పోరాటం.. స్థూలంగా బుధవారం ప్రారంభమైన మూడో టెస్టులో భారత్ ఆటతీరు ఇది. ఆతిథ్య బౌలర్ల దెబ్బకు మరోసారి కుదేలైన టీమ్‌ఇండియా తొలి రోజు తొలి ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 187 పరుగులకు కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 6 పరుగులు చేసింది. ఎల్గర్ (4 బ్యాటింగ్), రబడ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మార్క్రమ్ (2) నిరాశపర్చాడు. ఈ వికెట్ భువీకి దక్కింది. ప్రస్తుతం సఫారీ జట్టు 181 పరుగులు వెనుకబడి ఉంది.

ఓపెనర్లు మళ్లీ విఫలం..

వికెట్ మీద పచ్చిక ఉండటంతో భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. స్పిన్నర్ స్థానంలో నాలుగో పేసర్‌తో బరిలోకి దిగింది. మంగళవారం రాత్రి వర్షం కురువడం.. పిచ్ పరిస్థితులు బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో.. సఫారీ పేసర్లు ఆరంభం నుంచే నిప్పులు కురిపించాడు. ఫిలాండర్ తన తొలి ఓవర్ తొలి బంతికే రాహుల్ (0) దాదాపుగా ఔట్ చేసినంత పని చేశాడు. కానీ ఎలాగోలా బతికిపోయాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. సరిగ్గా నాలుగు ఓవర్ల తర్వాత విజయ్ (8) కూడా పెవిలియన్‌కు చేరడంతో టీమ్‌ఇండియా 13 పరుగులకే 2 వికెట్లు చేజార్చుకుంది. ఇక్కడి నుంచి పుజార, కెప్టెన్ కోహ్లీ ఆచితూచి ఆడటం మొదలుపెట్టారు. ఆరో ఓవర్‌లో పుజార ఎల్బీ అయినా.. డీఆర్‌ఎస్‌లో గట్టెక్కాడు. తొలి పరుగు చేయడానికి పుజార 54 బంతులు ఆడాడంటే అతను డిఫెన్స్‌కు ఎంత ప్రాధాన్యం ఇచ్చాడో అర్థమవుతున్నది. 21వ ఓవర్‌లో విరాట్ ఇచ్చిన క్యాచ్‌ను ఫిలాండర్ వదిలేశాడు. ఓవరాల్‌గా ఈ ఇద్దరు 45/2 స్కోరుతో లంచ్‌కు వెళ్లారు.



పుజార (50)

నిరాశపర్చిన రహానే

లంచ్ తర్వాత కోహ్లీ-పుజార కాస్త కుదురుకునే ప్రయత్నం చేశారు. 33వ ఓవర్‌లో మూడో స్లిప్‌లో డివిలియర్స్ క్యాచ్ వదిలేయడంతో కోహ్లీకి రెండో లైఫ్ లభించింది. అయినప్పటికీ అతను దూకుడుగానే ముందుకెళ్లాడు. దీంతో తొలి గంటలో భారత్‌కు 50 పరుగులు లభించాయి. ఈ క్రమంలో విరాట్ 101 బంతుల్లో కెరీర్‌లో 16వ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. వెంటనే 43వ ఓవర్‌లో ఎంగిడి వేసిన ఆఫ్‌సైడ్ బంతిని డ్రైవ్ చేయబోయి మూడోస్లిప్‌లో డివిలియర్స్‌కు చేతికి చిక్కాడు. ఈ ఇద్దరి మధ్య 84 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఓ ఎండ్‌లో పుజార నిలకడను చూపెట్టినా.. మూడు ఓవర్ల తర్వాత రహానేకు నోబాల్ రూపంలో లైఫ్ దొరికినా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. పుజారతో నాలుగో వికెట్‌కు 16 పరుగులు జత చేసి ఔటయ్యాడు. టీ విరామానికి టీమ్‌ఇండియా 114/4 స్కోరు చేసింది.

బౌలర్ల విజృంభణ

చివరి సెషన్‌లో సఫారీ బౌలర్లు మరింత రెచ్చిపోయారు. సింగిల్స్ తీయడానికి కూడా అవకాశం లేని బంతులు వేస్తూ కట్టడి చేశారు. అయినప్పటికీ ఎక్కువగా స్ట్రయికింగ్ తీసుకున్న పుజార మెల్లగా కదులుతూ 173 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. రెండోఎండ్‌లో కుదురుకోవడానికి పార్థివ్ (2)కు ఏమాత్రం అవకాశం లభించలేదు. సరిగ్గా ఇక్కడ నుంచి దక్షిణాఫ్రికా బౌలర్లు సంచలన బౌలింగ్‌తో చెలరేగిపోయారు. కేవలం 11 బంతుల తేడాలో పుజార, పార్థివ్, హార్దిక్ పాండ్యా (0)లను పెవిలియన్‌కు పంపి మ్యాచ్‌ను ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఓ దశలో 97/2 స్కోరుతో పటిష్టంగా కనిపించిన టీమ్ఇండియా ఒక్కసారిగా స్కోరు 144/7కు మారిపోయింది. అంటే 47 పరుగుల తేడాతో ఐదు కీలక వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో భువనేశ్వర్ కాసేపు ప్రతిఘటించాడు. షమీ (8), ఇషాంత్ (0), బుమ్రా (0 నాటౌట్)ను పక్కనబెట్టి ఎక్కువగా బ్యాటింగ్ చేస్తూ భారీ షాట్లు కొట్టాడు. రబడ 3 వికెట్లు తీశాడు.

ఈ స్కోరు 300లతో సమానం

ఇలాంటి కఠినమైన పిచ్‌లపై పరుగులు చేయడం చాలా సంతోషాన్నిచ్చింది. ఈ పిచ్‌పై 187 పరుగులు 300ల స్కోరుతో సమానం. తొలి ఇన్నింగ్స్‌లో ఇది మంచి స్కోరే. నేను ఇప్పటివరకు బ్యాటింగ్ చేసిన పిచ్‌ల కంటే ఇది చాలా కఠినంగా ఉంది. ఆరంభంలో నెమ్మదిగా, ఇప్పుడు మంచి బౌన్స్‌తో ఉంది. పగుళ్ల వల్ల బంతి గమనం చాలా భిన్నంగా ఉంది. ఓవరాల్‌గా కేప్‌టౌన్‌ను మించిపోయింది. మొత్తానికి మేం బ్యాటింగ్ బాగానే చేశాం. దక్షిణాఫ్రికాను తక్కువ స్కోరుకే కట్టడి చేస్తామనే నమ్మకం ఉంది. - పుజార

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) రబడ 8, రాహుల్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 0, పుజార (సి) డికాక్ (బి) పెహెల్‌కావో 50, కోహ్లీ (సి) డివిలియర్స్ (బి) ఎంగిడి 54, రహానే ఎల్బీడబ్ల్యు (బి) మోర్కెల్ 9, పార్థివ్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 2, పాండ్యా (సి) డికాక్ (బి) పెహెల్‌కావో 0, భువనేశ్వర్ (సి) పెహెల్‌కావో (బి) రబడ 30, షమీ (సి) రబడ (బి) ఫిలాండర్ 8, ఇషాంత్ (సి) డుప్లెసిస్ (బి) రబడ 0, బుమ్రా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు: 26, **మొత్తం:** 77 ఓవర్లలో 187 ఆలౌట్.
వికెట్లపతనం: 1-7, 2-13, 3-97, 4-113, 5-144, 6-144, 7-144, 8-163, 9-166, 10-187.
బౌలింగ్: మోర్కెల్ 17-5-47-2, ఫిలాండర్ 19-10-31-2, రబడ 19-7-39-3, ఎంగిడి 15-7-27-1, పెహెల్‌కావో 7-1-25-2.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ బ్యాటింగ్ 4, మార్క్రమ్ (సి) పార్థివ్ (బి) భువనేశ్వర్ 2, రబడ బ్యాటింగ్ 0, మొత్తం: 6 ఓవర్లలో 6/1.
వికెట్లపతనం: 1-3.
బౌలింగ్: భువనేశ్వర్ 3-2-3-1, బుమ్రా 3-2-3-0.

సైనా, సింధు శుభారంభం

- ఇండోనేషియా మాస్టర్స్





జకార్తా: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ ఇండోనేషియా మాస్టర్స్‌లో రెండో రౌండ్ చేరి శుభారంభం చేశారు. సైనా 22-24, 21-15, 21-14తో చెన్ యుఫై (చైనా)పై సింధు 21-13, 21-10తో హన్నా రమాదిని (ఇండోనేషియా)పై సునాయస విజయాన్ని నమోదు చేసింది. పురుషుల సింగిల్స్‌లో సమీర్, కశ్యప్ ఓటమిపాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్,చిరాగ్ జోడి 21-15, 21-17తో టకుటో, యుకీ (జపాన్)పై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో మనుఅత్రి, సుమీత్ జోడి 18-21, 21-16, 16-21తో లు చింగ్, యాంగ్ పో (చైనీస్‌తైపీ) చేతిలో ఓడిపోయింది.

భారత మహిళలకు క్లిష్టమైన డ్రా

వచ్చే నెలలో జరుగనున్న ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా షట్లర్ల జట్టుకు క్లిష్టమైన డ్రా ఎదురైంది. గ్రూప్ డబ్ల్యూలో భారత్‌తో పాటు జపాన్, హాంకాంగ్ జట్లు ఉన్నాయి. జపాన్ జట్టులో ప్రపంచ రెండో ర్యాంకర్ అకానె యమగూచి, ప్రపంచ చాంపియన్ ఒకుహరా నుంచి భారత షట్లర్లకు గట్టి పోటీ ఎదురుకానుంది. మరోవైపు భారత పురుషుల జట్టుకు సులువైన డ్రా లభించింది. గ్రూప్ డీలో భారత్‌తో పాటు ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మాల్దీవ్స్ జట్లు తలపడుతాయి.

శతక్కొట్టిన నాయర్

- జార్ఖండ్‌పై కర్ణాటక గెలుపు
- ముస్తాక్ అలీ టీ20 టోర్నీ

కోల్‌కతా: కర్ణాటక ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కరుణ్ నాయర్ సుడిగాలిలా చెలరేగి ఆడి 52 బంతుల్లోనే శతకం సాధించడంతో ఆ జట్టు జార్ఖండ్‌పై ఘన విజయంసాధించింది.. ముస్తాక్ అలీ టీ20 సూపర్‌లీగ్‌లో భాగంగా బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో నాయర్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడి 8 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో సెంచరీ(100) చేశాడు. ఇతనికి తోడు దేశ్‌పాండే (59) సత్తా చాటడంతో మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో చతికిలపడిన జార్ఖండ్ 14.2 ఓవర్లలోనే 78 పరుగులకే ఆలౌట్ అయి 123 పరుగుల తేడాతో ఓడింది. పదో నంబర్ ఆటగాడు వికాస్‌సింగ్ (25) టాప్ స్కోరర్. ఈ టోర్నీలోని మిగతా మ్యాచుల్లో బరోడాపై ఉత్తర ప్రదేశ్..తమిళనాడుపై బెంగాల్ గెలిచాయి. ఇక ముంబైతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఫైనల్లో పంజాబ్

న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్ ఎన్‌సీఆర్ పంజాబ్ రాయల్స్.. ప్రొ రెజ్లింగ్ లీగ్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన సెమీస్‌లో పంజాబ్ 50-39తో వీర్ మరాఠాస్‌పై గెలిచింది. 65 కేజీల్లో ఇలియాస్ (పంజాబ్) 10-4తో అమిత్‌పై, 76 కేజీల్లో లారోక్ (పంజాబ్) 4-3తో వాసిలాస్‌పై, 125 కేజీల్లో పెట్రిష్‌వాలి (పంజాబ్) 4-0తో లెవాన్‌పై, అనాస్థాసిజా (పంజాబ్) 16-0తో రితు మాలిక్‌పై గెలిచారు. 92 కేజీల్లో కెటోవ్ (వీర్) 9-2తో దీపక్ పూనియాను ఓడించి ఆధిక్యాన్ని 3-1కి తగ్గించింది. 57 కేజీల్లో పూజ దండా (పంజాబ్) 6-4తో మర్వా అమ్రిపై నెగ్గగా, ఉత్కర్ష్ కాలే (పంజాబ్) 0-9తో శ్రవణ్ చేతిలో ఓడాడు. 50 కేజీల్లో రితూ పోగట్ (వీర్) 6-2తో నిర్మలా దేవిపై గెలిచారు.

ఇదేం పిచ్: గంగూలీ

వాండరర్స్ పిచ్ బ్యాట్స్‌మెన్‌కు ఏమాత్రం సరిపోయే విధంగా లేదని భారత మాజీ కెప్టెన్ గంగూలీ అన్నాడు. ఈ విషయంలో ఐసీసీ జోక్యం చేసుకోవాలన్నాడు. 'ఇలాంటి పిచ్‌పై టెస్టు క్రికెట్ ఆడటం అన్యాయం. బ్యాట్స్‌మన్‌కు కొద్దిగైనా అవకాశం ఉండాలి. ఈ విషయాన్ని ఐసీసీ పరిశీలించాలి' అని దాదా ట్వీట్ చేశాడు.

విశ్వవిజేతలపై చిన్న 'చూపు'

- రచ్చ గెలిచినా.. ఇంట గెలవలేని దుస్థితి..?
- అంధుల ప్రపంచ కప్ విజేతల ఆవేదన



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆడితే చాలు.. కోట్లలో డబ్బు..గల్లీ క్రికెటర్ నుంచి జాతీయక్రికెటర్‌వరకు వారి స్థాయికి తగిన విధంగా పారితోషికాలు..ఇదంతా నాణేకి ఒకవైపు.. ఒకరు పాలమ్ముతారు.. మరొకరు ఆర్కెస్ట్రా సింగర్.. ఇంకా ఫామ్‌హౌజ్‌లో రోజు కూలీ.. వీరంతా మన అంధుల ప్రపంచకప్ చాంపియన్లు.. గత ఐదేండ్లలో రెండు వన్డే ప్రపంచకప్‌లు, రెండు టీ20 ప్రపంచకప్‌లు, ఒక ఆసియాకప్, 4 ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లు సాధించారు.. కానీ ఈ జట్టులోని 17 మందిలో 12 మందికి రోజువారీ కొలువు లేదు.. చాలీచాలని సంపాదనతో జీవితంలో కష్టాలను ఈదుతూ..కెరీర్‌ను కొనసాగించడం కూడా కష్టంగా మారిన దైన్యస్థితిలో ఉన్నారు.. గుజరాత్‌కు చెందిన ఆల్‌రౌండర్ గణేశ్ ముద్కర్ తల్లితండ్రులు వారి ఇంటికి సమీపంలోని వ్యవసాయక్షేత్రంలో రోజు కూలీలుగా పని చేస్తుండగా.. గణేశ్ చిన్న గ్రోసరీస్ దుకాణం నడుపుతున్నాడు. 'నా కుటుంబ సభ్యులు నన్ను క్రికెట్ ఆడడం మానేయమన్నా కొనసాగిస్తున్నాను. 2014 ప్రపంచకప్ సాధించిన అనంతరం గుజరాత్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ హామీ ఇచ్చింది. ఇప్పటికీ ఈ ఉద్యోగం ఇస్తారని ఎదురుచూస్తున్నాను' అని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆంధ్ర ప్రదేశ్ రాష్టానికి చెందిన ప్రేమ్ కుమార్ బీ1కేటగిరి(పూర్తి అంధుడు). ప్రపంచకప్ చాంపియన్‌షిప్ సాధించిన జట్టులో ఉన్నా జీవనం గడిపేందుకు ఆర్కెస్ట్రా బృందంలో సభ్యుడిగా పని చేస్తున్నాడు. నెలకు రెండు మూడు ప్రదర్శనలు మాత్రమే చేస్తూ ప్రతీ ప్రదర్శనకు రూ.1000 నుంచి రూ.1500 వరకు సంపాదిస్తున్నానని తెలిపాడు. గుజరాత్‌కు చెందిన మరో ఆల్‌రౌండర్ ఆర్య ఇంటింటికీ తిరిగి పాలుపోస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇక జట్టు కెప్టెన్ అజయ్ రెడ్డిది మరో దీనగాథ.. వ్యాయామవిద్య శిక్షకుడిగా ఉద్యోగాన్ని కాంట్రాక్ట్ పద్ధతిలో చేస్తున్నానని, ఈ ఉద్యోగంతో క్రికెట్ ఆడుతూ కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉన్నదని విషాదంగా వెల్లడించాడు. చూపులేకపోయినా దేశం ఖ్యాతిని పెంచుతున్న తామంతా కోహ్లీ, ధోనీల కంటే తీసిబోమన్నాడు.. భారత అంధుల క్రికెట్ అసోసియేషన్(సీఏబీఐ)కి భారత క్రికెట్ నియంత్రణ సంస్థ(బీసీసీఐ) గుర్తింపు లేకపోవడంతోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని భారత అంధుల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్, సీఏబీఐ కార్యదర్శి జాన్ డేవిడ్ చెప్పాడు. ప్రాక్టీస్ కొనసాగించడానికి మైదానాలతోపాటు కనీస వసతుల లేమితో అంధుల క్రికెట్ భవిష్యత్‌పై ఆందోళన కలుగుతున్నట్లు వివరించాడు.



బుధవారం ప్రగతిభవన్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షులు పల్లె రవికుమార్ తన కుమార్తెల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించిన దృశ్యం

లాల్ బహదూర్ శాస్త్రి ఆరెస్సెస్ వ్యతిరేకి కాదు

బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ

న్యూఢిల్లీ: దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆరెస్సెస్‌కు వ్యతిరేకి కాదని బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ తెలిపారు. 'నెహ్రూ లాగా శాస్త్రీజీ సైద్ధాంతికంగా జనసంఘ్, ఆరెస్సెస్‌ల పట్ల ద్వేష భావనతో ఉన్నవ్యక్తి కాదు. ఆయన ప్రధానిగా ఉన్నకాలంలో నాటి ఆరెస్సెస్ అధిపతి గోల్వాల్కర్‌తో దేశ సమస్యలపై చర్చించేవారు' అని వెల్లడించారు.